॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ అష్టమోఽధ్యాయః - అక్షరబ్రహ్మయోగః

## (ఎనిమిదవ అధ్యాయము - అక్షరబ్రహ్మయోగము)

ఎనిమిదవ అధ్యాయం ప్రాథమికంగా, ఏడవ అధ్యాయంలోని ఆఖరి రెండు శ్లోకాలమీద ఆధారపడివుంది. ఆ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ ఆరు సాంకేతిక పదాలను పరిచయం చేశాడనీ, వాటి గురించి వివరించలేదనీ చూశాము. ఆ పదాలు ఒకసారి గుర్తు తెచ్చుకుంటే, అవి – బ్రహ్మ, కర్మ, అధ్యాత్మము, అధిభూతము, అధిదైవము, అధియజ్ఞము.

ఈ ఆరు పదాలు చెప్పాక, మరణకాలంలో తనను తలుచుకోవటం గురించి చెప్పాడు. సహజంగానే అది అర్జునునిలో కుతూహలాన్ని కలుగజేసింది. మరణకాలంలో ఈశ్వరస్మరణ ఎందుకు చెయ్యాలి. ఇది ఏడవ ప్రశ్న. అర్జునుడు ఆరు పదాల గురించి ఆరు ప్రశ్నలు, ఈశ్వరస్మరణ గురించి ఏడవ ప్రశ్న వేస్తాడు ఈ అధ్యాయంలో. వాటికి జవాబులు ఈ అధ్యాయంలో వస్తాయి. వాటికి జవాబులతో పాటు కృష్ణపరమాత్మ ముఖ్య అంశమైన ఉపాసనను పరిచయం చేస్తాడు. ఈ ఖండంలో ముఖ్య అంశాల్లో ఒకటి ఈశ్వర ఉపాసన అని చూశాము. ఈశ్వర ఉపాసన అంటే సగుణ ఈశ్వరధ్యానం. మొదటి షట్కంలో కర్మయోగసాధన గురించి చెపితే, రెండవ షట్కంలో ఉపాసనయోగసాధన గురించి చెపుతాడు కృష్ణపరమాత్మ.

ముందు అధ్యాయంలోని కృష్ణపరమాత్మ చెప్పిన ఆ శ్లోకాలను మళ్ళీ ఒకసారి చూద్దాము.

**జరామరణమోక్షాయ మామాశ్రిత్య యతంతి యే ।**
**తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమ్ అధ్యాత్మం కర్మ చాఖిలమ్ ॥** – 7.29

**సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః ।**
**ప్రయాణకాలేఽపి చ మాం తే విదుర్యుక్తచేతసః ॥** – 7.30

ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ చెప్పిన అంశాలమీద అర్జునుడు వేసిన ప్రశ్నలతో ఈ అధ్యాయం మొదలవుతుంది. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయంలోకి అడుగు పెడదాము.

**అర్జున ఉవాచ**

శ్లో. 1 **కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ ।**
**అధిభూతం చ కిం ప్రోక్తమ్ అధిదైవం కిముచ్యతే ॥**
కిమ్, తత్, బ్రహ్మ, కిమ్, అధ్యాత్మమ్, కిమ్, కర్మ, పురుషోత్తమ,
అధిభూతమ్, చ, కిమ్, ప్రోక్తమ్, అధిదైవమ్, కిమ్, ఉచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| పురుషోత్తమ! | = ఓ పురుషోత్తమా! | కిమ్ | = ఏమిటి? |
| తత్ | = ఆ | అధిభూతమ్ | = అధిభూతము అని |
| బ్రహ్మ | = బ్రహ్మము అంటే | కిమ్, ప్రోక్తమ్ | = ఏది చెప్పబడినది |
| కిమ్ | = ఏమిటి? | చ | = ఇంకా |
| అధ్యాత్మమ్ | = అధ్యాత్మము అంటే | అధిదైవమ్ | = అధిదైవము అని |
| కిమ్ | = ఏమిటి? | కిమ్, ఉచ్యతే | = ఏది చెప్పబడును? |
| కర్మ | = కర్మ అంటే | | |

**హే పురుషోత్తమ! తత్ బ్రహ్మ కిమ్? అధ్యాత్మమ్ కిమ్? కర్మ కిమ్?**
**అధిభూతమ్ కిమ్ ప్రోక్తమ్? అధిదైవమ్ చ కిమ్ ఉచ్యతే ॥**

తా: ఓ పురుషోత్తమా! ఆ బ్రహ్మము అంటే ఏమిటి? అధ్యాత్మము అంటే ఏమిటి? కర్మ అంటే ఏమిటి? అధిభూతము అని ఏది చెప్పబడినది ఇంకా అధిదైవము అని ఏది చెప్పబడును?

**1. ఏడు ప్రశ్నలు, ఆరు జవాబులు – శ్లోకాలు 1-4**

అర్జునుడు అడగబోయే ఏడు ప్రశ్నల్లో ఐదు ప్రశ్నలు మొదటి శ్లోకంలోనే వచ్చేశాయి.

1. **తత్ బ్రహ్మ కిమ్** – ఆ బ్రహ్మ ఎవరు? తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమ్ అన్నావు కదా! అందులో బ్రహ్మ ఎవరు?

2. **కిమ్ అధ్యాత్మమ్** – అధ్యాత్మము అంటే ఏమిటి?

3. **కిం కర్మ** – కర్మ అంటే ఏమిటి? కర్మ అంటే మామూలు అర్థం పని, కాని కర్మయొక్క ప్రాముఖ్యత ఏమిటి?

4. **అధిభూతం కిం ప్రోక్తమ్** – అధిభూతము అంటే ఏమిటి? ఈ పదాన్ని కిందటి అధ్యాయంలో 30వ శ్లోకంలో చూశాము.

5. **అధిదైవం కిముచ్యతే** – అధిదైవం అంటే ఏమిటి? 30వ శ్లోకంలో సాధిభూతాధిదైవం అన్నాడు కృష్ణపరమాత్మ.

**పురుషోత్తమ** – ఇది ఇంకొక ప్రశ్న కాదు; కృష్ణపరమాత్మను అలా సంబోధిస్తున్నాడు. హే కృష్ణా, ఈ ఐదు ప్రశ్నలకు జవాబు చెప్పు. ఇంకా ప్రశ్నలు పూర్తి కాలేదు. రాబోయే దాంట్లో తక్కిన ప్రశ్నలు వేస్తాడు అర్జునుడు.

శ్లో. 2 **అధియజ్ఞః కథం కోఽత్ర దేహేఽస్మిన్ మధుసూదన ।**
**ప్రయాణకాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః ॥**
అధియజ్ఞః, కథమ్, కః, అత్ర, దేహే, అస్మిన్, మధుసూదన,
ప్రయాణకాలే, చ, కథమ్, జ్ఞేయః, అసి, నియతాత్మభిః ॥

| | | | |
|---|---|---|---|
| మధుసూదన! | = ఓ మధుసూదనా! | చ | = ఇంకా |
| అత్ర | = ఇచట | ప్రయాణకాలే | = అంత్యకాలమున |
| అధియజ్ఞః | = అధియజ్ఞము అంటే | నియతాత్మభిః | = మనస్సును పరమాత్మునియందు లగ్నము చేసిన యోగులచే |
| కః | = ఏమిటి? | కథమ్ | = ఏవిధముగా |
| అస్మిన్ | = ఈ | జ్ఞేయః, అసి | = (నీవు) తెలిసికొనబడతావు? |
| దేహే | = దేహమునందు | | |
| కథమ్ | = అది ఎలా ఉంటుంది? | | |

**హే మధుసూదన! అత్ర అస్మిన్ దేహే అధియజ్ఞః కః కథమ్ (చ అస్తి)**
**ప్రయాణ-కాలే చ నియత-ఆత్మభిః కథమ్ జ్ఞేయః అసి ॥**

తా: ఓ మధుసూదనా! ఇచట అధియజ్ఞము అంటే ఏమిటి? ఈ దేహమునందు అది ఎలా ఉంటుంది? ఇంకా అంత్యకాలమున మనస్సును పరమాత్మునియందు లగ్నము చేసిన యోగులచే ఏవిధముగా నీవు తెలిసికొనబడతావు?

6 ఎ) **అధియజ్ఞః కః** – అధియజ్ఞము అంటే ఏమిటి? దీనికి ఇంకో ప్రశ్నను జత చేస్తున్నాడు అర్జునుడు.

6 బి) **కథమ్ అస్మిన్ దేహే (వర్తతే)** – ఈ అధియజ్ఞము ఈ శరీరంలో ఎలా ఉంటుంది?

అర్జునునికి అధియజ్ఞము అంటే ఏమిటో తెలియనప్పుడు, అది మన శరీరంలో ఉంటుందని ఎలా తెలుసు? బహుశ ఎక్కడైనా విన్నాడేమో అనుకోవాలి. ఇప్పుడు ఏడవ ప్రశ్నలోకి అడుగు పెట్టబోతున్నాము. అందులో కూడా రెండు భాగాలున్నాయి.

7 ఎ) మరణకాలంలో దేవుణ్ణి తలుచుకోవటంలో ఏదైనా ప్రత్యేకత ఉందా? ఉంటే అది ఏమిటి? ఇది ఏడవ ప్రశ్నలో ఒక భాగం.

7 బి) రెండవ భాగం, మరణకాలంలో భగవంతుణ్ణి ఎలా తలుచుకోగలము? అన్ని అంగాలూ చక్కగా పని చేస్తున్నప్పుడే, భగవంతుణ్ణి తలుచుకోవటం చాలా తక్కువ. పోనీ అని ధ్యానం చేద్దామని కూర్చుంటే భగవంతుడు గుర్తుకురావటం బ్రహ్మప్రళయం అయిపోతుంది. భగవంతుడు తప్ప అన్ని విషయాలూ గుర్తుకొస్తాయి. అలాంటప్పుడు మరణకాలంలో ఎలా గుర్తుకు వస్తాడు?

**ప్రాణ ప్రయాణ సమయే కఫవాతపిత్తైః**
**కంఠావరోధనవిధౌ స్మరణం కుతస్తే॥**

మరణకాలంలో అన్ని ఇంద్రియాలూ శక్తివిహీనం అవుతుంటే, అప్పుడెలా దేవుణ్ణి తలుచుకోగలము? దానికి ఏదైనా ప్రత్యేక మార్గం ఉందా? ఉంటే అది నాకు చెప్పు. అదే చెబుతున్నాడు ఇక్కడ.

**ప్రయాణకాలే** – మామూలు ప్రయాణం కాదు, మరణకాలంలో అంటే అంతిమ ప్రయాణసమయంలో;

**కథం జ్ఞేయః అసి** – నిన్ను గుర్తు తెచ్చుకోవటమెలా? ఎవరి గురించి అడుగుతున్నాడు?

**నియతాత్మభిః** – నీయందు మనస్సు లగ్నం చేసినవారు. అంటే మనోనిగ్రహం ఉన్నవారు. ఆ క్షణంలో భగవంతుని తలుచుకోవాలంటే చాలా ఆత్మనిగ్రహం ఉండివుండాలి. ఇది ఏడవ ప్రశ్న.

**మధుసూదన** – హే మధుసూదన అని సంబోధిస్తున్నాడు అర్జునుడు. మధు అనే రాక్షసుడిని సంహరించటంవల్ల కృష్ణపరమాత్మకు మధుసూదనుడు అనే పేరు వచ్చింది. అంతేకాకుండా వేదాంతపరిభాషలో మధు అంటే కర్మలు అని కూడా వస్తుంది. ముండకోపనిషత్తులో కర్మఫలానికి మధు పదం వచ్చింది. అందువల్ల మధు అంటే కర్మలుగా తీసుకుంటే, మధుసూదనుడు అంటే సంచిత, ఆగామి, ప్రారబ్ధకర్మలను నాశనం చేసి మోక్షాన్ని ఇచ్చేవాడు అని అర్థం వస్తుంది. అందువల్ల, హే కృష్ణా, నా ప్రశ్నలకు జవాబు చెప్పు.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 3 **అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మముచ్యతే ।**
**భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః ॥**

అక్షరమ్, బ్రహ్మ, పరమమ్, స్వభావః, అధ్యాత్మమ్, ఉచ్యతే,
భూతభావోద్భవకరః, విసర్గః, కర్మసంజ్ఞితః ॥

| | | | |
|---|---|---|---|
| పరమమ్ | = సర్వశ్రేష్ఠుడైన | ఉచ్యతే | = చెప్పబడును |
| అక్షరమ్ | = శాశ్వతుడైన, పురుషోత్తముని | భూత భావోద్భవకరః | = సకల ప్రాణుల ఉత్పత్తి అభ్యుదయములకు కారణమైన |
| బ్రహ్మ | = బ్రహ్మ అంటారు | | |
| స్వభావః | = స్వస్వరూపము అంటే జీవాత్మ | విసర్గః | = సృష్టించు క్రియయే |
| అధ్యాత్మమ్ | = అధ్యాత్మము అని | 'కర్మ' సంజ్ఞితః | = కర్మ అనబడును |

**అక్షరమ్ పరమమ్ బ్రహ్మ, స్వభావః అధ్యాత్మమ్ ఉచ్యతే,**
**భూత–భావ–ఉద్భవ–కరః విసర్గః కర్మ–సంజ్ఞితః ॥**

తా: సర్వశ్రేష్ఠుడైన శాశ్వతుడైన, పురుషోత్తముని బ్రహ్మ అంటారు. స్వస్వరూపము అంటే జీవాత్మ అధ్యాత్మము అని చెప్పబడును. సకలప్రాణుల ఉత్పత్తి అభ్యుదయములకు కారణమైన సృష్టించు క్రియయే కర్మ అనబడును.

కృష్ణపరమాత్మ జవాబులు చెప్పటం మొదలుపెడతాడు.

1. **పరమమ్ అక్షరం బ్రహ్మ** – మొదటి ప్రశ్న – **తత్ బ్రహ్మ కిమ్**? దానికి జవాబు – ఆ బ్రహ్మ **పరమమ్ అక్షరం బ్రహ్మ.** అక్షరం అంటే **న క్షరతి, న నశ్యతి ఇతి అక్షరమ్**. అంటే నాశనము కానిది అక్షరం. పరమం అంటే సర్వశ్రేష్ఠమైనది, శాశ్వతమైనది.

పరమం పదం ఎందుకు కలిపాడు కృష్ణపరమాత్మ? కేవలం అక్షరం అంటే అది మన అక్షరమాలలోని అక్షరాలు అవచ్చు. అందువల్లనే చిన్న పిల్లలను పాఠశాలలో ప్రవేశపెట్టేముందు వారికి అక్షరాభ్యాసం చేస్తారు. అందువల్ల అటువంటి పొరపాటు పడకుండా పరమమ్ అక్షరం అన్నాడు కృష్ణపరమాత్మ. క్షరతి ఇతి క్షరః –

నశించేది క్షరం; నశించనది అక్షరం. ముండకోపనిషత్తు బ్రహ్మను అక్షరం బ్రహ్మ అని వర్ణిస్తుంది.

**అథ పరా యయా తదక్షరమధిగమ్యతే** – ముండకం 1.1.5
**యత్తదద్రేశ్యమగ్రాహ్యమగోత్రమవర్ణం మచక్షుశ్శోత్రమ్**
**తదపాణిపాదం నిత్యం విభుమ్ సర్వగతం సుసూక్ష్మం**
**తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యంతి ధీరాః** – ముండకం 1.1.6

క్షరం కానిది ఏమిటి? సర్వగత చైతన్యతత్త్వం; ఏడవ అధ్యాయం పరిభాషలో చెప్పాలంటే అపరాప్రకృతి నాశనమవుతుంది కాని, పరాప్రకృతి అయిన చైతన్యతత్త్వం నాశనమవదు.

బ్రహ్మ అంటే ఏమిటి? అనంత చైతన్యతత్త్వం బ్రహ్మ. **బృహతమత్వాత్ బ్రహ్మ.** బృహ్ ధాతువునుంచి వచ్చింది బ్రహ్మపదం. అంటే చాలా పెద్దది. పెద్దది పదం విశేషణం కాదు, నామవాచకం ఇక్కడ. అనంతతత్త్వాన్ని బ్రహ్మ అంటారు. ఇక్కడితో మొదటి ప్రశ్నకు జవాబు అయిపోయింది. దీన్ని ఇంతకన్నా వివరించి చెప్పదు. ఎందుకంటే ముందు అధ్యాయంలోనే పరాప్రకృతి కింద వివరించాడు. ఇంకా తెలుసుకోవాలనుకుంటే ఏడవ అధ్యాయంలో 4–10 శ్లోకాలను మళ్ళీ ఒకసారి చూడాలి.

కృష్ణపరమాత్మ బోధ ఈ అధ్యాయంలో అక్షరం బ్రహ్మపదంతో ప్రారంభమవుతున్నది కాబట్టి ఈ అధ్యాయానికి **అక్షరబ్రహ్మయోగము** అనే పేరు వచ్చింది.

2. **స్వభావః అధ్యాత్మమ్ ఉచ్యతే** – రెండవ ప్రశ్న ఏమిటి? **కిమ్ అధ్యాత్మమ్?** దానికి జవాబు, సర్వవ్యాపకమైన చైతన్యం శరీరంలో ఉన్నప్పుడు దాన్ని అధి ఆత్మమ్ అంటే అధ్యాత్మమ్ అంటారు. సర్వవ్యాపకమైన చైతన్యం శరీరంలో కూడా ఉండాలి కదా. ఇక్కడ అధ్యాత్మమ్‌లో ఆత్మ అంటే శరీరం; అధి ఆత్మమ్ అంటే **శరీరంలో ఉన్న చైతన్యం.** అందువల్ల సమష్టిపరంగా చైతన్యాన్ని చూస్తే ఆ చైతన్యం పేరు బ్రహ్మ; అదే చైతన్యాన్ని వ్యష్టిపరంగా చూస్తే ఆ చైతన్యం అధ్యాత్మము. స్వభావః అంటే లోపల ఉన్న చైతన్యం.

ఇంకో విధంగా చెప్పాలంటే బ్రహ్మ పరమాత్మ; అధ్యాత్మము జీవాత్మ. రెండింటిలో ఉన్న చైతన్యం ఒకటే. దానినే సమష్టి పరంగా చూస్తే పరమాత్మ, వ్యష్టిపరంగా చూస్తే జీవాత్మ. రెండు భిన్నసందర్భాలలో రెండు భిన్నపదాలు వాడుతున్నాము. అంతే.

మన నిజజీవితంలో కూడా అంతేకదా! ఒకే వ్యక్తి భార్య పరంగా భర్త; పిల్లల పరంగా తండ్రి; తన తండ్రి పరంగా తనయుడు. ఒకే వ్యక్తి భర్త, తండ్రి, తనయుడు ఎలా కాగలడు? సాంకేతికంగా చెప్పాలంటే దీన్ని **శబ్దప్రకృతి నిమిత్తం** అంటారు. మామూలుగా చెప్పాలంటే ఎదుటి వ్యక్తిని బట్టి మారుతుంది.

ఈ విధంగా ఒకే చైతన్యం బ్రహ్మ అయింది సమష్టిపరంగా; అధ్యాత్మము అయింది వ్యష్టిపరంగా. దీనితో రెండవ ప్రశ్నకు జవాబు వచ్చింది.

3. **భూతభావోద్భవకరో విసర్గః** – మూడవ ప్రశ్న ఏమిటి? **కిం కర్మ?** కర్మ అంటే ఏమిటి? మనుష్యులు

ప్రయత్నపూర్వకంగా చేసే చేష్టను, అంటే తర్వాత వచ్చే సృష్టికి కారణభూతమైన పనులను కర్మ అంటారు. విసర్గ అంటే మనం చేసే పనులు. సృష్టి అనుకోకుండా జరిగినది కాదు అంటుంది శాస్త్రం. ముందు జన్మలలో మనం చేసుకున్న కర్మల ఫలితమే మన ఈ జన్మ. ఇక్కడ మనం మానవశరీరంతో పుట్టామంటే అది అనుకోకుండా జరగలేదు. దానికి మన పూర్వజన్మ కర్మఫలమే కారణం. (వ్యష్టిజన్మ వ్యష్టిపుణ్యపాపాలమీద ఆధారపడితే, సమష్టిప్రపంచసృష్టి సమష్టికర్మల పుణ్యపాపాలమీద ఆధారపడివుంటుంది.)

ఉద్భవకరః అంటే పుట్టేలాగా చేసేది; భూతభావోద్భవకరః అంటే ప్రతి ఒక్క జీవియొక్క సృష్టిని తీసుకు వచ్చేది. ఒక దోమ దోమగా పుట్టినా, ఒక ఏనుగు ఏనుగుగా పుట్టినా అవి చేసుకున్న కర్మఫలితాలు అవి. అంతేకాదు, నా కర్మ నా శరీరాన్ని మాత్రమే నిర్ణయించదు, నా తల్లిదండ్రులను కూడా నిర్ణయిస్తుంది. నా కుటుంబాన్ని నిర్ణయిస్తుంది. నా తల్లిదండ్రులు నన్ను బాగా చూసుకున్నా, నన్ను పట్టించుకోకపోయినా, అది నేను చేసుకున్న పుణ్యపాపాలమీద ఆధారపడివుంటుంది. చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా అంటారు. మనం చేసుకున్న కర్మలు మంచివా, చెడ్డవా అని ఇంకొకరు చెప్పనవసరం లేదు. మనం ఉన్న పరిస్థితులు, మన తల్లిదండ్రులు, మన పిల్లలు ఉన్న తీరుతెన్నులను బట్టి మనమే తెలుసుకోవచ్చు. మనం చేసుకున్న కర్మలవల్ల వారు వస్తే, వారు చేసుకున్న కర్మలవల్ల మనం వారికి పుట్టాము. మనకు పరమార్థానందస్వామిలాంటి మంచిగురువు దొరికారంటే, మనం చేసుకున్న పుణ్యకర్మలవల్ల!

**ఈశ్వరానుగ్రహాదేవపుంసాం అద్వైత వాసన**

అందువల్ల ఇప్పటి సృష్టి మొత్తాన్ని తీసుకుంటే అది పూర్వ సృష్టియొక్క ఫలితం. అలాగే రాబోయే సృష్టి ఇప్పటి సమష్టి కర్మల ఫలం.

**కర్మ = భవిష్యత్ సృష్టికారణం**

గుర్తుంచుకోండి, ఈ సృష్టి వచ్చింది అంటే దానికి కారణం భగవంతుని కోరిక కాదు. మనం కోరి తెచ్చుకున్నాము దీన్ని. అందువల్ల భగవంతుణ్ణి నిందించటము అనవసరం.

**పుణ్యేన పుణ్యం లోకం భవతి పాపేన పాపం భవతి**
**ఉభాభ్యామ్ ఏవ మనుష్యలోకమ్** – ప్రశ్నోపనిషత్తు

14 లోకాలు ఉన్నాయంటే అవి భగవంతుడు సరదాకోసం సృష్టించినవి కావు. మనం చేసుకున్న అన్ని రకాల పుణ్యపాపాల కర్మలను అనుభవించటానికి సృష్టింపబడ్డాయి. అంటే ఒక్కముక్కలో చెప్పాలంటే అంతా కర్మమీద ఆధారపడివుంది. అందువల్ల కర్మను భూతభావ ఉద్భవకరః అన్నాడు కృష్ణపరమాత్మ. అంటే **భవిష్యత్ సృష్టియొక్క కారణం కర్మ.**

**కర్మసంజ్ఞితః** – అందులో నా వంతు కర్మను కర్మసంజ్ఞితః అన్నాడు కృష్ణపరమాత్మ. ఈ శ్లోకంలో మూడుప్రశ్నలకు జవాబులు చెప్పాడు.

శ్లో. 4 **అధిభూతం క్షరో భావః పురుషశ్చాధిదైవతమ్ ।**
**అధియజ్ఞోఽ_హమేవాత్ర దేహే దేహభృతాం వర ॥**
అధిభూతమ్, క్షరః, భావః, పురుషః, చ, అధిదైవతమ్,
అధియజ్ఞః, అహమ్, ఏవ, అత్ర, దేహే, దేహభృతామ్, వర ॥

| | | | |
|---|---|---|---|
| దేహభృతామ్ వర! | = దేహధారులలో (శేష్ఠుడైన ఓ అర్జునా! | అధిదైవతమ్ | = అధిదైవము ఇంకా |
| భావః, క్షరః | = ఉత్పత్తి, వినాశశీలములైన పదార్థములన్నియును | అత్ర, దేహే | = ఈ దేహము(ల)లో అంతర్యామిగా నున్న |
| అధిభూతమ్ | = అధిభూతములు అనబడును | అహమ్, ఏవ | = నేనే |
| పురుషః | = హిరణ్మయుడైన పురుషుడు | అధియజ్ఞః | = అధియజ్ఞమును |

**హే దేహ-భృతామ్ వర! క్షరః భావః అధిభూతమ్, పురుషః**
**అధిదైవతమ్, అత్ర దేహే చ అహమ్ ఏవ అధియజ్ఞః ॥**

తా: దేహధారులలో (శేష్ఠుడైన ఓ అర్జునా! ఉత్పత్తి, వినాశశీలములైన పదార్థములన్నియును అధిభూతములు అనబడును. హిరణ్మయుడైన పురుషుడు అధిదైవము ఇంకా ఈ దేహము(ల)లో అంతర్యామిగా నున్న నేనే అధియజ్ఞమును.

ఇందులో మరో మూడు (ప్రశ్నలకు జవాబులు చెపుతున్నాడు.

4. **అధిభూతం క్షరో భావః** – నాలుగవ (ప్రశ్న ఏమిటి? **అధిభూతం కిం (ప్రోక్తమ్** – అధిభూతమంటే ఏమిటి? దానికి జవాబు **సృష్టిలో నాశనమయ్యే (ప్రతిదీ అధిభూతము.** భావః అంటే పదార్థము. మనం అనుభవించేదేదైనా అధిభూతము. ఎందుకంటే అది క్షరమవుతుంది. ఇంతకు ముందు (బహ్మ గురించి చూసినప్పుడు (బహ్మ అక్షరం అన్నాము. అంటే నాశనము లేనిది అన్నాము; ఇప్పుడు అధిభూతము అంటే క్షరము అంటున్నాము. అంటే నాశనమయ్యేది. పంచభూతాలు, సూర్యుడు, నక్ష(తాలు, చం(దుడు అధిభూతము కిందకి వస్తాయి. నదులు, కొండలు కూడా అధిభూతము కిందకి వస్తాయి. అంతేకాదు మన స్థూలశరీరాలు కూడా అధిభూతము కిందకే వస్తాయి, ఎందుకంటే అవి కూడా క్షరమవుతాయి కాబట్టి.

5. **పురుషశ్చాధిదైవతమ్** – ఐదవ (ప్రశ్న ఏమిటి? **అధిదైవం కిముచ్యతే?** అధిదైవం అంటే ఏమిటి? దానికి జవాబు **పురుషః**. పురుషః అంటే ఇక్కడ హిరణ్యగర్భ.

తత్త్వబోధ నిర్వచనం చూస్తే – సమష్టి సూక్ష్మ శరీర సహిత చైతన్యం హిరణ్యగర్భ. ఇంకో విధంగా చెప్పాలంటే హిరణ్యగర్భ సమష్టిబుద్ధి; వ్యష్టిపరంగా మనకు 19 అంశాలున్నాయి. వాటన్నిటికీ అధిష్ఠాన దేవతలు ఉన్నారు. ఉదాహరణకు కంటికి అధిష్ఠానదేవత సూర్యుడు, చెవులకు అధిష్ఠాన దేవత దిగ్దేవత; ఈ అధిష్ఠాన దేవతలందరికీ అధిష్ఠాన దేవత హిరణ్యగర్భ.

**అధిదైవము = హిరణ్యగర్భ; సమష్టి బుద్ధి**

6ఎ. **అధియజ్ఞః అహమ్ ఏవ** – ఆరవ ప్రశ్న ఏమిటి? **అధియజ్ఞః కః** – అధియజ్ఞము అంటే ఏమిటి? అధియజ్ఞాన్ని నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. నేనే అంటే **ఈశ్వరుడు.** ఈశ్వరుని గురించిన తత్త్వబోధ నిర్వచనం చూస్తే – సమష్టి కారణశరీరసహితచైతన్యం ఈశ్వరః. సమష్టికారణశరీరం అంటే సమష్టికారణప్రపంచం. కారణప్రపంచం అంటే అవ్యక్తరూపంలో ఉన్న సృష్టి. కారణప్రపంచాన్ని శక్తి లేదా మాయ అంటారు.

**నిర్గుణ బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు**

ఆ ఈశ్వరుడు ఎవరంటే దిక్కులు చూడకు. నేనే ఆ ఈశ్వరుడిని. నేనే ఈ సృష్టికి కారణాన్ని. పురాణగాథలో ప్రళయం సంభవించి, అంతా నాశనమయ్యాక, మర్రిచెట్టు ఆకుపై ఉన్న చిన్నికృష్ణుడు నీటిలో తేలుతున్నట్టుగా వర్ణిస్తారు. నీరు, ఆకు ప్రపంచంయొక్క బీజాన్ని సూచిస్తే, కృష్ణపరమాత్మ చైతన్యతత్త్వాన్ని సూచిస్తాడు.

**అధియజ్ఞం = ఈశ్వరుడు = చైతన్యతత్త్వం + అవ్యక్త ప్రపంచం**

దీనితో ఆరవ ప్రశ్నలో ఒక భాగం అయింది. అర్జునుడు ఇంకొకటి కూడా అడిగాడు. ఏమిటది? 6బి) **కథమ్ అస్మిన్ దేహే (వర్తతే)**? ఈ అధియజ్ఞము ఈ శరీరంలో ఎలా ఉంటుంది?

అధియజ్ఞానికి, అధిదైవానికి మధ్య భేదం ఏమిటి?

**హిరణ్యగర్భ = సమష్టి సూక్ష్మశరీరసహితచైతన్యం = అధిదైవమ్**
**ఈశ్వరుడు = సమష్టి కారణశరీరసహితచైతన్యం = అధియజ్ఞం**

ఈ ఈశ్వరుడు ఎక్కడున్నాడు? అత్ర దేహే.

**దేహభృతాం వర** – అంతకు ముందు అర్జునుడు కృష్ణపరమాత్మను మధుసూదనా అని సంబోధిస్తే, కృష్ణపరమాత్మ అర్జుణ్ణి దేహభృతాం వర అని సంబోధిస్తున్నాడు. దేహధారులలో శ్రేష్ఠమైనవాడా అని అర్థం. అంటే మనుష్యులలో శ్రేష్ఠుడు. ఈశ్వరుడు మన శరీరంలో ఉన్నాడు అని పదేపదే వస్తుంది.

**అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః – 10.20**
**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి – 18.61**

మనుష్యులలో ఉన్నాడు కాబట్టి భగవంతుణ్ణి నారాయణ అంటారు. **నారం అంటే జీవ సమూహం**; అయనం అంటే నివాసస్థలం. అందువల్ల ప్రతి జీవి కూడా భగవంతుని నివాసస్థలం. అందువల్ల ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడు? **అత్ర దేహే వర్తతే**. ఎలా ఉన్నాడు? **ప్రాజ్ఞరూపేణ.**

**ప్రాజ్ఞరూపేణ ఈశ్వరః అస్మిన్ దేహే వర్తతే**

మళ్ళీ తత్త్వబోధ గుర్తుకు తెచ్చుకోవాలి. బింబచైతన్యం సమష్టిపరంగా మూడు ప్రతిబింబాలుగా, వ్యష్టిపరంగా మూడు ప్రతిబింబాలుగా ప్రతిబింబిస్తుంది.

**బింబ చైతన్యం**

| సంఖ్య | శరీరం | నామం | సంఖ్య | ప్రపంచం | నామం |
|---|---|---|---|---|---|
| **1.** | **కారణశరీరం** | **ప్రాజ్ఞ** | **4.** | **కారణప్రపంచం** | **ఈశ్వర** |
| **2.** | **సూక్ష్మశరీరం** | **తైజస** | **5.** | **సూక్ష్మప్రపంచం** | **హిరణ్యగర్భ** |
| **3.** | **స్థూలశరీరం** | **విశ్వ** | **6.** | **స్థూలప్రపంచం** | **విరాట్** |

సమష్టి కారణప్రపంచంలో ఉన్న ఈశ్వరుడు, జీవిలో ప్రాజ్ఞగా కారణశరీరంలో ఉంటాడు.

అయితే భగవంతుడు కైలాసంలో, వైకుంఠంలో ఉన్నాడా, లేదా? భగవంతుడు సర్వవ్యాపకుడు. అందువల్ల కైలాసం, వైకుంఠాలలో మాత్రమే కాదు; కైలాసం, వైకుంఠాలలో **కూడా** ఉన్నాడు. అదే భగవంతుడు మన హృదయంలో అధియజ్ఞంగా ఉన్నాడు.

యజ్ఞం అంటే మనం చేసే ప్రతి పూజ, ప్రార్థన, కర్మ – అన్నీ వస్తాయి. భగవంతుడు మన యజ్ఞాలతో ఎలా ముడిపడి ఉన్నాడు?

**యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।**
**తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ ॥** – 7.21

కృష్ణపరమాత్మ తానే చెప్పాడు – ఎవరే పూజ చేసినా తనే ఆ పూజను అందుకుంటాననీ, మళ్ళీ ఆ పూజా ఫలాన్ని కూడా ఇస్తాననీను. అంటే ఆయన యజ్ఞభోక్త, యజ్ఞకర్మ, యజ్ఞఫలదాత కూడా. మన హృదయంలోనే ఉండి మన పూజలను అందుకుని ఫలాలు ఇస్తాడు. అందువల్ల దేవుడు నేను చేసిన పూజలు అందుకున్నాడో లేదోననే సందేహం, బెంగ అవసరం లేదు మనకు. మనం చేసిన ప్రతి చిన్నకర్మ కూడా – అది మంచిదైనా, చెడ్డదైనా భగవంతునికి తెలిసిపోతుంది. ఆయన దానికి తదనుగుణంగా మనకు మంచి ఫలాన్నివ్వటమో, చెడ్డ ఫలాన్నివ్వటమో చేస్తాడు.

వైదికధర్మాన్ని పాటించే వ్యక్తికి ప్రతికర్మఫలం కూడా ఈశ్వరప్రసాదం. అలాంటప్పుడు ఏదైనా సమస్య వస్తే నాకే ఎందుకు వచ్చింది, నేనే ఎందుకు బాధపడాలి అని బాధపడే ప్రసక్తే లేదు. మనకు నిన్న చేసిన పనే గుర్తుండదు; అలాంటప్పుడు ఎప్పుడో చేసిన కర్మలు ఎలా గుర్తుంటాయి? పూర్వజన్మలో చేసిన కర్మలు ఎలా తెలుస్తాయి? మనకు గుర్తుండనంత మాత్రాన మనం చెడుకర్మలు చెయ్యనట్టు కాదు. మనకు గుర్తున్నా, లేకపోయినా మనం చేసిన కర్మల ఫలితాలు అనుభవించక తప్పదు. ఈ కర్మఫలాలను ఇచ్చేదెవరు? అధియజ్ఞము అంటే కర్మఫలదాత. దీనితో ఆరవ ప్రశ్న జవాబు కూడా వచ్చేసింది. ఇప్పుడు ఈ ఆరు ప్రశ్నలూ, జవాబులూ టూకీగా చూద్దాము. అవి –

1) బ్రహ్మ – పరమమ్ అక్షర బ్రహ్మ; 2) అధ్యాత్మము – జీవాత్మ; 3) కర్మ – సృష్టికారణం; 4) అధిభూతము–క్షరమయ్యే జగత్తు; 5) అధిదైవము – హిరణ్యగర్భ; 6ఎ) అధియజ్ఞము – ఈశ్వరుడు; 6బి) శరీరంలో – ప్రాజ్ఞరూపంలో.

**శ్లోకాలు 5 నుంచి 28:** **ఉపోద్ఘాతం**

రెండు శ్లోకాల్లో అంటే 3, 4 శ్లోకాల్లో టూకీగా ఆరు ప్రశ్నలకు జవాబులు చెబితే, ఏడవ ప్రశ్నకు జవాబు చాలా వివరంగా చెప్పబోతున్నాడు. నిజానికి ఈ శ్లోకంతో మొదలుపెట్టి, ఈ అధ్యాయం చివరిదాకా అంటే 28వ శ్లోకం వరకూ ఇదే అంశాన్ని చర్చించబోతున్నాడు. ఈ ప్రశ్నకు జవాబులో భాగంగా కృష్ణపరమాత్మ ఈ షట్కంలో ముఖ్యమైన ఒక అంశాన్ని ప్రవేశపెడుతున్నాడు. అది – ఈశ్వర ఉపాసన. ఉపాసన ఎప్పుడూ సగుణ ఈశ్వరునిమీదనే ఉంటుంది.

సగుణ ఈశ్వర ఉపాసన రెండు రకాలుగా చెయ్యవచ్చు. అవి సకామ సగుణ ఉపాసన, నిష్కామ సగుణ ఉపాసన.

**సకామ సగుణ ఉపాసన** – సకామ సగుణ ఉపాసన ఇహలోక, పరలోకసుఖాలకోసం చేసేది. ఐశ్వర్యం, ఆరోగ్యం, పదవి, హోదాలు పొందటంకోసం చెయ్యవచ్చు; లేదా కొన్ని సిద్ధులు పొందటానికి చెయ్యవచ్చు. కొంతమంది దేవీ ఉపాసన చేస్తారు; కొంతమంది ఆంజనేయ ఉపాసన చేస్తారు. ఏ దేవునికి ఉపాసన చేసినా వారికి కొన్ని సిద్ధులు వస్తాయి. ఆ సిద్ధులవల్ల భవిష్యత్తు గురించి చెప్పగలరు, గతం గురించి చెప్పగలరు, గతజన్మ గురించి కూడా చెప్పగలరు. వారు పూజలో ఉన్న ఫలానా సమయంలో అమ్మవారు ఆయనకు పూనుతుందని, అప్పుడు ఆయన చెప్పింది నిజమవుతుందనీ వార్త ఆ నోటా, ఈ నోటా పాకి వారి ముందు బారులుతీరి నిలుచుంటారు అనేకమంది. మనం వీరిని తప్పు పట్టటం లేదు. ఇలాంటి సిద్ధపురుషులు గురించి మన పురాణాల్లో కూడా అనేక కథలున్నాయి.

**నిష్కామ సగుణ ఉపాసన** – ఉపాసన అంటే దేవునిమీద ధ్యానం చెయ్యటం. నిష్కామ ఉపాసన ఐహిక సుఖాలను కోరదు; ఆధ్యాత్మిక ఉన్నతి కోరుతుంది.

> **నాస్థా ధర్మే న వసునిచయే నైవ కామోపభోగే**
> **యద్భావ్యం తద్భవతు భగవన్పూర్వకర్మానురూపమ్**
> **హ్యేతత్ ప్రార్థ్యమ్ మమ బహుమతం జన్మజన్మాంతరేఽపి**
> **త్వత్పాదాంభోరుహయుగగతా నిశ్చలా భక్తిరస్తు ॥ 5 ॥**

ఒక భక్తుడు చేస్తున్న ప్రార్థన ఇది: 'ఓ భగవంతుడా, నేను నిన్ను అర్థకామాల కోసమో, పుణ్యం కోసమో ప్రార్థించటం లేదు. అవన్నీ అశాశ్వతములు అని నాకు తెలుసు. నాకు ఉన్నది ఒకటే లక్ష్యం. అది మోక్షం అంటే దైవమే నా లక్ష్యం. నాకు ఈశ్వర ఐక్యప్రాప్తి కావాలి. ఈ భక్తికి వైరాగ్యం కావాలి. ఎందుకంటే కోరికలు ఉంటే, నా భక్తిని ఆ కోరికలు తీర్చుకోవటానికే ఉపయోగించుకుంటాను.'

అలా వైరాగ్యం ఉన్న భక్తుడు రెండు మార్గాలను అనుసరించవచ్చు. అవి – సగుణ ఉపాసన కొనసాగించటం లేదా నిర్గుణ జ్ఞానానికి రావటం.

ఎ) **నిర్గుణ జ్ఞానానికి రావటం:** సగుణ ఉపాసన చేస్తే, చిత్త ఏకాగ్రత ఏర్పడి, సాధన చతుష్టయసంపన్నుడై, జ్ఞానయోగ్యతా ప్రాప్తి పొంది, జ్ఞానమార్గానికి రావటం. అంటే సగుణ ఈశ్వర ఉపాసననుంచి నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందటం. అపరాప్రకృతినుంచి పరాప్రకృతికి రావటం. అపరాప్రకృతి వ్యావహారిక సత్యం అని చూశాము. అలా నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందితే, ఇక్కడే ఇప్పుడే జీవన్ముక్తి పొందుతాడు. ఈశ్వరజ్ఞానం శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా పొందుతాడు. మరణించాక విదేహముక్తి పొందుతాడు. ఇది ఒక మార్గం.

బి) **సగుణ ఉపాసన కొనసాగించటం:** జీవితాంతం సగుణ ఉపాసననే కొనసాగించటం. కొంతమందికి నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందే ధైర్యం లేదు, లేదా నిర్గుణ బ్రహ్మమీద ఆసక్తి లేదు. అతను జీవితాంతం ఉపాసన చేస్తూనే ఉంటాడు. అటువంటి వ్యక్తి మరణకాలంలో కూడా ఈశ్వరుణ్ణే తలుచుకుని 'నాకు మోక్షం ప్రసాదించు, ఇంకేమీ కోరను నిన్ను,' అంటాడు. అతని నిష్కామ ఉపాసనవల్ల బ్రహ్మలోకానికి వెళతాడు. ఇక్కడ నేర్చుకోని బ్రహ్మజ్ఞానం అక్కడ పొంది, బ్రహ్మలోకంలో క్రమముక్తి పొందుతాడు. ఈ అధ్యాయం ముఖ్యోద్దేశం **క్రమముక్తి**.

నిర్గుణ బ్రహ్మజ్ఞానానికి అందరూ త్వరగా రాలేరు. గుణాలున్న భగవంతుణ్ణి కొలవగలము కాని, గుణాలు లేని భగవంతుణ్ణి ఎలా కొలవగలము? శబ్దస్పర్శరూపరసగంధాలు లేని భగవంతుణ్ణి, ఇంద్రియాలతో తెలుసుకోలేని భగవంతుణ్ణి ఎలా ప్రార్థిస్తాము? కృష్ణపరమాత్మే ఈ విషయాన్ని 12వ అధ్యాయంలో ప్రస్తావిస్తాడు.

**క్లేశోఽధికతరస్తేషామ్ అవ్యక్తాసక్తచేతసామ్ ।**
**అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥** – 12.5

నిర్గుణ ఈశ్వరబ్రహ్మజ్ఞానం పొందటానికి చాలా సూక్ష్మబుద్ధి ఉండాలి.

**అగ్రయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మ దర్శిభిః** – కఠ 1.3.12

అటువంటి వ్యక్తికి నిర్గుణ ఈశ్వరుని గురించి తెలుసుకునే సూక్ష్మబుద్ధి ఉండదు కాని, మోక్షం కావాలి; అతనికి లౌకిక సుఖాలు అవసరం లేదు, అతను నిష్కామభక్తుడు లేదా ముముక్షువు కాని అతని మనస్సు నిర్గుణబ్రహ్మవిచారణకు సిద్ధంగా లేదు. అప్పుడేం చెయ్యాలి?

కృష్ణపరమాత్మ దానికి మార్గముంది అంటున్నాడు. నీ నిష్కామభక్తిని లేదా వైరాగ్యాన్ని తగ్గనివ్వకు, మోక్షంమీద కోరికను కూడా తగ్గనివ్వకు, అలాగే జీవితాంతం సగుణ ఉపాసన చెయ్యి అంటున్నాడు. అలా తీవ్రముముక్షుత్వంతో ఉపాసన చేస్తే, మరణకాలంలో భగవంతుణ్ణే తలుచుకుంటాడు. ఎవరైనా సరే, తనకు జీవితంలో ఏది చాలా ఇష్టమైతే, మరణకాలంలో కూడా దాన్నే తలుచుకుంటాడు. ఎప్పుడూ సగుణ ఉపాసన చేసే భక్తుడు, మరణకాలంలో కూడా భగవంతుణ్ణే తలుచుకుంటాడు.

అలా భగవంతుణ్ణే తలుచుకుని మరణించటంవల్ల, ఇక్కడ మోక్షం రాదు కాని, అతని భక్తివల్ల అతను బ్రహ్మలోకానికి వెళతాడు. ఉపాసకుడు, శుక్లమార్గంద్వారా బ్రహ్మ లోకానికి వెళతాడు. బ్రహ్మలోకంలో ఏమవుతుంది? అక్కడ సాక్షాత్తూ బ్రహ్మగారిద్వారా నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందాలి. దయానందస్వామి ఛలోక్తిగా అంటారు,

'అయ్యో, అక్కడ దయానందస్వామి చెపితే, నేను పట్టించుకోలేదే, ఇక్కడ కూడా ఇదే నేర్చుకోవాలా అంటాడుట.' అంటే మోక్షం పొందాలంటే, జ్ఞానం పొందటం ఒక్కటే మార్గం. ఇక్కడ తప్పించుకుని బ్రహ్మలోకానికి వెళ్ళినా అక్కడ తప్పదు. కాకపోతే అక్కడ గురువు సాక్షాత్తూ బ్రహ్మదేవుడు, నేర్చుకునే శిష్యుడు కూడా అక్కడ చాలా సూక్ష్మబుద్ధితో ఉంటాడు; సంసార బాధ్యతలు ఉండవు; పరిస్థితులన్నీ అనువుగా ఉంటాయి కాబట్టి జ్ఞానం తేలిగ్గా వస్తుంది.

**బ్రహ్మణా సహ తే సర్వే సంప్రాప్తే ప్రతిసంచరే**
**పరిస్యాంతే కృతమనాః ప్రవిశంతి పరం పదమ్**

ఆ విధంగా నిష్కామ ఉపాసకుడు బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ జ్ఞానం పొంది, మోక్షం పొందుతాడు. దాన్ని క్రమముక్తి అంటారు. ఇప్పుడు మూడు రకాల మోక్షాలు చూశాము. అవి జీవన్ముక్తి, విదేహముక్తి, క్రమముక్తి.

**జీవన్ముక్తి:** భూలోకంలో జ్ఞానం పొందిన జ్ఞాని, సంసారంనుంచి ముక్తి పొందుతాడు. ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందుతాడు కాబట్టి దాన్ని జీవన్ముక్తి అంటారు.

**విదేహముక్తి:** ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందిన జ్ఞానికి మరణించాక పునర్జన్మ ఉండదు. అతని కర్మలన్నీ దగ్ధమవుతాయి. అందువల్ల అతను మరణించాక విదేహముక్తి పొందుతాడు అంటారు.

**క్రమముక్తి:** జ్ఞానం పొందకుండా, ఉపాసనద్వారా బ్రహ్మలోకానికి వెళ్ళిన ఉపాసకుడు, అక్కడ బ్రహ్మద్వారా జ్ఞానం పొంది, మోక్షం పొందుతాడు. దాన్ని క్రమముక్తి అంటారు.

నిష్కామ భక్తుడు, జ్ఞానమార్గానికి వచ్చి జీవన్ముక్తి పొందవచ్చు లేదా ఉపాసనలోనే ఉండి క్రమముక్తి పొందవచ్చు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈ అధ్యాయంలో క్రమముక్తి గురించి చెప్పబోతున్నాడు. కాని 9, 10 అధ్యాయాల్లో జీవన్ముక్తి గురించి చెపుతాడు. ఎందుకంటే బ్రహ్మలోకంలో సాక్షాత్తూ బ్రహ్మ దగ్గర నేర్చుకుని, మోక్షం పొందవచ్చు; మనస్సు కూడా సూక్ష్మంగా ఉంటుంది. కాని బ్రహ్మలోకానికి వెళ్ళగలమా లేదా అనేదే సందేహం. బ్రహ్మలోకానికి వెళ్ళటం అంత తేలిక కాదు. అందువల్ల దుర్లభమైన మనుష్యజన్మ పొందినందుకు జన్మను ఇక్కడే సార్థకం చేసుకోవాలి. ఉపాసనయోగం పాటించి, జ్ఞానయోగ్యతను పొంది, జ్ఞానమార్గానికి వచ్చి, ఇక్కడే ఇప్పుడే మోక్షం పొందాలి. అంటే జీవన్ముక్తిని పొందాలి. అది కృష్ణపరమాత్మయొక్క ప్రాథమిక బోధ. కాని ఈ అధ్యాయంలో క్రమముక్తిని స్తుతిస్తున్నాడు. ఈ నేపథ్యంతో మనం ఈ శ్లోకాలను చూడాలి.

శ్లో. 5 **అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరమ్ ।**
**యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥**
అంతకాలే, చ, మామ్, ఏవ, స్మరన్, ముక్త్వా, కలేవరమ్,
యః, ప్రయాతి, సః, మద్భావమ్, యాతి, న, అస్తి, అత్ర, సంశయః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యః | = | ఎవరు | సః | = | ఆ పురుషుడు |
| అంతకాలే, చ | = | అంత్యకాలమునందును | మద్భావమ్ | = | నన్నే |
| మామ్, ఏవ | = | నన్నే | యాతి | = | పొందును |
| స్మరన్ | = | స్మరించుచు | అత్ర | = | ఈ విషయమున |
| కలేవరమ్ | = | శరీరమును | సంశయః | = | సందేహము |
| ముక్త్వా | = | వీడి | న, అస్తి | = | లేదు |
| ప్రయాతి | = | పోవునో | | | |

**యః చ అన్త-కాలే మామ్ ఏవ స్మరన్ కలేవరమ్ ముక్త్వా**
**ప్రయాతి, సః మత్ భావమ్ యాతి, అత్ర సంశయః న అస్తి ॥**

తా: ఎవరు అంత్యకాలమునందును నన్నే స్మరించుచు శరీరమును వీడి పోవునో ఆ పురుషుడు నన్నే పొందును. ఈ విషయమున సందేహము లేదు.

**2. ప్రయాణకాలంలో ఈశ్వరస్మరణం - శ్లోకాలు 5-14**

**యః ప్రయాతి** – యః అంటే **నిష్కామ సగుణ ఉపాసకుడు**; అంటే జీవితాంతం తన ఇష్టదేవతను ఉపాసన చేసి, జ్ఞానమార్గానికి రాని నిష్కామ ఉపాసకుడు. ప్రయాతి – మరణించి;

**కలేవరమ్ ముక్త్వా** – ఈ శరీరాన్ని వదిలితే; ఎలా వదిలితే?

**అంతకాలే చ మామేవ స్మరన్** – మరణించే సమయంలో కూడా నన్నే తలుచుకుంటూ మరణిస్తే. నన్ను అంటే సగుణ ఈశ్వరుడా, నిర్గుణ ఈశ్వరుడా? ఉపాసన సగుణ ఈశ్వరునిమీదే ఉంటుందని చూశాము. ఏవ అంటే నన్ను మాత్రమే తలుచుకుంటూ మరణించిన వ్యక్తి –

**మద్భావం యాతి** – ఖచ్చితంగా క్రమముక్తి పొందుతాడు. మద్భావం అంటే క్రమముక్తి. కాకపోతే మధ్యలో దశలను కృష్ణపరమాత్మ పేర్కొనలేదు. వాటిని మనం కలుపుకోవాలి. ఏమిటవి? అతను బ్రహ్మలోకానికి వెళ్ళి, సాక్షాత్తూ బ్రహ్మద్వారా జ్ఞానం పొంది, అప్పుడు క్రమముక్తి పొందుతాడు. ఎవరైనా ఇది నిజమని నిదర్శనమేమిటి అని అడిగితే, సాక్షాత్తూ కృష్ణపరమాత్మే హామీపత్రం ఇస్తున్నాడు.

**అత్ర సంశయః న అస్తి** – కృష్ణపరమాత్మ ఆ విషయంలో సందేహం వద్దు అంటున్నాడు.

శ్లో. 6 **యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్ ।**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥**
యమ్, యమ్, వా, అపి, స్మరన్, భావమ్, త్యజతి, అంతే, కలేవరమ్,
తమ్, తమ్, ఏవ, ఏతి, కౌంతేయ, సదా, తద్భావభావితః ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ కుంతీసుతా! | త్యజతి | = వదులునో |
| అంతే | = ఏ మనుష్యుడు అంత్య కాలము నందు | తమ్, తమ్ | = ఆయా |
| | | ఏవ | = స్వరూపములనే |
| యమ్, యమ్ | = ఏయే | ఏతి | = పొందును |
| భావమ్, వా, అపి | = భావములను | సదా | = ఎందుకంటే నిరంతరము |
| స్మరన్ | = స్మరించుచు | తద్భావభావితః | = అతడు ఆ భావములచే ప్రభావితుడు అవుతాడు |
| కలేవరమ్ | = శరీరమును | | |

**హే కౌన్తేయ! యమ్ యమ్ వా అపి భావమ్ స్మరన్ అన్తే కలేవరమ్ త్యజతి,**
**సదా తద్ భావ-భావితః (సః) తమ్ తమ్ ఏవ ఏతి॥**

తా: ఓ కుంతీపుత్రా! ఏ మనుష్యుడు అంత్యకాలమునందు ఏయే భావములను స్మరించుచు శరీరమును వదులునో ఆయా స్వరూపములనే పొందును. ఎందుకంటే నిరంతరము అతడు ఆ భావములచే ప్రభావితుడు అవుతాడు.

అయనా ఒక సందేహం రావచ్చు. మరణకాలంలో భగవంతుణ్ణే తలుచుకుంటూ మరణించిన వ్యక్తి భగవంతుణ్ణే పొందుతాడు, బాగానే ఉంది కాని, ఒకవేళ భగవంతుణ్ణి తలుచుకోకుండా మరణిస్తేనో? అటువంటి సందేహం గనుక మనకి వస్తే, దానికి ఒక ప్రకృతి సూత్రాన్ని వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటది?

ఒకవ్యక్తియొక్క మరుజన్మ అతను ఈ జన్మలో మరణించే సమయంలో తలుచుకున్నదానిమీద ఆధారపడి ఉంటుంది.

నిజానికి ఒక గొప్ప సామెత ఉంది. 'మనిషి ఎలా ఆలోచిస్తే, అలా అవుతాడు.' అది గొప్ప ప్రకృతి సూత్రం. అది మరణానంతరమే కాక, ఈ జన్మలో కూడా వర్తిస్తుంది.

**యో యత్ శ్రద్ధా స ఏవ సః। సః యథా కామో భవతి తద్ క్రతుర్భవతి, యత్ క్రతుర్భవతి తత్ కర్మ కురుతే, యత్ కర్మ కురుతే తద్ అభిసంపద్యతే** – బృహదారణ్యకం

ఒక వ్యక్తికి దేనిమీద కోరిక ఉంటే దాని గురించి ఆలోచిస్తాడు; దేని గురించి ఆలోచిస్తే దాని గురించి కర్మ చేస్తాడు; ఎటువంటి కర్మ చేస్తే దానికి తగ్గ ఫలం పొందుతాడు. వీటన్నిటికీ మూలకారణం ఆలోచన. ఆలోచన మొదట బలహీనంగా ఉన్నా, దాన్ని గురించి పదేపదే ఆలోచిస్తే, అది ఒక తపనగా మారుతుంది. అది అతని భవిష్యత్తును నిర్దేశించగలదు.

**కామాన్ యః కామయతే మన్యమానః స కామభిర్జాయతే తత్ర తత్ర** – ముండకం 3.2.2

ఒక వ్యక్తి ఏ వస్తువుమీద మోజుతో మరణిస్తే ఆ వస్తువుగా, ఆ వస్తువు ఉండే పరిసరాలలో పుడతాడు. జడభరతుడు లేడిమీద మమకారం పెంచుకుని, దాని గురించే ఆలోచిస్తూ మరణించటంవల్ల మరుజన్మలో లేడిగా పుట్టాడని విన్నాము. అలా మనం ఏం ఆలోచిస్తే, దానికి తగ్గ జన్మను పొందుతామనేది ఈ శ్లోకంయొక్క సారాంశం.

**కలేవరమ్ అంతే త్యజతి** – మరణసమయంలో ఒక వ్యక్తి ఈ శరీరాన్ని వదిలినప్పుడు,

**యం యం భావం స్మరన్** – ఏయే భావాలను స్మరిస్తూ మరణిస్తాడో;

**తం తమేవైతి** – అటువంటి పరిస్థితినే పొందుతాడు.

**కౌంతేయ** – ఓ అర్జునా, ఈ సూత్రాన్ని గుర్తుపెట్టుకో.

ఇది వినగానే, అందులోని లొసుగు వెతకటానికి ప్రయత్నిస్తాము. అది మానవనైజం. కృష్ణపరమాత్మ ఏమన్నాడు? అంత్యకాలంలో నువ్వు దేని గురించి ఆలోచిస్తే, అది వచ్చే జన్మలో పొందుతావు అన్నాడు. అంటే చివరి కోరిక ముఖ్యం. అంతవరకూ నేను ఆడిపాడేసి, ఎన్ని అక్రమాలైనా చేసేసి, చివర్లో బుద్ధిగా దైవస్మరణ చేసేయవచ్చు అనుకోవచ్చు. కాని అలాంటి ఆటలు సాగవు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు?

1. మన అంత్యకాలమెప్పుడో తెలియదు. యమధర్మరాజు ఫలానా రోజు, ఫలానా సమయానికి వస్తానని చెప్పి రాడు. ఎప్పుడు, ఏ క్షణంలో, ఏ రూపంలో మృత్యువు పొంచివుందో మనకు తెలియదు.

2. మన ఆలోచనలు మన ఫ్రీవిల్‌మీద, మన వాసనలమీదా ఆధారపడివుంటాయి. వాసనలు అంటే మన అలవాట్లు లేదా మనం చిత్తంలో నిలువవున్న మన సంస్కారాలు. ఎప్పుడైనా సరే, మన మనస్సులో ఏర్పడే ఆలోచనను ఈ రెండింటిలో ఏదో ఒకటి నిర్ణయిస్తుంది. ఒక్కోసారి ఫ్రీవిల్ పని చేస్తే, ఒక్కోసారి వాసనలు పని చేస్తాయి. ఈ విషయం ధ్యానం చెయ్యటానికి కూర్చుంటే తెలుస్తుంది.

మనం ఎంచక్కా రామనామ ధ్యానం చేద్దామని కూర్చుంటే, మన వాసనలు అది తప్ప అన్నీ ఆలోచించేలా చేస్తాయి. అందువల్ల ఫ్రీవిల్‌కి, వాసనలకూ మధ్య ఘర్షణ నిరంతరం సాగుతూనే ఉంటుంది. వయస్సు పెరుగుతున్న కొద్దీ వాసనలు ఊపు అందుకుంటాయి. అరవై లేదా డెబ్బయో పడిలో పడేసరికి ఈ అలవాటు రాజ్యం ఏలుతుంది. మనం ఫ్రీవిల్ ఉపయోగించి ఆలోచించినా ఆలోచించక పోయినా, ఇన్నేళ్ళుగా మనం మన సుప్తచేతన మనస్సులో నిక్షిప్తం చేసిన ఆలోచనలు శక్తి పుంజుకుంటాయి. చిన్న వయస్సులోనే మనం దేని గురించి ఆలోచించాలనుకుంటున్నామో, అది ఆలోచించలేకపోతున్నామే, ఇంక వృద్ధాప్యంలో ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పాలా? అప్పుడు మన ఆలోచనా తీరును అదుపులో పెట్టటం మనకు దాదాపుగా అసాధ్యం అవుతుంది.

అందువల్ల దానికి ఒకటే విరుగుడు ఉంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటది? మన వాసనలు శుభ వాసనలై ఉండాలి. అంటే మన సుప్తచేతన మనస్సును ఈశ్వర చింతనతో, దైవీసంపత్తితో పూర్తిగా నింపాలి. అప్పుడు అవసానదశలో ఫ్రీవిల్ పని చేసినా, చెయ్యకపోయినా ఈ శుభవాసనలు మేలు చేస్తాయి.

నన్ను మోసం చెయ్యాలని చూడకండి అంటున్నాడు కృష్ణపరమాత్మ. చివరిదశలో భగవంతుణ్ణి తలుచుకోవాలంటే, వచ్చే సంవత్సరం నుంచో, వచ్చే నెలనుంచో, వచ్చే వారంనుంచో మొదలు పెడతాననకూడదు. రేపేమవుతుందో తెలియదు మనకు. ఇంకో గంటలో ఏం జరుగుతుందో తెలియదు. అందువల్ల ఇప్పుడే, ఈ క్షణమే మొదలవ్వాలి

దైవచింతన. దాన్ని మరణానికి సాధన అంటారు. మరణం గురించి మాట్లాడటం కొంతమందికి ఇష్టముండదు; కాని ఇష్టం ఉన్నా లేకపోయినా, ఇవి చేదునిజాలు; వీటిని ఎప్పుడో ఒకప్పుడు ఎదుర్కోక తప్పదు.

మన మంచి కోరే భగవంతుడు కాబట్టి, కృష్ణపరమాత్మ మనకు నచ్చకపోవచ్చని తెలిసినా, ఈ అంశాన్ని చర్చిస్తున్నాడు.

**సదా తద్భావభావితః** – భావిత అంటే అందులోనే పదేపదే రమించాలి. ఎందులో? ఈశ్వరభావన లేదా ఈశ్వరచింతనలో. ఎప్పుడు? సదా – ఎల్లప్పుడూ. అంటే నిరంతరం ఈశ్వరచింతనలో ఉండటంద్వారా సుప్తచేతన మనస్సును దైవచింతనతో పూర్తిగా నింపాలి.

ఒక గొప్ప భక్తుడు తన సుప్తచేతన మనస్సులో ఏముందో తెలుసుకోవాలనుకున్నాడు. ఆయన పేరు అప్పయ్య దీక్షితులు. దానికి ఒక మార్గం స్వప్నం. స్వప్నంలో, మన మనస్సులో ఏముంటుందో అదే బయటకు వస్తుంది అంటారు కదా! కొంతమంది స్వప్నంలో మాట్లాడుతారు కూడా! కాని అది స్పష్టంగా ఉండదు. ఈ అప్పయ్య దీక్షితులు తన మనస్సులో ఏముందో తెలుసుకోవటానికి ఏదో ఒక ప్రత్యేకమైన చెట్టునుంచి పాలు తాగాడుట. అది తాగితే కాసేపు ఆ వ్యక్తికి ఏమవుతుందో తెలియదుట (ఇలాంటి ప్రయత్నాలు నిజంగా చెయ్యకండి).

ఆ కథ ఎలా సాగుతుందంటే, ఆయన తన శిష్యులలో ఒకతనిని పిలిచి తను ఉన్మాదస్థితిలో ఉన్నప్పుడు తను ఏం మాట్లాడితే దాన్ని రాసి ఉంచమని చెప్పాడుట. మామూలుగా అలాంటి స్థితిలో మనస్సులో అణగ ద్రొక్కిన కల్మషం అంతా ఏ తిట్ల రూపంలోనో వస్తుంది! కాని ఆ భక్తుడు ఆ స్థితిలో కూడా తన ఇష్టదేవుడైన శివుణ్ణి గొప్పగా స్తుతించాడుట. దాన్ని **ఉన్మత్త శతకం** అంటారు. ఉన్మాదస్థితిలో ఉండి అది ఎలా చెప్పగలిగాడు? మనం ఇంతవరకూ అనుకుంటున్న సూత్రమే! తన సుప్తచేతన మనస్సును సదా ఈశ్వరచింతనతో నింపాడు.

అందువల్ల ఓ అర్జునా, ఎప్పుడూ నీ అంతిమ లక్ష్యమైన ఈశ్వర చింతనతోనే ఎప్పుడూ ఉండు.

శ్లో. 7 **తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ ।**
**మయ్యర్పితమనోబుద్ధిః మమేవైష్యస్యసంశయమ్ ॥**

తస్మాత్, సర్వేషు, కాలేషు, మామ్, అనుస్మర, యుధ్య, చ,
మయి, అర్పితమనోబుద్ధిః, మామ్, ఏవ, ఏష్యసి, అసంశయమ్ ॥

| | | | |
|---|---|---|---|
| తస్మాత్ | = అందువలన (ఓ అర్జునా!) | మయి | = నాయందే |
| సర్వేషు | = సమస్తమైన | అర్పిత మనోబుద్ధిః | = మనస్సును, బుద్ధిని నిమగ్నమొనర్చిన వాడవై |
| కాలేషు | = కాలములందును | అసంశయమ్ | = నిస్సందేహముగా |
| మామ్ | = నన్ను | మామ్, ఏవ | = నన్నే |
| అనుస్మర | = స్మరిస్తూ ఉండు | ఏష్యసి | = పొందగలవు |
| చ | = ఇంకా | | |
| యుధ్య | = యుద్ధము చేయి | | |

**తస్మాత్ సర్వేషు కాలేషు మయి అర్పిత–మనః–బుద్ధిః (భవ),**
**మామ్ అనుస్మర యుధ్య చ । (ఏవం) అసంశయమ్ మామ్ ఏవ ఏష్యసి ॥**

తా: అందువలన (ఓ అర్జునా!) సమస్తమైన కాలములందును నన్ను స్మరిస్తూ ఉండు ఇంకా యుద్ధము చేయి. నాయందే మనస్సును, బుద్ధిని నిమగ్నమొనర్చినవాడవై నిస్సందేహముగా నన్నే పొందగలవు.

**తస్మాత్ సర్వేషు కాలేషు మామ్ అనుస్మర** – అందువల్ల అన్ని కాలాల్లోనూ నన్నే తలుచుకో! అప్పుడే నీ సుప్తచేతన మనస్సు నా ఆలోచనతో నిండివుంటుంది.

మనిషి అనుమానాల పుట్ట. వెంటనే ఇంకొక ప్రశ్న ఉదయిస్తుంది మనలో! ఏమిటది? నిరంతరం దైవచింతనలో ఉంటే, మన ఉద్యోగధర్మం ఎలా నిర్వహించగలము? కుటుంబ బాధ్యతలను ఎలా నిర్వహించగలము? అంటే భగవంతుణ్ణి తలుచుకోవటంకోసం, కర్తవ్యనిర్వహణను విస్మరించాలా?

ఇటువంటి ప్రశ్న రాకుండా, నీ కర్తవ్యాన్ని మానకు; నీ బాధ్యతలను, నీ లౌకికవ్యవహారాలను ఎప్పటిలాగానే కొనసాగించు అంటున్నాడు. అర్జునుడి తక్షణ కర్తవ్యం ఏమిటి? యుద్ధం చెయ్యటం.

**యుధ్య చ** – అందువల్ల ప్రత్యేకించి చెపుతున్నాడు, ఓ అర్జునా, యుద్ధం చెయ్యి అని. అవకాశం దొరికితే యుద్ధభూమినుంచి పారిపోయి, రామా కృష్ణా అనుకుంటూ కాలక్షేపం చేద్దామనుకుంటాడేమో, అలాంటి ఆలోచన ఒకవేళ వస్తే, దాన్ని పారద్రోలి, అర్జునుడు యుద్ధం చెయ్యాలి.

యుద్ధం చెయ్యి అంటే ఇప్పుడు మనమందరం ఎవరో ఒకరితో యుద్ధం చెయ్యాలని కాదు. దానర్థం – మనం మన స్వధర్మ అనుష్ఠానం పాటించాలి.

ఇంకో సందేహం! మనస్సు ఒకసారి ఒక పనే చెయ్యగలదు. అలాంటప్పుడు మన స్వధర్మాన్ని నిర్వహిస్తూ, మనస్సు భగవంతుణ్ణి ఎలా తలచుకోగలదు? ఒక భక్తునికి నమశ్శివాయ జపం నిరంతరం చెయ్యి, దాన్ని వదలవద్దు అని ఎవరో చెప్పారుట. అందువల్ల అతను ఎవరితో మాట్లాడినా 'ఎక్కడ్నుంచి వస్తున్నావు నమశ్శివాయ? ఏం చేస్తున్నావు నమశ్శివాయ?' అంటుండేవాడు. ఇది కాదు పద్ధతి – రెండూ ఒకేసారి చెయ్యాలంటే దానర్థం ఏమిటి?

చేతన మనస్సు రెండు పనులను ఒకేసారి చెయ్యలేదు, నిజమే! అది ప్రకృతి నియమం. కాని చేతన మనస్సుతో ఏదైనా పని చేస్తున్నా కూడా, సుప్తచేతన మనస్సులో, మన అంతిమలక్ష్యం మనకు స్పష్టంగా నిక్షిప్తమై ఉండాలి. అంటే సుప్తచేతన మనస్సులో ఈశ్వరచింతన ఉంటే, చేతన మనస్సు ప్రాపంచిక విషయాలలో లగ్నమై ఉంటుంది. చేతన మనస్సుకు ప్రాపంచిక విషయాలనుంచి కాస్త విశ్రాంతి దొరికినప్పుడు, చేతన మనస్సు కూడా ఈశ్వరచింతన చేస్తుంది.

ఎవరితోనైనా మాట్లాడుతుంటే, వారి మాటలు చేతన మనస్సుతో వింటామా, సుప్తచేతన మనస్సుతో వింటామా? చేతన మనస్సుతోనే వింటాము కాని, మనకు తెలియకుండానే సుప్తచేతన మనస్సు వేరే దేని గురించో ఆలోచిస్తుంది. ఇంకా మాట్లాడితే బెంగ పడుతుంది, చాలామందికి ఏ పని చేస్తున్నా, తంబూరా శ్రుతిలా ఈ బెంగ ఇరవైనాలుగు గంటలూ గుండెలో మోగుతూనే ఉంటుంది.

తంబూర శ్రుతి విషయం తీసుకుంటే, ఒక సంగీత విద్వాంసుడు తన కచేరీని మొదలుపెట్టే ముందు తంబూరను శ్రుతి చేయిస్తాడు. తనకు కావాల్సిన శ్రుతికి దాన్ని అమరుస్తాడు. అప్పుడు ప్రత్యేకించి వింటాడు. తరువాత కొంతసేపటికి తను పాడే పాటలో పూర్తిగా లీనమైపోతాడు. కాని అతని సుప్తచేతన మనస్సులో ఆ తంబూర శ్రుతి మ్రోగుతూనే ఉంటుంది. మధ్యలో అపశ్రుతి వస్తే అతనికి తెలుస్తుంది.

ఇంకొక ఉదాహరణ, మనం చేసే రైలు ప్రయాణం. మనం హైదరాబాదునుంచి ఏ ఢిల్లీకో ప్రయాణం చేస్తున్నాము. మధ్యలో వచ్చే స్టేషన్లలో కిందికి దిగి ఏ మసాలా దోశో, మంచినీళ్ళో లేక పండ్లో కొనుక్కుంటాము. పెద్దనోటు ఇచ్చి చిల్లర తీసుకుంటాము. ఇటువంటి పనులు ఎన్ని చేస్తున్నా కూడా, మన ధ్యాసంతా మన రైలుమీదే ఉంటుంది. ఏ రైలు కూత విన్నా, ఏ అనౌన్స్‌మెంట్ విన్నా ఈ రైలుదేనేమో అనుకుంటాము. ఒకవేళ చిల్లర తిరిగి తీసుకునేలోపే, రైలు బయలు దేరబోతున్నట్టు తెలిస్తే, చిల్లరకోసం ఆగుతామా? దాని విషయం పక్కకు పెట్టేసి, రైలు దగ్గరకు పరుగులు తీస్తాము.

అందువల్ల వ్యవహారం ఏదైనా చెయ్యండి కాని, భావనలో సదా ఈశ్వరుణ్ణే తలుచుకోండి.

**మయ్యర్పితమనోబుద్ధిః** – నీ మనస్సును, బుద్ధిని కూడా నాకు అర్పించు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే నీ భావోద్రేకాలను కూడా నాకే అర్పించమంటున్నాడు కృష్ణపరమాత్మ. మనవారు అనుకుని మనం వారిమీద భావపరంగా ఆధారపడితే, వారు మనకు కావాల్సిన సమయంలో అందుబాటులో ఉంటారో లేదో తెలియదు. వారు శాశ్వతం కాదు. అందువల్ల మన మానసిక స్థైర్యానికి కూడా శాశ్వతమైన ఆధారాన్ని పట్టుకోవాలి. అది భగవంతుడు. మనుష్యులను ప్రేమించవద్దు అనటం లేదు, కాని మానసిక స్థైర్యంకోసం వారిమీద ఆధారపడవద్దు అంటున్నాడు. **తక్కువేమి మనకు రాముడొక్కడుండు వరకూ**; త్యాగరాజస్వామి రాముడికే తన బాధలన్నీ చెప్పుకుంటాడు. అట్లా మనం కూడా మన బాధలన్నీ భగవంతునితోనే మొరపెట్టుకోవచ్చు. కాని అది తలుపులు మూసుకుని చేస్తే మంచిది. లేకపోతే ఉన్నట్టుండి మనకేమయింది అని మనవాళ్ళు ఖంగారు పడిపోతారు.

బుద్ధిని కూడా తనకే అర్పించమంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు? మనం పూజించే నామరూపాలున్న భగవంతుడు సగుణ ఈశ్వరుడని, ఆ సగుణ ఈశ్వరుడు అంతిమ సత్యం లేదా పారమార్థిక సత్యం అయిన నిర్గుణ బ్రహ్మకు ప్రతీక అనీ ముందు అధ్యాయంలో నేర్చుకున్నాము. అందువల్ల పారమార్థిక సత్యం గురించి బుద్ధిలో తెలుసుకోవాలి. పారమార్థిక సత్యంమీద బుద్ధి స్థిరంగా నిలిచినప్పుడు, సగుణ ఈశ్వరధ్యానం చెయ్యాలనుకుంటేనే చెయ్యవచ్చు. కాని ఈ జ్ఞానం పొందేవరకు సగుణ ఈశ్వరుడు మనకు ఒక ఆలంబన. ఆయనకు పూజ చేయాలి.

**మామ్ ఏవ ఏష్యసి** – అలా భావపరంగా ఈశ్వరునిమీద ఆధారపడి, బుద్ధిపరంగా ఈశ్వరజ్ఞానం పొంది, ఇటువంటి జీవనవిధానాన్ని పాటిస్తే నువ్వు నన్నే పొందుతావు. అది కూడా ఎలా?

**అసంశయమ్** – నిస్సందేహంగా పొందుతావు. కృష్ణపరమాత్మ ఇక్కడ కూడా హామీపత్రాన్ని జత చేస్తున్నాడు. మనుష్యులు చేసే ప్రమాణాలను నిలబెట్టుకోరు; అందువల్ల మనకు భగవంతుడిమీద కూడా సందేహమే. అందువల్ల ఓ భగవంతుడా నన్ను కాపాడు అంటూనే, అనుకుంటాము కాని ఆయన కాపాడగలడా అని సందేహిస్తాము. కాని కృష్ణపరమాత్మ హామీ ఇస్తున్నాడు – నీ మనోబుద్ధులను నాకే అర్పిస్తే, నిస్సందేహంగా నన్నే పొందుతావు.

శ్లో. 8 **అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా ।**
**పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్ ॥**
అభ్యాసయోగయుక్తేన, చేతసా, న, అన్యగామినా,
పరమమ్, పురుషమ్, దివ్యమ్, యాతి, పార్థ, అనుచింతయన్ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | (పురుషః) | = మనుష్యుడు |
| అభ్యాసయోగ యుక్తేన | = పరమేశ్వరుని ధ్యానయోగ సాధనయందే నిమగ్నమైన | అనుచింతయన్ | = అనుక్షణము స్మరించుచు |
| న, అన్యగామినా | = వేరే విషయమును ఆలోచించని | పరమమ్ | = సర్వశ్రేష్ఠుడైన |
| చేతసా | = మనస్సుతో | దివ్యమ్, పురుషమ్ | = ఆ పురుషోత్తముని |
| | | యాతి | = పొందును |

**హే పార్థ! అభ్యాస-యోగ-యుక్తేన న అన్య-గామినా చేతసా**
**అనుచిన్తయన్, దివ్యమ్ పరమమ్ పురుషమ్ యాతి ॥**

తా: ఓ పార్థా! పరమేశ్వరుని ధ్యానయోగసాధనయందే నిమగ్నమైన, వేరే విషయమును ఆలోచించని మనస్సుతో, మనుష్యుడు అనుక్షణము స్మరించుచు సర్వశ్రేష్ఠుడైన ఆ పురుషోత్తముని పొందును.

**(ప్రయాణకాలే) అనుచింతయన్** – ప్రయాణకాలే మనం కలుపుకోవాలి. ప్రయాణకాలంలో ఒక సగుణ ఉపాసకుడు, భగవంతుణ్ణి తలుచుకుంటే. ఎటువంటి భగవంతుణ్ణి?

**పరమం పురుషం దివ్యమ్** – అంటే పారమార్థిక స్థాయికి చెందిన భగవంతుణ్ణి. పురుషపదానికి రెండు అర్థాలున్నాయి. అవి –

**పురుశేతే ఇతి పురుషః – హృదయంలో ఉండేవాడు**
**పూరయతి సర్వం ఇతి పురుషః – ప్రపంచం అంతటా ఉన్నవాడు**

పూరయతినుంచే పూర్ణం పదం వచ్చింది. హృదయంలో ఉండే భగవంతుడు, సర్వవ్యాపకుడు. దివ్యం అంటే చైతన్యస్వరూపం. అటువంటి సర్వవ్యాపకమైన, చైతన్యస్వరూపుడైన ఈశ్వరుణ్ణి, సగుణ ఉపాసకుడు మరణకాలంలో తలుచుకుంటాడు. ఎలా?

**చేతసా** – మనస్సుతో; ఎటువంటి మనస్సుతో?

**అభ్యాసయోగయుక్తేన** – నిరంతరం సాధన చేస్తూ, మనస్సును అభ్యాసంవల్ల సాధన చేయటం. అభ్యాసం కూసువిద్య అంటారు. అభ్యాసం చేస్తే దేనినైనా సాధించవచ్చు.

**నాన్యగామినా** – వేరే విషయం జోలికి పోని మనస్సుతో, సగుణ ఉపాసకుడు నన్నే తలుచుకుంటాడు.

**యాతి** – అది చాలా సహజంగా పొందుతాడు. గణితశాస్త్రజ్ఞుడు, గొప్పమేధావి అయిన రామానుజం చిన్న వయస్సులోనే అనారోగ్యం చేసి, చావుబ్రతుకుల మధ్య ఆసుపత్రిలో ఉంటాడు. అతనిని చూడటానికి వచ్చిన మిత్రుడు 'నేను వచ్చిన టాక్సీ నంబరు బాగాలేదు,' అంటాడు. ఏమిటా నంబరు అని ఆరాతీస్తే అది 1729. 'అది బాగాలేదని ఎవరన్నారు? ఆ సంఖ్యకు రెండు క్యూబ్‌రూట్లు వస్తాయి,' అంటాడు. కొంతమందికి గణితశాస్త్రం పేరు వింటేనే నచ్చదు; కాని రామానుజం అందులోనే జీవించాడు. అందువల్లనే మరణశయ్యమీద కూడా గణితంమీదకే పోయింది మనస్సు. అది ఎలా సాధ్యమైంది?

అభ్యాసయోగయుక్తేన – అభ్యాసం చెయ్యటంవల్ల. మనకు దేనిమీద ఇష్టముంటుందో, దేనిమీద తపన ఉంటుందో దాని గురించే మనస్సు నిరంతరం ఆలోచిస్తుంది. అందువల్ల ఆ తపనను మనం భగవంతునిమీద పెంచుకోవాలి. యాతి అంటే పొందుతాడు. భగవంతుని ధ్యానంలో నిత్యం ఉండటంవల్ల, భగవంతునిలో ఐక్యం అవుతాడు. మన ఆలోచనలు దేనిమీద ఉంటే, అదే చేస్తామనీ, అదే మన విధిని నిర్ణయిస్తుందనీ పదేపదే చూశాము. అలా మరణకాలంలో భగవంతుని తలుచుకున్న వ్యక్తి క్రమముక్తిని పొందుతాడు.

శ్లో. 9 **కవిం పురాణమనుశాసితారమ్ అణోరణీయాంసమనుస్మరేద్యః ।**
**సర్వస్య ధాతారమచింత్యరూపమ్ ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్ ॥**
కవిమ్, పురాణమ్, అనుశాసితారమ్, అణోః, అణీయాంసమ్, అనుస్మరేత్, యః,
సర్వస్య, ధాతారమ్, అచింత్యరూపమ్, ఆదిత్యవర్ణమ్, తమసః, పరస్తాత్ ॥

యః = ఏ పురుషుడు
కవిమ్ = సర్వజ్ఞుడును
పురాణమ్ = ప్రాచీనము
అనుశాసితారమ్ = అందరిని శాసించువాడును
అణోః = అణువుకంటెను
అణీయాంసమ్ = సూక్ష్మమైనవాడును
సర్వస్య = సకలప్రాణులను
ధాతారమ్ = ధరించి పోషించువాడును
అచింత్యరూపమ్ = అచింత్యరూపుడును
ఆదిత్యవర్ణమ్ = సూర్యునివలె నిత్యచేతన ప్రకాశరూపుడును
తమసః, పరస్తాత్ = అజ్ఞానమును పారద్రోలువాడును అయిన సచ్చిదానందపరమాత్మను
అనుస్మరేత్ = అనుక్షణము స్మరించునో–

**కవిమ్ పురాణమ్ అనుశాసితారమ్ అణోః అణీయాంసమ్ (అనుస్మరేత్ యః।)**
**సర్వస్య ధాతారమ్ అచిన్త్య–రూపం ఆదిత్య–వర్ణమ్ తమసః పరస్తాత్ ॥**

తా: ఏ పురుషుడు సర్వజ్ఞుడును, ప్రాచీనము కర్మఫలదాతగా అందరిని శాసించువాడును, అణువు కంటెను సూక్ష్మమైన వాడును, సకల ప్రాణులను, ధరించి పోషించువాడును, అచింత్యరూపుడును, సూర్యుని వలె నిత్యచేతన ప్రకాశరూపుడును, అజ్ఞానమును పారద్రోలువాడును అయిన సచ్చిదానందపరమాత్మను అనుక్షణము స్మరించునో–

ఈ శ్లోకంలో నిష్కామ ఉపాసకుడు, మరణసమయంలో తలుచుకున్న ఈశ్వరుని గుణాలను వర్ణిస్తున్నాడు. ఈశ్వర కళ్యాణవిశేషాలు చూస్తాము. ఏమిటవి? ఒక్కొక్క పదమూ, ఒక్కొక్క గుణాన్ని వర్ణిస్తుంది. అలా ఎనిమిది గుణాలు వర్ణించబడ్డాయి. అవి – కవిమ్, పురాణమ్, అనుశాసితారమ్, అణోః అణీయాంసమ్, సర్వస్య ధాతారమ్, అచింత్యరూపమ్, ఆదిత్యవర్ణమ్, తమసః పరస్తాత్. దీన్నిబట్టి నిష్కామ ఉపాసకుడు, శాస్త్రాలను అధ్యయనం చెయ్యాలని తెలుస్తున్నది. లేకపోతే అతనికి ఈశ్వర గుణాలు తెలియవు.

**కవిమ్** – కవి అంటే కవి కాదు; కవి అంటే సమష్టిబుద్ధి కలిగినవాడు, సర్వజ్ఞుడు.

**పురాణమ్** – అతి ప్రాచీనమైన వాడు. ఆది లేనివాడు. తాను అందరియొక్క సృష్టికర్త కాని, తనకు పుట్టుక లేదు. పురాణమ్ అంటే మనం నేర్చుకునే పురాణాలు కాదు. ప్రాచీనం. నిజానికి పురాణాలకు కూడా ఆ పేరు ప్రాచీనం అనే అర్థంనుంచే వచ్చింది. పురాణం అంటే ప్రాచీనం.

**అనుశాసితారమ్** – అందరికీ కర్మసూత్రాలనుబట్టి కర్మఫలాలను ఇచ్చువాడు. కర్మసూత్రాలు అంటే శారీరక సూత్రాలే కాదు, నైతికసూత్రాలు కూడా వస్తాయి. అనుశాసితారం అంటే కర్మ ఫలదాత.

**అణోరణీయాంసమ్** – సూక్ష్మమైన అణువు కన్నా సూక్ష్మమైనవాడు. అంటే ఇంద్రియ అగోచరం. శబ్ద,స్పర్శ, రూప,రస,గంధాలకు అందనివాడు. దీన్నిబట్టి మనం భగవంతునికి ఆపాదిస్తున్న సగుణరూపం భగవంతునికి ప్రతీక మాత్రమే. ఎలాగైతే జాతీయజెండామీద భారతదేశాన్ని ఆపాదిస్తున్నామో అలా, సగుణబ్రహ్మమీద నిర్గుణబ్రహ్మను ఆపాదిస్తున్నాము. సగుణబ్రహ్మ నిర్గుణబ్రహ్మకు, నిరాకార అనంతానికి, నిరాకారశాంతికి,

నిరాకారభద్రతకు చిహ్నం. శాంతి, భద్రత, ఆనందం, పూర్ణత్వం మనం కోరుకుంటాము. అవి నిరాకారలక్షణాలు. వాటికి సాకారబ్రహ్మను ప్రతీకగా తీసుకుంటాము. అందువల్ల అణోరణీయాంసమ్ అంటే నిర్గుణ బ్రహ్మ.

**సర్వస్య ధాతారమ్** – అంటే అందరికీ అధిష్ఠానదేవత, సర్వాధారం. అలలకు సముద్రం ఆధారం. అలలు సముద్రంలో పుట్టి, సముద్రంలో స్థితి పొంది, మళ్ళీ సముద్రంలోనే లయమవుతాయి. అదే విధంగా భగవంతుడు విశ్వ ఆధారం; వేదాంతంలో సద్రూపం అంటారు. సద్రూపం అంటే అన్నిటిలో ఉనికిగా, సత్తాగా ఉన్నాడు.

**సదేవసోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్** – ఛాందోగ్యం

ఛాందోగ్యోపనిషత్తులో భగవంతుణ్ణి, ప్రపంచానికి ఆధారమయిన సద్రూపంగా అభివర్ణిస్తారు. ఉనికి గురించి తెలుసుకోవాలంటే మన బుద్ధి చాలా పదునుగా ఉండాలి. అందువల్ల ఉనికిని సూచించటానికి ఒక నామం, రూపం ఇస్తున్నారు కాని నిజానికి ఉనికికి లేదా సత్తాకు నామరూపాలు లేవు. సర్వస్య ధాతారమ్ అంటే ఉనికి.

**అచింత్యరూపమ్** – మన మనస్సుకు లేదా ఆలోచనలకు అందనివాడు. మనస్సుకు ఎందుకు అందదు?

1. మనస్సు గుణాలు ఉన్న వస్తువును మాత్రమే చూడగలదు. నిర్గుణబ్రహ్మ గుణాతీతుడు కాబట్టి మనస్సు తెలుసుకోలేదు. ఎంత గొప్ప కారు అయినా సముద్రంలో వెళ్ళలేదు; ఎంత అద్భుతమైన ఓడ అయినా రోడ్డుమీద వెళ్ళలేదు; అలాగే మనస్సు గుణాలు లేని రంగంలోకి వెళ్ళలేదు. దాని పరిధి దాటి వెళ్ళలేదు.

2. మనస్సు చూసేది ఆబ్జెక్టును మాత్రమే. భగవంతుడు ఆబ్జెక్టు కాదు; సబ్జెక్టు అయిన నేనే. భగవంతుడివల్లనే తక్కిన ఆబ్జెక్టులను చూడగలుగుతున్నాము.

**Ever the experiencer, never the experienced**
**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

అలా చూడలేని భగవంతునికి కొన్ని గుణాలు ఆపాదించి చూస్తున్నాము.

**నిర్విశేషం పరం బ్రహ్మ సాక్షాత్ కర్తుమ్ అనీశ్వరః**

నిర్గుణబ్రహ్మను అర్థం చేసుకోలేని వారిని ఉపనిషత్తు మూఢాః అంటుంది. అంటే మందబుద్ధి ఉన్నవారి కోసం, ఉపనిషత్తు ఒక మెట్టు దిగివచ్చి, సగుణబ్రహ్మను అందించింది. సగుణబ్రహ్మద్వారా మనం నిర్గుణబ్రహ్మను అర్థం చేసుకునే స్థాయికి ఎదగాలి. అచింత్యరూపం అంటే మనస్సుకు అందనివాడు.

**ఆదిత్యవర్ణమ్** – సూర్యడంత ప్రకాశవంతుడు. సూర్యునిలాగా అందరినీ ప్రకాశింపచేయువాడు.

**సూర్యో యథా సర్వలోకస్య చక్షుః న లిప్యతే చాక్షుషైర్బాహ్యదోషైః**
**ఏకస్తథా సర్వభూతాన్తరాత్మా న లిప్యతే లోకదుఃఖేన బాహ్యః** – కఠ 2.2.11

సూర్యకాంతిలో అన్నీ ఎలా తెలుస్తున్నాయో, అలా చైతన్యబ్రహ్మవల్ల మనకు అన్నీ తెలుస్తున్నాయి. ఆదిత్యవర్ణమ్ అంటే స్వయంప్రకాశచైతన్యస్వరూపం.

**తమసః పరస్తాత్** – చీకటివల్ల చలించనివాడు. సూర్యునికీ, ఆత్మజ్యోతికీ మధ్య భేదం ఏమిటి? సూర్యకాంతి చీకటిని చీకటిగా చూపించలేదు.

చిన్మయానందస్వామి ఈ విషయాన్ని సరదాగా కథలాగా చెపుతారు. ఎవరో వెళ్ళి సూర్యభగవానునికి చెప్పారుట. 'ఒక అందమైన ఆడపిల్ల ఉంది. నిశా ఆమె పేరు, ఆమెను పెళ్ళి చేసుకోకూడదూ?' సంస్కృతంలో నిశా స్త్రీలింగం, సూర్యుడు పుంలింగం. 'ఎక్కడ ఉంది ఆ నిశా?' అడిగాడు ఆదిత్యుడు. 'భూమికి అటువైపు ఉంది,' అన్నాడుట. పాపం సూర్యభగవానుడు ఎంతో ఆశగా అటువైపు వెళితే అక్కడ నిశా ఉంటేగా? సూర్యుడు రాగానే చీకటి పారిపోతుంది. మళ్ళీ ఆశగా ఇటువైపు వచ్చాడుట. ఇటు వస్తే ఏముంది? ఇటు కూడా చీకటి మాయం. అలా ఆదిత్యుడు నిశాదేవిని వెతుక్కుంటూ వెళ్ళటం వల్ల సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు అవుతున్నాయి తప్ప నిశాదేవిని చూడలేకపోతున్నాడు.

దీన్నిబట్టి తెలిసినదేమిటి? సూర్యుడు అన్నింటినీ ప్రకాశింపజేయగలడు కాని చీకటిని ప్రకాశింపజేయలేడు (అంటే చీకటిని చీకటిగా చూపలేడు). కాని చైతన్యం సూర్యునికన్నా గొప్ప జ్యోతి. ఎందుకు? చైతన్యం చీకటిని కూడా ప్రకాశింపజేయగలదు. చైతన్యంద్వారా మీరున్న గది ప్రకాశవంతంగా ఉంటే, ప్రకాశవంతంగా ఉందని తెలుస్తుంది; చీకటి పడ్డాక, గది కూడా చీకటిగా ఉందని తెలుస్తుంది. అంటే చైతన్యం చీకటిని ప్రకాశింపజేయగలదు. కాబట్టి తమసః పరస్తాత్ అంటే అంధకారాన్ని కూడా పారద్రోలుతాడు.

**అనుస్మరేత్ యః** – యః అంటే నిష్కామ ఉపాసకుడు. అనుస్మరేత్ అంటే పదేపదే తలుచుకునేవాడు. అంటే జీవితాంతం తలుచుకుంటూ, మరణకాలంలో కూడా తలుచుకునేవాడు.

**(సః) పరమం పురుషం యాతి** – యః అనుస్మరేత్ వరకూ మాత్రమే ఉంది. అందువల్ల ముందు శ్లోకంనుంచి (సః) పరమం పురుషం యాతి కలుపుకోవాలి. ఇప్పుడు మొత్తం కలిపి చదివితే – భగవంతుణ్ణి పదేపదే తలుచుకునే నిష్కామ ఉపాసకుడు మోక్షం పొందుతాడు. ఉపాసకుడు మోక్షం పొందుతాడు అంటే అది జీవన్ముక్తి కాదు, బ్రహ్మలోకంలో పొందే క్రమముక్తి అని చూశాము.

శ్లో. 10 **ప్రయాణకాలే మనసాచలేన భక్త్యా యుక్తో యోగబలేన చైవ ।**
**భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్ స తం పరం పురుషముపైతి దివ్యమ్ ॥**
ప్రయాణకాలే, మనసా, అచలేన, భక్త్యా, యుక్తః, యోగబలేన, చ, ఏవ,
భ్రువోః, మధ్యే, ప్రాణమ్, ఆవేశ్య, సమ్యక్, సః, తమ్, పరమ్, పురుషమ్, ఉపైతి, దివ్యమ్ ॥

| | | | |
|---|---|---|---|
| సః | = అట్టి | అచలేన | = నిశ్చలమైన |
| భక్త్యా, యుక్తః | = భక్తిగల పురుషుడు | మనసా | = మనస్సుతో |
| ప్రయాణకాలే | = అంత్యకాలమున | (స్మరన్) | = (స్మరించుచు) |
| యోగబలేన | = యోగబలముచే | తమ్ | = ఆ |
| భ్రువోః, మధ్యే | = భ్రూమధ్య ప్రదేశమున | దివ్యమ్ | = దివ్యుడును |
| ప్రాణమ్ | = ప్రాణమును | పరమ్, పురుషమ్, ఏవ | = పరమపురుషుడును అయిన పరమాత్మనే |
| సమ్యక్ | = చక్కగా | ఉపైతి | = పొందును |
| ఆవేశ్య | = నిలిపి | | |
| చ | = ఇంకా | | |

**అచలేన మనసా, భక్త్యా యుక్తః యోగ-బలేన చ ఏవ భ్రువోః**
**మధ్యే సమ్యక్ ప్రాణమ్ ఆవేశ్య, యః అనుస్మరేత్ సః తమ్ పరమ్ దివ్యమ్ పురుషమ్ ఉపైతి ॥**

తా: అట్టి భక్తిగల పురుషుడు అంత్యకాలమున యోగబలముచే భ్రూమధ్య ప్రదేశమున ప్రాణమును చక్కగా నిలిపి ఇంకా నిశ్చలమైన మనస్సుతో స్మరించుచు ఆ దివ్యుడును, పరమపురుషుడును అయిన పరమాత్మనే పొందును.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ నిష్కామభక్తుడు మరణకాలంలో భగవంతుణ్ణి తలుచుకుంటే ఏమవుతుందో చెపుతున్నాడు.

**ప్రయాణకాలే** – అంత్యకాలంలో. ప్రాణం అంటే పంచప్రాణాలు. పంచప్రాణాలు శరీరంలోని అన్ని అంగాలనుంచి వెనక్కు వచ్చి, హృదయంలో చేరుతాయి. హృదయంనుంచి ఈ ప్రాణం ప్రత్యేకమైన నాడి అయిన సుషుమ్ననాడి దగ్గరకు చేరుతుంది. సుషుమ్ననాడి పేరు ఇక్కడ రాలేదు కాని వేరే చోట్ల చూస్తాము.

**శతం చైకా చ హృదయస్య నాడ్యస్తాసామ్ మూర్ధానమభినిః సృతైకా ।**
**తయోర్ధ్వమాయన్ అమృతత్వమేతి విష్వఙ్న్యా ఉత్క్రమణే భవన్తి ॥** – కఠ 2.3.16

అలా ప్రాణం హృదయంలోకి వచ్చి, హృదయంనుంచి సుషుమ్ననాడికి వెళుతుంది. సుషుమ్ననాడి తల పైభాగాన ఉన్న రంధ్రానికి తీసుకు వెళుతుంది. ఆ రంధ్రాన్ని బ్రహ్మరంధ్రం అంటారు. బ్రహ్మలోకానికి తీసుకువెళుతుంది కాబట్టి అది బ్రహ్మరంధ్రం అయింది. అంటే ఈ ఉపాసకుడు మరణించినప్పుడు అతని ప్రాణాలు సుషుమ్ననాడిద్వారా బ్రహ్మరంధ్రం చీల్చుకుని, శుక్లగతిద్వారా బ్రహ్మలోకానికి వెళతాయి. అలా వెళ్ళటానికి ఇక్కడ అతను కొన్ని ఏర్పాట్లు చెయ్యాలి.

**ప్రాణమావేశ్య భ్రువోర్మధ్యే** – ప్రాణాలను తన భ్రుకుటి మధ్యకు తీసుకురావాలి. భ్రుకుటి అంటే కనుబొమ్మల మధ్యభాగంలోకి. అక్కడ సుషుమ్ననాడి ఉంటుంది.

మరణించే ఉపాసకుడు ప్రయత్నపూర్వకంగా తన ప్రాణాలను భ్రుకుటి మధ్యకు తేవాలంటే అది సాధ్యమయ్యే పనేనా? అతను ముందు తక్కిన అంగాలనుంచి ప్రాణాలను విడదీసి, వాటిని హృదయంలోకి చేర్చి, హృదయంలోంచి వచ్చే సూక్ష్మనాడిలోకి తీసుకురావాలి. అసాధ్యం అనిపిస్తుంది.

**యోగబలేన చైవ** – కృష్ణపరమాత్మ చెబుతున్నాడు క్రమముక్తి కావాలంటే అతను గొప్ప ఉపాసకుడే కాదు, గొప్ప యోగి కూడా అయివుండాలి. అంటే అష్టాంగయోగం బాగా సాధన చేసి ఉండాలి. అందులో ఒక అంశం – ప్రాణాయామం. మామూలుగా గుండె కొట్టుకోవటం, శ్వాసపీల్చటం అసంకల్పిత చర్యలు. అంటే అవి మన చేతిలో లేవు. కాని ప్రాణాయామంద్వారా ఒక సాధకుడు తన ప్రాణాలను, తన గుండెను తన అదుపులో పెట్టుకోగలడు. అటువంటి సాధకుడిని యోగి అంటారు. క్రమముక్తి కావాలంటే అతను అష్టాంగయోగి అయివుండాలి.

జీవన్ముక్తి కావాలంటే? నిర్గుణ ఈశ్వరజ్ఞానానికి వచ్చి, ఆ జ్ఞానం పొంది, ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందవచ్చు. దీనికి అష్టాంగయోగం చెయ్యనవసరం లేదు. నాకు జీవన్ముక్తి వద్దు అంటే అష్టాంగయోగం చాలా బాగా చేసివుండాలి. యోగబలం చేత తన ప్రాణాలను తన అదుపులో పెట్టుకోవాలి. అంటే సుషుమ్న నాడికి తీసుకురావాలి. అంతేకాదు, ఇంకా కొన్ని పనులు కూడా చేయాలి.

**మనసాచలేన** – చలించని మనస్సుతో ఉండాలి. అతని మనస్సు స్థిరంగా ఉండాలి. ఎప్పుడు? మరణకాలంలో. అంటే మరణకాలంలో తన ప్రాణాలను తను అదుపులో పెట్టుకోవటమే కాదు, తన మనస్సును కూడా నిశ్చలంగా పెట్టుకోవాలి. అది ఎలా సాధ్యం అంటే మళ్ళీ సమాధానం ఒక్కటే – యోగబలేన. యోగశాస్త్రం – చిత్తవృత్తినిరోధం చేస్తుంది. అంటే మనస్సు ఆలోచించకుండా, ప్రశాంతంగా ఉండేలా చేస్తుంది. తర్వాత ఏం చెయ్యాలి?

**భక్త్యా యుక్తః** – అంతేకాదు, అప్పుడు నామీద మనస్సు పెట్టాలి. అంటే అప్పుడు అతని తపన ఈశ్వరప్రాప్తిమీదే ఉండాలి కాని వేరే విషయం జోలికి పోకూడదు. అదెలా సాధ్యం? మళ్ళీ సమాధానం ఒక్కటే – యోగబలేన– యోగశాస్త్రం వల్ల మనస్సును వెనక్కు లాక్కోగలడు; యోగశాస్త్రంవల్ల మనస్సును తన ఇష్టదేవతమీద ఏకాగ్రతతో నిలుపగలడు. ఇష్టదేవతమీద అని ఇక్కడ ప్రత్యేకించి చెప్పలేదు; మనం అర్థం చేసుకోవాలి.

ఆ విధంగా సాధకుడు తన యోగశక్తివల్ల పంచప్రాణాలను అదుపులో పెట్టుకుని, మనస్సును ప్రశాంతంగా ఉంచుకుని, మనస్సును భగవంతునిమీదే నిలిపితే, అతను పొందే ఫలమేమిటి?

**పరమం పురుషం దివ్యమ్** – ఈ వాక్యాన్ని చూస్తూనే ఉన్నాము. అందరి హృదయాలలోనూ ఉండటమే కాక సర్వవ్యాపకుడు అయిన భగవంతుణ్ణి, దేశకాలవస్తుపరిచ్ఛేదం లేని భగవంతుణ్ణి, స్వయంప్రకాశకచైతన్యాన్ని పొందుతాడు. అంటే క్రమముక్తి పొందుతాడు. ఇక్కడ కూడా మనం మధ్య దశలకు కలుపుకోవాలి. క్రమముక్తి వెంటనే పొందడు; బ్రహ్మలోకానికి వెళ్ళి, బ్రహ్మగారి దగ్గర పాఠాలు నేర్చుకుని, జ్ఞానం పొంది, మోక్షం పొందుతాడు. దానిని క్రమముక్తి అంటారు.

శ్లో. 11 **యదక్షరం వేదవిదో వదంతి విశంతి యద్యతయో వీతరాగాః ।**
**యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే ॥**
యత్, అక్షరమ్, వేదవిదః, వదంతి, విశంతి, యత్, యతయః, వీతరాగాః,
యత్, ఇచ్ఛంతః, బ్రహ్మచర్యమ్, చరంతి, తత్, తే, పదమ్, సంగ్రహేణ, ప్రవక్ష్యే ॥

| | | | |
|---|---|---|---|
| వేదవిదః | = వేదవిదులైన విద్వాంసులు | ఇచ్ఛంతః | = కోరుకొనువారై బ్రహ్మచారులు |
| యత్ | = ఏ సచ్చిదానందపరమాత్మను | బ్రహ్మచర్యమ్ | = బ్రహ్మచర్య వ్రతమును |
| అక్షరమ్ | = శాశ్వతునిగా | చరంతి | = ఆచరించుచున్నారో |
| వదంతి | = చెప్పుదురో | తత్ | = అట్టి |
| వీతరాగాః | = రాగద్వేషములు లేనివారై | పదమ్ | = పరమపదమును గూర్చి |
| యతయః | = యత్నశీలురైన సన్న్యాసులు | తే | = నీకు |
| యత్ | = ఏ పరమపదమును | సంగ్రహేణ | = సంక్షిప్తముగా |
| విశంతి | = ప్రవేశించుచున్నారో | ప్రవక్ష్యే | = చెప్పెదను |
| యత్ | = ఏ పరమపదమును | | |

**వేద–విదః యత్ అక్షరమ్ వదన్తి, వీత–రాగాః యతయః యత్ విశన్తి, (బ్రహ్మచారిణః)**
**యత్ ఇచ్ఛన్తః బ్రహ్మచర్యమ్ చరన్తి, తత్ పదమ్ తే సంగ్రహేణ ప్రవక్ష్యే ॥**

తా: వేదవిదులైన విద్వాంసులు ఏ సచ్చిదానందఘన పరమాత్మను శాశ్వతునిగా చెప్పుదురో రాగద్వేషములు లేనివారై యత్నశీలురైన సన్న్యాసులు ఏ పరమపదమును ప్రవేశించుచున్నారో, ఏ పరమపదమును కోరుకొనువారై బ్రహ్మచారులు బ్రహ్మచర్య వ్రతమును ఆచరించుచున్నారో అట్టి పరమపదమును గూర్చి నీకు సంక్షిప్తముగా చెప్పెదను.

**యదక్షరం వేదవిదో వదంతి** – వేదవిదులు అంటే వైదికశాస్త్రంలో ఆరితేరినవారు; ఆ భగవంతుణ్ణి అక్షరం బ్రహ్మ అంటారు. ఇంతకు ముందు కూడా **అక్షరం బ్రహ్మ పరమమ్** (8.3) అని చూశాము. అక్షరం అంటే నాశనం లేని పరబ్రహ్మ. ముండకోపనిషత్తులో బ్రహ్మవర్ణన అక్షరం బ్రహ్మ అని వస్తుంది.

**యయా తత్ అక్షరం అధిగమ్యతే** – ముండకం

అక్షరం అంటే క్షరం కానిది. శాశ్వతమైన శాంతి, భద్రతలను, ఆనందాన్ని ఇచ్చే పరమాత్మ.

**యత్ యతయః విశంతి** – ఆ భగవంతుణ్ణి యతులు పొందుతారు. అక్షరాలా యతః పదం తీసుకుంటే సన్న్యాసః అని వస్తుంది. సన్న్యాసి అంటే చిత్త ఏకాగ్రతతో, తక్కినవేవీ ఆలోచించకుండా, ఆధ్యాత్మిక సాధన చేసే వ్యక్తి. ఎవరైతే ఆధ్యాత్మికతకు ప్రాధాన్యతను ఇస్తారో, వారే సన్న్యాసులు. సన్న్యాసి అంటే బాహ్యంగా సన్న్యాసిగా మారినవ్యక్తి కాదు, ఆంతరసన్న్యాసం స్వీకరించిన వ్యక్తి. అంటే ఆధ్యాత్మిక చింతనమీదనే మనస్సును కేంద్రీకరించిన

వ్యక్తి. అటువంటివారు పరమాత్మను పొందుతారు. దానికి వారికి కావాల్సిన అధికారిత్వం ఏమిటి?

**వీతరాగాః** – అనాత్మ విషయాలమీద ఆసక్తిరహితులయి ఉండాలి. వారు తక్కిన అన్ని రకాల లక్ష్యాలను పొందటానికి ప్రయత్నించి, భగవంతుడు తప్ప ఏదీ శాశ్వతం కాదని తెలుసుకుని, వచ్చినవారు. అంటే భగవంతుడొక్కడే పరాప్రకృతి, తక్కినవన్నీ అపరాప్రకృతి అని గ్రహించినవారు. కార్డుబోర్డు కుర్చీ ఉదాహరణ మర్చిపోకండి.

కార్డుబోర్డు కుర్చీ అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది; కాని దానిమీద కూర్చోటానికి పనికిరాదు. అలాగే ప్రపంచాన్ని చూసి ఆనందించాలి, అనుభవించాలి కాని దానిమీద ఆధారపడకూడదు. ముఖ్యంగా మానసికంగా ఆధారపడకూడదు. శాంతి, భద్రతలను అక్షరం బ్రహ్మ మాత్రమే ఇవ్వగలదు. ఇది తెలిసి వైరాగ్యం పెంచుకుని, అక్షరం బ్రహ్మ వైపుకు తిరిగినవారు –

**యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి** – ఈ లక్ష్యాన్ని కోరుకున్నవారు బ్రహ్మచర్య జీవనవిధానాన్ని ఆచరిస్తారు. ఇక్కడ బ్రహ్మచర్యం అంటే శాస్త్ర అధ్యయనం. పూర్వం గురుకులవాసంలో ఉండి విద్యనభ్యసించేవారిని బ్రహ్మచారులు అంటారు. శాస్త్రంద్వారానే బ్రహ్మను తెలుసుకోగలరు. ఆ బ్రహ్మస్వరూపం ఏమిటి?

**తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే** – నేను నీకు ఆ ఈశ్వరుని స్వరూపం సంక్షిప్తంగా వివరిస్తాను. ఈశ్వరస్వరూపం వర్ణిస్తాను అన్నాడు కాని అది తర్వాత అంటే 20–22 శ్లోకాల్లో చెబుతాడు. మనమన్నా మర్చిపోతామేమో కాని, ఈ విషయాన్ని కృష్ణపరమాత్మ మర్చిపోడు. తర్వాత చెబుతాడు.

శ్లో. 12 **సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ ।**
**మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణమ్ ఆస్థితో యోగధారణామ్ ॥**
సర్వద్వారాణి, సంయమ్య, మనః, హృది, నిరుధ్య, చ,
మూర్ధ్ని, ఆధాయ, ఆత్మనః, ప్రాణమ్, ఆస్థితః, యోగధారణామ్ ॥

| | | | |
|---|---|---|---|
| సర్వద్వారాణి | = సర్వేంద్రియములను | మూర్ధ్ని | = మూర్ధస్థానమునందు |
| సంయమ్య | = నిగ్రహించి | ఆధాయ | = స్థిరముగా ఉంచి |
| చ | = అలాగే | ఆత్మనః | = పరమాత్మయొక్క |
| మనః | = మనస్సును | యోగధారణామ్ | = ధ్యానమునందే |
| హృది | = హృదయమునందు | ఆస్థితః | = నిమగ్నుడై |
| నిరుధ్య | = స్థిరమొనర్చి | (యః | = ఏ పురుషుడు) |
| ప్రాణమ్ | = (ఆవిధముగా వశమైన మనస్సు ద్వారా) ప్రాణమును | | |

**సర్వ–ద్వారాణి సంయమ్య, మనః చ హృది నిరుధ్య,**
**మూర్ధ్ని ఆత్మనః ప్రాణమ్ ఆధాయ, యోగ–ధారణామ్ ఆస్థితః ॥**

తా: సర్వేంద్రియములను నిగ్రహించి అట్లే మనస్సును హృదయమునందు స్థిరమొనర్చి అవిధముగా వశమైన మనస్సుద్వారా ప్రాణమును మూర్ధ్నస్థానమునందు స్థిరముగా ఉంచి పరమాత్మయొక్క ధ్యానమునందే నిమగ్నుడై ఏ పురుషుడు –

భగవంతుడు పారమార్థిక స్థాయిలో నిర్గుణబ్రహ్మ అనీ, నిర్గుణబ్రహ్మను అర్థం చేసుకోవటం కష్టం కాబట్టి ఒక సగుణరూపాన్ని శాస్త్రాలు ఇచ్చాయనీ ఇంతకుముందు చూశాము. ఈ రూపాన్ని ఉపాసన పరిభాషలో ఆలంబనం అంటారు. ఆలంబనం అంటే నిరాకార వస్తువును ఒక సాకార వస్తువుమీద ఊహించుకోవటం.

ఈ ఆలంబన రెండు రకాలు. అవి – ప్రతిమా ఆలంబన, ప్రతీక ఆలంబన. ప్రతిమా ఆలంబన అంటే భగవంతునికి ఒక ఆకారాన్ని ఇవ్వటం. రాముడు, కృష్ణుడులాంటి ఆకారాలు ఇచ్చి వారిని ఒక ఆకారంలో కొలవటం.

**మేఘశ్యామం పీతకౌశేయవాసం శ్రీవత్సాంకమ్ కౌస్తుభోద్భాసితాంగమ్**

అంతేకాదు, ఆ దేవుని నాలుగు చేతుల్లో ఉండే నాలుగు వస్తువుల వర్ణనలు కూడా వస్తాయి.

ప్రతీక ఆలంబన అంటే మనుష్య ఆకారం ఉండదు. శివలింగం, అగ్ని, పసుపు వినాయకుడు ప్రతీక ఆలంబనానికి ఉదాహరణలు. పసుపు వినాయకుణ్ణి చేసి అందులోకి ఆయనను ఆవాహన చేస్తాము.

**అస్మిన్ హరిద్రాబింబే సుముఖం మహాగణపతిం ధ్యాయామి**

దాని తర్వాత ఆ ప్రతీక ఆలంబనానికే షోడశోపచారాలు చేస్తాము.

ఈ రెండు రకాల ఆలంబనలలో ఏదైనా తీసుకోవచ్చు. నాకు ప్రత్యేకించి ఇష్టదేవత ఎవరూ లేరు అనుకుంటే, ప్రతీక ఆలంబన తీసుకోవచ్చు. శాస్త్రం ఇచ్చే ప్రతీక ఆలంబన **ఓంకారం.**

**ఏతద్ధ్యేవాక్షరం బ్రహ్మ ఏతద్ధ్యేవాక్షరం పరమ్ ।**
**ఏతద్ధ్యేవాక్షరం జ్ఞాత్వా యో యదిచ్ఛతి తస్య తత్ ॥** – కఠ 1.2.16

**ఏతదాలమ్బనం శ్రేష్ఠమేతదాలమ్బనం పరమ్ ।**
**ఏతదాలమ్బనం జ్ఞాత్వా బ్రహ్మలోకే మహీయతే ॥** – కఠ 1.2.17

ఆ విధంగా ఓంకారం ఒక ఆలంబన. దాన్ని ఓంకార ఉపాసన అంటారు. అంటే ఓంలో భగవంతుణ్ణి ఆవాహన చేయటం. ఇది చాలా గొప్ప ఉపాసన. దాదాపు అన్ని ఉపాసనలూ ఓంకారం గురించి మాట్లాడతాయి.

**ధనుర్గృహీత్వౌపనిషదం మహాస్త్రం శరం హ్యుపాసానిశితం సన్ధయీత ।**
**ఆయమ్య తద్భావగతేన చేతసా లక్ష్యం తదేవాక్షరం సోమ్య విద్ధి ॥** – ముండకం 2.2.3

తైత్తిరీయోపనిషత్తులో కూడా ఓంకారం గురించి వస్తుంది. ఓంకార ఉపాసన అంత ముఖ్యమైనది కాబట్టి కృష్ణపరమాత్మ కూడా 12, 13 శ్లోకాల్లో ఓంకార ఉపాసన గురించి మాట్లాడుతున్నాడు.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. కృష్ణపరమాత్మ ఉదాహరణకు ఓంకార ఉపాసన తీసుకున్నాడు. దాని బదులు మన ఇష్టదేవత ఉపాసన కూడా చెయ్యవచ్చు. రాముడు, కృష్ణుడు, సరస్వతి, లక్ష్మీదేవి – ఏ దేవుడైనా, ఆ దేవుణ్ణి ఆలంబనగా తీసుకుని ఉపాసన చెయ్యాలి. ఎన్నాళ్ళు? జీవితాంతం, మరణకాలంలో కూడా చెయ్యాలి.

**సర్వద్వారాణి సంయమ్య (మరణకాలే)** – మరణకాలంలో, తన ఇంద్రియాలన్నిటినుంచి విడివడాలి. ఎందుకంటే ఇంద్రియాలద్వారా బాహ్యప్రపంచం మన ప్రమేయం లేకుండానే మన మనస్సులోకి దూసుకు వస్తుంది. ఆ వచ్చిన ప్రపంచం ఊరుకోకుండా, అనేక ఆలోచనలను కలుగజేస్తుంది. అందువల్ల, భగవంతుణ్ణి తలుచుకోవాలంటే, ఇంద్రియాలను అదుపులో పెట్టుకుని;

**మనో హృది నిరుధ్య చ** – మనస్సును హృదయంలో స్థిరంగా నిలపాలి. అక్కడ భగవంతుణ్ణి దర్శించాలి.

శివశంకర అష్టకంలో శంకరాచార్యులు భగవంతుణ్ణి ఈ విధంగా ప్రార్థన చేశారు –

**అతిభీషణకటుభాషణ యమకింకరపటలీ**
**కృతతాడనపరిపీడన మరణాగమసమయే**
**ఉమయా సహ మమ చేతసి యమశాసన నివసన్**
**శివశంకర శివశంకర హర మే హర దురితమ్** – 1

మరణకాలంలో; **యమకింకర** – యమభటులు వస్తారు. **అతిభీషణ కటుభాషణ** – నన్ను తిడుతూ, నా జీవితాన్ని వృథాపరచుకున్నందుకు విమర్శిస్తారు. **కృతతాడన పరిపీడన మరణాగమసమయే** – చాలా పెద్ద శబ్దాలు చేసుకుంటూ వస్తారు. అటువంటి సమయంలో నాకు నిన్ను ప్రార్థించే ఓపిక ఉండదు. అందువల్ల ఓపిక ఉండగానే నిన్ను వేడుకుంటున్నాను. **ఉమయా సహ మమ చేతసి** – ఉమాదేవి సహితంగా నువ్వు వచ్చి నా హృదయంలో కొలువైవుండాలి. నువ్వెవరు? **యమశాసన–** యమశాసనుడవు. కాలానికే కాలానివి. యమకింకరులు వచ్చే ముందు నువ్వు వచ్చి నా హృదయంలో నాట్యం చెయ్యాలి. నీ నాట్యం చూసి యమకింకరులు భయపడిపోయి పరుగులు తీయాలి. చాలా అద్భుతమైన భావన!

**మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణమ్** – ప్రాణాలను మూర్ధ్నస్థానంలో స్థిరంగా నిలపాలి. ఇదంతా ఇంతకు ముందు చూశాము. ప్రాణాలను వాటి స్థానాలనుంచి వెనక్కి తీసుకుని, వాటిని తల పైభాగానికి, బ్రహ్మరంధ్రానికి తీసుకురావాలి.

**యోగధారణామ్ ఆస్థితః** – యోగసాధన చెయ్యాలి. ధారణ అంటే ఏకాగ్రత చూపాలి. ఎలా సాధ్యం అంటే ముందునుంచీ సాధన చేస్తూ రావాలి. కుటుంబంకోసం ఇప్పటికే చాలా చేశాడు. ఇప్పటికన్నా ఓంకార ఉపాసన చెయ్యాలి; యోగసాధన చెయ్యాలి.

నిష్కామ ఉపాసకుడు నిరంతరం ఉపాసన చెయ్యటంవల్ల మరణకాలంలో కూడా ఆ భగవన్నామస్మరణ చేస్తూనే మరణిస్తాడు. అంటే రామభక్తుడు రామనామం జపిస్తూ మరణిస్తే, కృష్ణభక్తుడు కృష్ణనామం జపిస్తూ మరణిస్తాడు. ఏ ఉపాసనా చెయ్యని వ్యక్తి పరిస్థితి ఏమిటి?

దీనికొక కథ చెపుతారు. ఏ పూజా చెయ్యని ఒక వ్యక్తి మరణశయ్యమీద ఉన్నాడు. అమ్మలగన్న అమ్మ అయిన పార్వతీదేవికి అతనిమీద జాలివేసింది. ఎలాగైనా అతనిని దీవించమని పరమేశ్వరుణ్ణి వేడుకుంది. అతనికి మనం అవసరం లేదు, వేరే వాటిమీద ఆధారపడతాడు అతను అన్నాడు పరమేశ్వరుడు. కాని పార్వతీదేవి తల్లి హృదయం ద్రవించింది. అతనిమీద జాలి చూపమంది.

పరమేశ్వరుడు దేవి మాట కాదనలేకపోయాడు. 'సరే ఒక పని చేద్దాం. అతని మరణశయ్య దగ్గరకు ఇద్దరం వెళదాము. అతను మరణించే ముందు 'అమ్మా' అంటే అతనిని నువ్వు కాపాడుదువు గాని, 'అయ్యా' అంటే నేను కాపాడతాను,' అన్నాడు. కాని ఏం జరిగివుంటుందో మీరు ఊహించగలరు. అతను 'అమ్మా' అనలేదు, 'అయ్యా' అనలేదు; 'అయ్యో' అని ప్రాణాలు విడిచాడు. 'నేను చెప్పానా?' అన్నట్టుగా శివుడు పార్వతిని చూసి చిరునవ్వు నవ్వాడు.

ఇదీ పరిస్థితి – భగవంతుడు దయాగుణం చూపించి, మనను ఆదుకోవటానికి సిద్ధంగా ఉన్నా, అందుకోవటానికి మనం సిద్ధంగా లేము. మనం ఎంతసేపూ మన పరివారంమీదో, మన ఆస్తిపాస్తులమీదో ఆధారపడతాము. అలా కాకుండా రామా అనో, కృష్ణా అనో అనగలిగేటట్టు ఉండాలి. ఇక్కడ కృష్ణపరమాత్మ రాముడినో, కృష్ణుడినో తీసుకోకుండా ఓంకారాన్ని తీసుకున్నాడు.

శ్లో. 13 **ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్ ।**
**యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం గతిమ్ ॥**
ఓమ్, ఇతి, ఏకాక్షరమ్, బ్రహ్మ, వ్యాహరన్, మామ్, అనుస్మరన్,
యః, ప్రయాతి, త్యజన్, దేహమ్, సః, యాతి, పరమామ్, గతిమ్ ॥

| | | | |
|---|---|---|---|
| ఓమ్, ఇతి | = 'ఓమ్' అను | దేహమ్ | = శరీరమును |
| ఏకాక్షరమ్ | = ఏకాక్షరరూప | త్యజన్ | = త్యజించుచు |
| బ్రహ్మ | = బ్రహ్మమును | ప్రయాతి | = వెళ్ళిపోవుచున్నాడో |
| వ్యాహరన్ | = ఉచ్చరించుచు | సః | = ఆ పురుషుడు |
| మామ్ | = నిర్గుణ పరబ్రహ్మనైన నన్ను | పరమామ్, గతిమ్ | = పరమగతిని |
| అనుస్మరన్ | = చింతన చేయుచు | యాతి | = పొందును |

**ఓమ్ ఇతి ఏక–అక్షరమ్ బ్రహ్మ వ్యాహరన్ మామ్ అనుస్మరన్,**
**యః దేహమ్ త్యజన్ ప్రయాతి, సః పరమామ్ గతిమ్ యాతి ॥**

తా: 'ఓమ్' అను ఏకాక్షరరూపబ్రహ్మమును ఉచ్చరించుచు నిర్గుణపరబ్రహ్మనైన నన్ను చింతన చేయుచూ శరీరమును త్యజించుచు వెళ్ళిపోవుచున్న ఆ పురుషుడు పరమగతిని పొందును.

**ఓమ్ ఇతి వ్యాహరన్** – ఓంకారాన్ని జపిస్తాడు.

**ఏకాక్షరం బ్రహ్మ** – ఓంకారము ఏకాక్షరం. ఒకటే అక్షరం ఉంది దానికి. ఈ ఏకాక్షరం బ్రహ్మకు ప్రతీక. ఈ నిష్కామ ఉపాసకుడు మరణకాలంలో బ్రహ్మకు ప్రతీక అయిన ఓంకారాన్ని జపిస్తూ,

**మామ్ అనుస్మరన్** – నన్నే తలుచుకుంటూ ఉంటే, నన్ను అంటే భగవంతుణ్ణి తలుచుకుంటూ ఉంటే.

**యః ప్రయాతి** – అతను ప్రయాణం చేస్తాడు. దేవుని సహాయంతో నిష్కామ ఉపాసకుడు శుక్లగతిద్వారా వెళతాడని కృష్ణపరమాత్మే తర్వాత చెపుతాడు.

**దేహం త్యజన్** – స్థూలశరీరాన్ని ఇక్కడే వదిలేసి,

**స యాతి పరమాం గతిమ్** – బ్రహ్మలోకానికి వెళతాడు. అంటే అక్కడ బ్రహ్మ దగ్గర జ్ఞానం పొంది, క్రమముక్తిని పొందుతాడు.

మరణించినప్పుడు, ప్రయాణం చేసేది ఏమిటి? దీన్ని కఠోపనిషత్తులో వివరంగా చూస్తాము. వ్యష్టిలో ఐదు భాగాలుంటాయి. అవి స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం, ప్రతిబింబచైతన్యం, బింబచైతన్యం. ఒక వ్యక్తి మరణించినప్పుడు అతని స్థూలశరీరం రాలిపోతుంది. ఇక్కడే దహనం చేస్తారు. బింబచైతన్యం సర్వవ్యాపకం కాబట్టి దానికి ప్రయాణం లేదు. ఇంక మిగిలినవి మూడు. సూక్ష్మశరీరం, కారణశరీరం, ప్రతిబింబచైతన్యం. ఈ మూడింటినీ కలిపి జీవాత్మ అంటారు. జీవాత్మ ప్రయాణం చేస్తుంది.

శ్లో. 14 **అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః ।**
**తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥**
అనన్యచేతాః, సతతమ్, యః, మామ్, స్మరతి, నిత్యశః,
తస్య, అహమ్, సులభః, పార్థ, నిత్యయుక్తస్య, యోగినః ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | స్మరతి | = స్మరించునో |
| యః | = ఏ యోగి | తస్య | = ఆ |
| (మయి) | = (నాయందు) | నిత్యయుక్తస్య | = ఎల్లప్పుడూ మత్పరాయణుడైన |
| అనన్యచేతాః | = అనన్యచిత్తుడై | యోగినః | = యోగికి |
| నిత్యశః | = సర్వదా | అహమ్ | = నేను |
| సతతమ్ | = నిరంతరము | సులభః | = సులభముగా లభింతును |
| మామ్ | = పురుషోత్తముడనైన నన్ను | | |

**హే పార్థ! యః నిత్యశః అనన్య-చేతాః (సన్) మామ్ ।**
**సతతం స్మరతి, తస్య నిత్య-యుక్తస్య యోగినః అహం సులభః (అస్మి) ॥**

తా: ఓ పార్థా! ఏ యోగి నాయందు అనన్యచిత్తుడై సర్వదా నిరంతరము పురుషోత్తముడనైన నన్ను స్మరించునో ఎల్లప్పుడూ మత్పరాయణుడైన ఆ యోగికి నేను సులభముగా లభింతును.

మరణకాలంలో ఓంకారం జపించటం, ప్రాణాలను సుషుమ్నానాడి దగ్గరకు తీసుకురావటం, ఇవన్నీ ఎలా సాధ్యం? దానికి ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ జవాబు చెపుతున్నాడు. నిజానికి ఈ జవాబును ముందే చెప్పాడు. కేవలం అభ్యాసంవల్లనే అది సాధ్యం. ఏమిటా అభ్యాసం? నావి అని విర్రవీగుతున్నవేవీ నావి కావు, అవన్నీ పరమాత్మకు చెందుతాయనే నగ్నసత్యాన్ని జీర్ణించుకోవాలి. నేను అనేకమందితో కలిసే అవకాశాన్ని భగవంతుడు నాకు ఇచ్చాడు. వారిని నేను ప్రేమించాలి, అప్యాయత, అనుబంధం చూపాలి కాని, వారు నావారు కాదు, భగవంతునికి చెందుతారనే విషయం కలలో కూడా మర్చిపోకూడదు. వారితో ఎడబాటు తప్పని పరిస్థితి వచ్చినప్పుడు వారిని మననుంచి దూరం చేస్తాడు ఆ భగవంతుడు.

మనం లేకపోతే, మనవాళ్ళు అనాథలయిపోతారు, అవస్థలు పడతారని మనం చాలా బెంగ పెట్టుకుంటాము. కాని శాస్త్రం ఒక్కటే చెపుతుంది. వారు బాగున్నారంటే అందులో మీ ప్రమేయం ఏమీలేదు. మీరేమీ చెయ్యకుండానే వారు బాగున్నారు, మీరు లేకపోయినా బాగానే ఉంటారు. అందువల్ల వారి గురించి బెంగ పెట్టుకోకండి అంటుంది.

### యోగక్షేమం వహామ్యహమ్

కృష్ణపరమాత్మే హామీపత్రం ఇచ్చాడు – మీ యోగక్షేమాలు నేను చూసుకుంటాను, నామీద భారం వేయండి అన్నాడు. ఇంతకన్నా ఏం కావాలి? అలా భారం వేయగలగటానికి చాలా సాధన కావాలి.

**యః మాం నిత్యశః స్మరతి** – ఒకవేళ ఎవరైనా నన్ను నిరంతరం తలచుకుంటే. నన్ను అంటే వ్యక్తిగత దేవుడు కాదు, సర్వవ్యాపకుడైన భగవంతుణ్ణి తలుచుకుంటే.

అల-సముద్రం ఉదాహరణ తీసుకుంటే, అల సంబంధం సముద్రంతో శాశ్వతంగా ఉంటుంది. అది సముద్రంనుంచే పుట్టి, సముద్రంలోనే స్థితి పొంది, సముద్రంలోనే లయమవుతుంది. అల ఈ జన్మవిషయం. అల మళ్ళీ పునర్జన్మ ఎత్తితే, ఎక్కడనుంచి పుట్టింది? ఈ సముద్రంనుంచే. అందువల్ల సముద్రంతో అల అనుబంధం శాశ్వతం. అదే రెండు అలల మధ్య అనుబంధం తీసుకుంటే, అది అశాశ్వతం.

ఇదే సూత్రం మనకు కూడా వర్తిస్తుంది. మనం భగవంతునినుంచే పుట్టి, ఆయనవల్లనే స్థితి పొంది, ఆయనలోనే లయమవుతాము. అది ఈ జన్మవిషయం. మనం మళ్ళీ పునర్జన్మ ఎత్తితే, ఎక్కడనుంచి పుడతాము? ఆ భగవంతునినుంచే. అందువల్ల భగవంతునితో మన అనుబంధం శాశ్వతం. అదే తోటి మానవులతో మన అనుబంధం అశాశ్వతం. మనుష్యులతో అనుబంధాన్ని ఆగంతుకం అంటారు. మన ప్రాథమిక అనుబంధం

మనను భక్తులను చేస్తే; ఆగంతుక అనుబంధం మనను భర్తగా, తండ్రిగా, సోదరునిగా అనేక పాత్రలు ధరించేలా చేస్తుంది.

ఈ పాత్రలను ధరించాలి, బాగా కూడా పోషించాలి. ఎవ్వరూ కాదనటం లేదు దానిని. కాని వాటి మాయలో పడి కొట్టుకుపోకూడదు. సంగీత విద్వాంసుడు పాట పాడుతున్నంతసేపు తంబూరశ్రుతిని మర్చిపోడు; ఒకవేళ మర్చిపోతే అపశ్రుతి పలుకుతాడు.

**అనన్యచేతాః** – అందువల్ల, ఎవరైతే నిరంతరం మనస్సును నామీదే నిలుపుతారో;

**తస్య** – అటువంటి నిష్కామ ఉపాసకునికి,

**పార్థ అహం సులభః** – నన్ను గుర్తు పెట్టుకోవటం చాలా తేలిక. ధనంమీద వ్యామోహం ఉన్న భక్తుడు, ఎలా నిరంతరం రూపాయిల నామస్మరణం చేస్తాడో; అలా భగవంతునిలో మనస్సు నిలిపిన ఉపాసకుడు, నిరంతరం భగవన్నామస్మరణ చేస్తాడు. గుర్తుంచుకోండి, మీకు జీవితంలో ఏది విలువైనదైతే దాన్నే ఎప్పుడూ తలుచుకుంటారు.

**నిత్యయుక్తస్య యోగినః** – యోగినః అంటే సాధకుడు. ఇక్కడ ఉపాసకుడు. నిత్యమూ నన్నే తలుచుకుంటాడు కాబట్టి అతనికి నేను తేలికగా లభిస్తాను.

ఈ శ్లోకంతో ఏడవ ప్రశ్నకు జవాబు ముగించాడు కృష్ణపరమాత్మ. ఏడవ ప్రశ్నలో రెండు భాగాలున్నాయని చూశాము.

7ఎ) మరణకాలంలో దేవుణ్ణి తలుచుకోవటంలో ఏదైనా ప్రత్యేకత ఉందా? ఉంటే అది ఏమిటి?

జవాబు – మరణకాలంలో దేవుణ్ణి తలుచుకోవటంవల్ల **పరమం పురుషం దివ్యమ్** పొందుతాడు. అంటే సర్వవ్యాపకుడైన భగవంతుణ్ణి పొందుతాడు. అంటే మన హృదయంలో ఉండి, సర్వవ్యాపకుడైన నిత్యచైతన్య స్వరూపాన్ని పొందుతాడు. క్రమముక్తి పొందుతాడు.

7బి) మరణకాలంలో భగవంతుణ్ణి ఎలా తలచుకోగలడు?

జవాబు – **నిష్కామభక్తుడు నిరంతరం భగవన్నామస్మరణ చేస్తూ** ఉంటే, మరణకాలంలో కూడా తలచుకోగలడు.

### 3. రెండు రకాల లక్ష్యాలు – శ్లోకాలు 15–22

ఇంతకు ముందు శ్లోకంతో ఏడవ ప్రశ్నకు జవాబు ముగిసింది. అంతకాల ఈశ్వరస్మరణం గురించి వివరంగా చెప్పాడు కృష్ణపరమాత్మ.

ఇప్పుడు అంటే 15–22 శ్లోకాల వరకూ రెండు రకాల లక్ష్యాల గురించి చెప్పబోతున్నాడు.
అవి భగవంతుడు+ ప్రపంచం. వాటిని ఆధ్యాత్మలక్ష్యం – ప్రాపంచిక లక్ష్యం అనవచ్చు లేదా శాశ్వతలక్ష్యం – అశాశ్వతలక్ష్యం అనవచ్చు. తెలివైనవ్యక్తి భగవంతుణ్ణి లక్ష్యంగా ఎన్నుకుంటే, అవివేకి భగవంతుణ్ణి తప్ప అన్ని రకాల విషయాలనూ కోరుకుంటాడు. భగవంతుణ్ణి ఎన్నుకోవటమే గొప్ప లక్ష్యమని ఎందుకంటున్నాడో దానికి కృష్ణపరమాత్మ జవాబు ఇవ్వబోతున్నాడు.

**ప్రాపంచిక లక్ష్యం:** నిజానికి ప్రాపంచిక లక్ష్యంలో ఉండే లొసుగులు మనం అంతకుముందే చూశాము. ప్రాపంచిక లక్ష్యాలు అంటే కర్మమార్గం ఎన్నుకుంటే ధర్మ, అర్థ, కామాలు అనే మూడు ఫలాలు వస్తాయి నిజమే కాని, వాటిని వెన్నంటే మూడు కర్మఫలదోషాలు కూడా వస్తాయి. అవి దుఃఖమిశ్రితత్వం, అతృప్తికరత్వం, బంధకత్వం.

1. **దుఃఖమిశ్రితత్వం** – ప్రాపంచిక సుఖాలలో ఏది పొందాలన్నా కూడా దానితో పాటు కష్టం కూడా మేళవించి ఉంటుంది. సుఖదుఃఖాలు నాణేనికి బొమ్మాబొరుసు లాంటివి. ఎంతో పోటీని ఎదుర్కొని ఒక విషయాన్ని సాధించాలి. నిజానికి ఏదైనా పోటీలో పాల్గొనాలన్నా కూడా చాలామందిని దాటుకుని ముందుకు రావాలి. అంటే బెంగ, ఆందోళన, భయం, ఈర్ష్యలాంటి భావాలెన్నో కలుగుతాయి. ఒకవేళ అనుకున్నదాన్ని పొందినా, దాన్ని నిలుపుకోవటానికి చాలా కష్టపడాలి. యోగక్షేమం అంటారు. యోగం అంటే ఒక వస్తువును పొందటం, క్షేమం అంటే పొందిన వస్తువును నిలబెట్టుకోవటం. ఆర్జనే దుఃఖం; రక్షణే దుఃఖం. కష్టపడి దాన్ని నిలబెట్టుకున్నా కూడా దానికి ఒక కాలపరిమితి ఉంది. ఎలా వచ్చిందో, అలా వెళ్ళిపోతుంది. వెళ్ళిపోయినా మనకు దుఃఖం కలగజేస్తుంది. ఆ దుఃఖం దాన్నించి మనం పొందిన ఆనందంతో ముడిపడివుంటుంది. నష్టపోయిన దానివల్ల దుఃఖం. అంటే ముందు రెండింటికీ దీన్ని కూడా కలుపుకోవాలి – ఆర్జనే దుఃఖం, రక్షణే దుఃఖం, నాశే దుఃఖం. అంటే ఒక ప్రియవస్తువును పొందటంలో దుఃఖం; దాన్ని కాపాడుకోవటంలో దుఃఖం. అది పోతే దుఃఖం అనుభవిస్తాము. అందువల్ల ప్రతికర్మఫలం కూడా దుఃఖమిశ్రితత్వం.

2. **అతృప్తికరత్వం** – ఎంత ఉన్నా తృప్తి తీరదు. ఇంకా ఇంకా ఏదో కావాలనిపిస్తుంది. ఉన్నదానితో తృప్తి పడము, లేనిది కావాలి. మనకన్నా ఎక్కువ ఉన్నవారిని చూసి ఈర్ష్య పడతాము. పక్కవారితో పోల్చుకునే మనస్తత్వం మానవజాతిది. ఎప్పుడైతే ఇతరులతో పోల్చుకుంటామో అప్పుడే ఆత్మన్యూనతా భావన, ఈర్ష్య రాజుకుంటాయి. దీన్నే అతృప్తికరత్వం అంటారు.

**న విత్తేన తర్పణీయో మనుష్యః – కఠ 1.1.27**

ఎంత డబ్బు ఇచ్చినా ఏ మనిషి కూడా తృప్తి పడదు అంటాడు చిన్నపిల్లవాడు నచికేతుడు. అలా తృప్తి ఉందుంటే, ఇంత పెద్ద ఎత్తున లంచగొండితనాలు, మోసాలు, స్కాములు ఎందుకు జరుగుతాయి?

ఎంతున్నా తృప్తి తీరదు కాబట్టే దయానందస్వామి ఎవరూ ధనవంతులు లేరు అంటారు. ధనవంతుడు అంతకు ముందు డబ్బులేని బీదవాడు అయితే, ఇప్పుడు డబ్బున్న బీదవాడు అంటారు. ఎందుకంటే ఎంత డబ్బున్నా, లోపల బీదరికం పోదు.

అపూర్ణం + అపూర్ణం = అపూర్ణం. పరిమితి ఉన్న వస్తువులు ఎన్ని ఉన్నా అవి పరిమితమైనవే అవుతాయి కాని, అపరిమితమైనవి అవవు. అనంతానికి, మనకూ మధ్య ఉన్న దూరం అలాగే ఉంటుంది. వంద రూపాయలకూ, అనంతానికీ మధ్య ఎంత దూరం ఉందో, లక్షరూపాయలకూ, అనంతానికీ మధ్య ఉన్న దూరం కూడా అంతే ఉంటుంది. అందువల్ల మనం అపూర్ణంగానే ఉండిపోతాము. ప్రాపంచిక వస్తువులను పొందటంలో అపూర్ణం నుంచి అపూర్ణంకి ప్రయాణం చేస్తాము కాబట్టి, ప్రతికర్మఫలం అతృప్తికరత్వంగానే ఉంటుంది.

3. **బంధకత్వం** – ప్రాపంచిక విషయాలను కోరి, వాటిని పొందితే వాటిమీద బంధం ఏర్పడుతుంది. పేరు, హోదా కూడా బంధాలే. హోదా పోతే భరించలేము. ఇంట్లో ఎవరైనా పట్టించుకోకపోతే భరించలేము. ఈ బంధాలతో ఎంతగా పెనవేసుకుపోతామంటే, అవి లేని జీవితాన్ని ఊహించలేము.

**భగవంతుడు లక్ష్యం:** భగవంతుడు ఒక్కడే పూర్ణత్వాన్ని సూచిస్తాడు. ఎందుకంటే భగవంతుణ్ణి నా లక్ష్యంగా ఎన్నుకుంటే చివరికి భగవంతుడు ఎక్కడో లేడు. నేనే ఆ భగవంతుణ్ణి అని తెలుసుకుంటాను. **అహం బ్రహ్మ అస్మి** అని తెలుసుకుంటాను. దీనివల్ల భగవంతునిమీద ఆధారపడటం మానేసి, నామీదే ఆధారపడతాను. నేను అంటే పూర్ణత్వం, చైతన్యం; నేను శాంతి భద్రతలకు నిలయం.

ఆ విధంగా ప్రపంచంమీద ఆధారపడే దశనుంచి భగవంతునిమీద ఆధారపడే దశకు వచ్చి, భగవంతునిమీద ఆధారపడే దశనుంచి, నామీదే ఆధారపడే దశకు రావాలి. రెండు దశలూ భగవంతునిమీద ఆధారపడటం నేర్చుకుంటే సాధ్యమవుతాయి. అదే ఈ శ్లోకాల్లో చెప్పబోతున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 15 **మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయమశాశ్వతమ్ ।**
**నాప్నువంతి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః ॥**
మామ్, ఉపేత్య, పునర్జన్మ, దుఃఖాలయమ్, అశాశ్వతమ్,
న, ఆప్నువంతి, మహాత్మానః, సంసిద్ధిమ్, పరమామ్, గతాః ॥

| | | | |
|---|---|---|---|
| పరమామ్ | = అత్యుత్తమమైన | ఉపేత్య | = పొందిన తరువాత |
| సంసిద్ధిమ్ | = పూర్ణత్వం | దుఃఖాలయమ్ | = దుఃఖములకు నిలయమైన |
| గతాః | = పొందినట్టి | అశాశ్వతమ్ | = క్షణభంగురమైన |
| మహాత్మానః | = మహాత్ములు | పునర్జన్మ | = పునర్జన్మను |
| మామ్ | = నన్ను | న, ఆప్నువంతి | = పొందరు |

**పరమామ్ సంసిద్ధిమ్ గతాః మహాత్మానః మామ్ ఉపేత్య,**
**పునః దుఃఖ–ఆలయమ్ అశాశ్వతమ్ జన్మ న ఆప్నువన్తి ॥**

తా: అత్యుత్తమమైన పూర్ణత్వం పొందినట్టి మహాత్ములు నన్ను పొందిన తరువాత దుఃఖములకు నిలయమైన క్షణభంగురమైన పునర్జన్మను పొందరు.

**మామ్ ఉపేత్య** – నన్ను పొందితే; ఎవరు?

**మహాత్మానః** – మహాత్ములు అంటే తెలివైనవారు; వారు పొందే ఫలం ఏమిటి?

**పునర్జన్మ న ఆప్నువంతి** – వారు అశాశ్వతమైన ఫలాలను పొందరు. అందువల్ల జీవితంలోని ఎత్తుపల్లాలను అనుభవించరు. నీళ్ళలో తేలే దుంగ పైకీ, కిందకీ ఊగుతూ ఉంటుంది. తక్కిన లక్ష్యాలన్నీ అలా ఒకసారి విజయలక్ష్మిని వరించేలా చేస్తే, ఇంకొకసారి ఓటమిని చవిచూసేలా చేస్తాయి. ఇక్కడ పునర్జన్మ అంటే అశాశ్వతమైనవి, న ఆప్నువంతి – పొందరు. అశాశ్వతమైనవి ఎలా ఉన్నాయి?

**దుఃఖాలయమ్** – దుఃఖాలకు నిలయం. మనం శివాలయం, రామాలయం పేర్లు వాడతాము. ఇక్కడ సంసారానికి దుఃఖాలయం పదం వేశాడు కృష్ణపరమాత్మ. శివాలయంలో శివుణ్ణి ప్రాణప్రతిష్ఠ చేస్తారు. అంటే శివుడు అక్కడ శాశ్వతంగా ఉంటాడు. అలాగే ఇక్కడ దుఃఖాలయంలో సంసారం అనే ఆలయంలో దుఃఖం శాశ్వతంగా కొలువుతీరి ఉంటుంది.

**అశాశ్వతమ్** – అంతేకాదు, వచ్చే ఫలితాలు శాశ్వతం కావు, అవి క్షణభంగురాలు. అటువంటి అశాశ్వతమైన సంసారాన్ని మహాత్ములు పొందరు.

**పరమాం సంసిద్ధిం గతాః** – అత్యంత ఉన్నతమైన పూర్ణత్వాన్ని పొందుతారు. అంటే మోక్షాన్ని పొందుతారు.

శ్లో. 16 **ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున ।**
**మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥**
ఆబ్రహ్మభువనాత్, లోకాః, పునరావర్తినః, అర్జున,
మామ్, ఉపేత్య, తు, కౌంతేయ, పునర్జన్మ, న, విద్యతే ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున! | = ఓ అర్జునా! | మామ్ | = దేశకాల అతీతుడునైన నన్ను |
| ఆబ్రహ్మ భువనాత్ | = బ్రహ్మలోక పర్యంతము గల | ఉపేత్య | = పొందుటవలన |
| లోకాః | = సమస్త లోకములును | పునర్జన్మ | = పునర్జన్మ |
| పునరావర్తినః | = పునరావృత్తములు | న, విద్యతే | = ఉండదు |
| తు, కౌంతేయ! | = కాని, ఓ అర్జునా! | | |

**హే అర్జున! ఆబ్రహ్మ-భువనాత్ (సర్వే) లోకాః పునః-ఆవర్తినః**
**(సన్తి); హే కౌన్తేయ! మామ్ ఉపేత్య తు పునః జన్మ న విద్యతే ॥**

తా: ఓ అర్జునా! బ్రహ్మలోక పర్యంతము గల సమస్త లోకములును పునరావృత్తములు కాని, ఓ అర్జునా! దేశకాల అతీతుడునైన నన్ను పొందుటవలన పునర్జన్మ ఉండదు.

స్వర్గలోకాల మాటేమిటి? కృష్ణపరమాత్మ ఇక్కడ స్పష్టంగా చెపుతున్నాడు – బ్రహ్మలోకం కూడా శాశ్వతఫలాన్ని ఇవ్వదని. శాస్త్రం ప్రకారం భూలోకం పైన ఆరు పుణ్యలోకాలు ఉన్నాయి. అవి – భువర్లోకం, సువర్లోకం,

మహర్లోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకం. సత్యలోకాన్ని బ్రహ్మలోకం అంటారు. ఒకదాని మించి ఇంకో లోకంలో ఆనందం, భద్రతలు ఎక్కువ అవుతూ వస్తాయి. అక్కడ ఉండే కాలం కూడా ఎక్కువ అవుతూ వస్తుంది. కాని కృష్ణపరమాత్మ బ్రహ్మలోకానికి వెళ్ళినా సరే, అది కూడా శాశ్వతమైన ఫలం కాదు. పుణ్యం ముగియగానే వెనక్కి తిరిగి రావాల్సిందే అంటున్నాడు. ఆ తిరిగి రావటం భూలోకానికే వస్తామో, ఇంకా హీనమైన లోకాలకే వెళతామో తెలియదు.

**ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున** – బ్రహ్మలోకం వరకూ. బ్రహ్మదేవుడు కూడా శాశ్వతం కాదు. సృష్టికర్త బ్రహ్మ కూడా శాశ్వతం కాదు. నిజానికి బ్రహ్మ అనేది ఒక పదవి. ఇంద్రుడు, యమధర్మరాజు, బ్రహ్మ– ఇవన్నీ పదవులు. వారు కూడా జ్ఞానం పొందాల్సిందే.

**మాముపేత్య తు కౌంతేయ** – కాని, అర్జునా, దేశకాల అతీతుడునైన నన్ను పూజిస్తే,

**పునర్జన్మ న విద్యతే** – పునర్జన్మ ఉండదు. మళ్ళీ అశాశ్వత ఫలాలను పొందదు.

శ్లో. 17 **సహస్రయుగపర్యంతమ్ అహర్యద్బ్రహ్మణో విదుః ।**
**రాత్రిం యుగసహస్రాంతాం తేఽహోరాత్రవిదో జనాః ॥**
సహస్రయుగపర్యంతమ్, అహః, యత్, బ్రహ్మణః, విదుః,
రాత్రిమ్, యుగసహస్రాంతామ్, తే, అహోరాత్రవిదః, జనాః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| యత్ | = | ఏది | రాత్రిమ్ | = | రాత్రిగాను |
| సహస్రయుగ పర్యంతమ్ | = | వేయి చతుర్యుగముల కాలము | (యే) | = | ఏ పురుషులు |
| బ్రహ్మణః | = | బ్రహ్మకు | విదుః | = | తెలుసుకుంటారో |
| అహః | = | పగలు అనియు | తే, జనాః | = | అట్టి యోగులు |
| (యామ్) | = | ఏది | అహోరాత్రవిదః | = | కాలతత్త్వమును నిజముగా తెలుసుకున్నవారు |
| యుగసహస్రాంతామ్ | = | అటువంటి వేయి చతుర్యుగముల కాలమును | | | |

**యత్ తే అహోరాత్ర–విదః జనాః సహస్ర–యుగ–పర్యన్తమ్ బ్రహ్మణః**
**అహః యుగ–సహస్ర–అన్తామ్ రాత్రిమ్ (చ) విదుః ॥**

తా: ఏది వేయి చతుర్యుగముల కాలము బ్రహ్మకు పగలు అనియు, ఏది అటువంటి వేయి చతుర్యుగముల కాలమును రాత్రిగాను ఏ పురుషులు తెలుసుకొంటారో అట్టి యోగులు కాలతత్త్వమును నిజముగా తెలుసుకున్నవారు.

ఈ శ్లోకాల్లో బ్రహ్మదేవుని జీవితకాలం గురించి చర్చిస్తున్నాడు. బ్రహ్మ పదం మాత్రం వాడితే నిర్గుణబ్రహ్మ; బ్రహ్మదేవుడు అంటే సగుణబ్రహ్మ లేదా చతుర్ముఖబ్రహ్మ.

బ్రహ్మదేవుని జీవితకాలం ఎంత? ఒకరోజు, నెల, సంవత్సరం లాగా యుగం ఒక కాలపరిమితి. మనకు నాలుగు యుగాలు ఉన్నాయి. అవి కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం. ఇప్పుడు మనం ఉన్నది కలియుగంలో.

శాస్త్రం ప్రకారం: కలియుగం కాలపరిమితి = 432000 సంవత్సరాలు

ద్వాపరయుగం – కలియుగం × 2 = 432000 × 2 = 864000 సంవత్సరాలు

త్రేతాయుగం – కలియుగం × 3 = 432000 × 3 = 1296000 సంవత్సరాలు

కృతయుగం – కలియుగం × 4 = 432000 × 4 = 1728000 సంవత్సరాలు

చతుర్యుగాలు = ఈ నాలుగు యుగాల మొత్తం = 4320000 సంవత్సరాలు

2000 చతుర్యుగాలు = 4320000 × 2000

అటువంటి 2000 చతుర్యుగాల కాలం = 1 రోజు బ్రహ్మదేవునికి.

అటువంటిది ఒకరోజు అయితే బ్రహ్మదేవుని ఆయుష్షు 100 సంవత్సరాలు. మనకు సంవత్సరం అంటే 365 రోజులే. కాని బ్రహ్మదేవునికి ఒక్కరోజే 2000 చతుర్యుగాల కాలం అయితే 100 సంవత్సరాలు ఎంత కాలం ఉంటుందో ఊహించండి. అంతకాలం బ్రహ్మదేవుని జీవితం ఉంటుంది.

ఇప్పుడు ఆయన వయస్సు ఎంత? ఏ పూజ చేసినా, సంకల్పంలో ఏమని చదువుతాము? బ్రహ్మ పరార్ధకాలే అంటాము. పరార్ధం అంటే 50 సంవత్సరాలు. బ్రహ్మకు అలా పరార్ధద్వయం ఉంది అంటే రెండు యాభై సంవత్సరాలు. ఇప్పుడు ద్వితీయ పరార్ధే అని చదువుతాము. అంటే యాభై సంవత్సరాలు పూర్తయి 51 లోకి అడుగుపెట్టాడు. మొదటిరోజు 2000 చతుర్యుగాలు ఉన్నాయి. ఇది అష్టావింశతితమే. 28వ చతుర్యుగం. అంటే ఆయనకి ఇంకా ఎంతకాలం ఉందో లెక్క వేసుకోండి. ఈ రెండువేల చతుర్యుగాల కాలంలో వెయ్యి చతుర్యుగాలు బ్రహ్మదేవుడు మేలుకుని ఉంటాడు; వెయ్యి చతుర్యుగాలు పడుకుని ఉంటాడు.

**సహస్రయుగ పర్యంతమ్** – వెయ్యి చతుర్యుగాలు; ఇక్కడ యుగం అంటే చతుర్యుగం అని తీసుకోవాలి.

**బ్రహ్మణః అహః** – బ్రహ్మదేవునికి పగలు

**యుగసహస్రాంతాం రాత్రిమ్** – ఇంకొక వెయ్యి చతుర్యుగాలు బ్రహ్మదేవునికి రాత్రికాలం. ఇవన్నీ ఎవరికి తెలుసు?

**అహోరాత్రవిదో జనాః** – జనాః అంటే యోగులు. లోకాల గురించి వివరించే శాస్త్రాలను అధ్యయనం చేసినవారు ఈ కాలతత్త్వాన్ని వివరించారు. బ్రహ్మయొక్క రాత్రి, పగలులలో ఏమవుతుంది? దాన్ని రాబోయే శ్లోకంలో చూస్తాము.

శ్లో. 18 **అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే ।**
**రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్తసంజ్ఞకే ॥**
అవ్యక్తాత్, వ్యక్తయః, సర్వాః, ప్రభవంతి, అహరాగమే,
రాత్ర్యాగమే ప్రలీయంతే, తత్ర, ఏవ, అవ్యక్తసంజ్ఞకే ॥

| | | | |
|---|---|---|---|
| అహరాగమే | = బ్రహ్మయొక్క పగటికాలము ప్రారంభము కాగానే | రాత్ర్యాగమే | = బ్రహ్మయొక్క రాత్రికాలము ప్రారంభము కాగానే |
| సర్వాః, వ్యక్తయః | = చరాచరప్రాణులన్నియును | తత్ర, అవ్యక్తసంజ్ఞకే, ఏవ | = అవ్యక్తంలోకి |
| అవ్యక్తాత్ | = అవ్యక్తమునుండి | ప్రలీయంతే | = వెళ్ళిపోతాయి |
| ప్రభవంతి | = ప్రకటితములు అవుతాయి ఇంకా | | |

**అహః ఆగమే సర్వాః వ్యక్తయః అవ్యక్తాత్ ప్రభవన్తి,**
**(పునః) రాత్రి ఆగమే తత్ర అవ్యక్త-సంజ్ఞకే ఏవ ప్రలీయన్తే ॥**

తా: చరాచర ప్రాణులన్నియును బ్రహ్మయొక్క పగటికాలము ప్రారంభము కాగానే అవ్యక్తమునుండి ప్రకటితములు అవుతాయి ఇంకా బ్రహ్మయొక్క రాత్రికాలము ప్రారంభము కాగానే అవ్యక్తంలోకి వెళ్ళిపోతాయి.

బ్రహ్మదేవుని రాత్రి, పగలులలో ఏమవుతుంది? మన రాత్రి, పగలులలో ఏమవుతుందో అదే అవుతుందంటున్నాడు కృష్ణపరమాత్మ. మన పగలులో మనం లేవగానే వ్యవహారాలు చేస్తాము. దేశం, కాలం, మన ప్రారబ్ధకర్మ మొదలవుతాయి. అనేక సుఖదుఃఖాలను అనుభవిస్తాము. నిద్రపోతే, ద్వైతప్రపంచం లయమయి పోతుంది. దేశకాల పరిచ్ఛిన్నం ఉండదు. వ్యవహారాలు నడుపము. అందువల్ల సుఖదుఃఖాలు ఉండవు. అందువల్ల సుషుప్తిని నిర్వికల్ప అవస్థ అంటారు. కాకపోతే, నేను నిద్రపోతే నాకు మాత్రమే బాహ్యప్రపంచం లయమవుతుంది. ఇంకా మేలుకుని ఉన్నవారికి బాహ్యప్రపంచం అలాగే ఉంటుంది. వాళ్ళ వ్యవహారాలు కొనసాగుతూనే ఉంటాయి.

కాని బ్రహ్మదేవుని విషయంలో ఆయన పడుకుంటే అది ప్రళయం అవుతుంది. మనం పడుకుంటే అది లయం; బ్రహ్మ పడుకుంటే ప్రళయం. సృష్టి మొత్తం అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. నేను పడుకున్నప్పుడు నా ప్రపంచం అవ్యక్తంలోకి వెళుతుంది. నేను లేవగానే నా ప్రపంచం మళ్ళీ వస్తుంది. అది అవ్యక్తంలోకి వెళుతుంది కాని నాశనమవదు. ఎందుకంటే నేను లేవగానే నా బెంగలు, నా సుఖదుఃఖాలు మళ్ళీ వస్తాయి. బ్రహ్మదేవుని నిద్రలో సృష్టి అంతా అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది.

**రాత్ర్యాగమే** – బ్రహ్మదేవునికి రాత్రి వచ్చినప్పుడు;

**సర్వాః వ్యక్తయః ప్రలీయంతే** – చరాచర ప్రాణులన్నీ లయమవుతాయి. ఎందులోకి?

**అవ్యక్తసంజ్ఞకే** – అవ్యక్తంలోకి వెళ్ళిపోతాయి. వైజ్ఞానిక శాస్త్రపరంగా కూడా పదార్థాన్ని నాశనం చెయ్యలేము, సృష్టించనూలేము. పదార్థం శక్తిగా మారుతుంది. అలాగే జగత్తు, ప్రళయంలో అవ్యక్తంలోకి వెళ్ళి,

**అవ్యక్తాత్ ప్రభవంతి** – మళ్ళీ అవ్యక్తంలోంచి, వ్యక్తంలోకి వస్తుంది. ఆ విధంగా ప్రపంచం వ్యక్తం–అవ్యక్తం అనే వృత్తంలో నిరంతరం తిరుగుతూ ఉంటుంది. ఇది మన స్వప్నవృత్తాంతం లాగానే ఉంటుంది. ఇవాళ్టి మన స్వప్నం మన మనస్సులో అవ్యక్తరూపంలో ఉంటుంది. కల కన్నప్పుడు అది వ్యక్తమవుతుంది, మళ్ళీ మన మనస్సులోకి అంటే అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. అలాగే బ్రహ్మసృష్టి కూడా అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి వచ్చి, మళ్ళీ వ్యక్తంలోంచి అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది.

**అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।**
**అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥** – గీత 2.28

ఇదే భావన అక్కడ కూడా చూశాము. ఇది చాలా ముఖ్యమైన అంశం. ఎందుకంటే దీనినుంచి ఒక ఉపసిద్ధాంతం ఏర్పడుతుంది. నిజానికి జగత్తు సృష్టించబడలేదు. వేదాంతం ప్రకారం సృష్టిపదం వాడకూడదు. జగత్తు అనాదిగా ఉంది. ఇంతకుముందు చూసినట్టుగా పదార్థాన్ని సృష్టించలేము, నాశనం చెయ్యలేము. ఇది ప్రకృతి సూత్రం.

అలా అయితే 'సృష్టి' పదాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? సృష్టి పదం బదులు 'వ్యక్తం' పదం వాడాలి. అంతకు ముందు కూడా జగత్తు ఉంది. కాకపోతే అది అవ్యక్తదశలో ఉండి, తర్వాత వ్యక్తంలోకి వచ్చింది. దేనివల్ల వ్యక్తంలోకి వచ్చింది? కాలంవల్ల. కాలం పదార్థంలోని అంతర్భాగం. కాలాన్ని, పదార్థాన్ని విడదీయలేము. అందువల్ల అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి వచ్చాయి అన్నాడు కృష్ణపరమాత్మ. అలా వ్యక్తం–అవ్యక్తం వృత్తం కొనసాగుతుంది.

శ్లో. 19 **భూతగ్రామః స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే ।**
**రాత్ర్యాగమేఽవశః పార్థ ప్రభవత్యహరాగమే ॥**
భూతగ్రామః, సః, ఏవ, అయమ్, భూత్వా, భూత్వా, ప్రలీయతే,
రాత్ర్యాగమే, అవశః, పార్థ, ప్రభవతి, అహరాగమే ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = అర్జునా! | అవశః | = ప్రకృతివశమున |
| సః, ఏవ | = అలాగే | రాత్ర్యాగమే | = రాత్రి ప్రవేశకాలమునందు |
| అయమ్ | = ఈ | ప్రలీయతే | = లీనమగును |
| భూతగ్రామః | = భూతసముదాయము | అహరాగమే | = దినప్రవేశ కాలమునందు |
| భూత్వా, భూత్వా | = మళ్ళీ మళ్ళీ ఉత్పన్నమగుచు | ప్రభవతి | = తిరిగి ఉత్పన్నమగును |

**హే పార్థ! సః ఏవ అయమ్ భూత–గ్రామః అవశః (సన్),**
**భూత్వా భూత్వా రాత్రి ఆగమే ప్రలీయతే (పునః) అహః ఆగమే ప్రభవతి ॥**

తా: అర్జునా! అలాగే ఈ భూతసముదాయము మళ్ళీ మళ్ళీ పుడుతూ ప్రకృతివశమున రాత్రి ప్రవేశకాలమునందు లీనమగును ఇంకా దినప్రవేశకాలమునందు తిరిగి ఉత్పన్నమగును.

జగత్తు అవ్యక్తంలోకి వెళ్ళిపోయి, మళ్ళీ వ్యక్తంలోకి వస్తే జీవుల పరిస్థితి ఏమిటి? జీవుల పరిస్థితి కూడా అంతే. అంటే జీవులు కూడా అవ్యక్తంలోకి వెళతాయి, మళ్ళీ వ్యక్తంలోకి వస్తాయి. జీవులు అలా అవ్యక్తంలో వెయ్యి చతుర్యుగాలు ఉండి, వాటి కర్మఫలానుసారం మళ్ళీ పుడతాయి.

ప్రళయంలో అలా అవ్యక్తంలోకి వెళ్ళి, మళ్ళీ వ్యక్తంలోకి రావటం ఎలా జరుగుతుందో తెలుసుకోవాలనుకుంటే, భగవంతుడు మనకు ప్రళయ అనుభవాన్ని ప్రతిరాత్రీ రుచి చూపిస్తున్నాడు. ఎలా? మన సుషుప్తి అనుభవం ద్వారా. సుషుప్తిలో మన అహంకారం, మన జ్ఞానం, మన అజ్ఞానం, మన ఆనందం, మన దుఃఖం అన్నీ లయమవుతాయి. అవి నాశనమవవు, అవ్యక్తంలోకి వెళ్ళిపోతాయి. అవి నాశనమవవు అని ఎలా తెలుసు? మనం లేవగానే మన అహంకారం, మన జ్ఞానం అన్నీ మళ్ళీ వస్తాయి కదా. ఈ భగవద్గీతను చదువుతూ, చదువుతూ నిద్ర పోయారనుకోండి. ఎక్కడ ఆపారో గుర్తుంటుంది కదా! మర్నాడు లేచాక అక్కడ్నుంచి చదువుతారు. లేకపోతే ఎప్పటికీ మొదటి పేజీనుంచి చదవాల్సి ఉంటుంది. అంటే నిద్రలో మన జ్ఞానం నాశనం అవలేదు, అవ్యక్త స్థితిలో ఉంది. అలాగే ప్రళయంలో జీవరాశులు అన్నీ అవ్యక్తంలోకి వెళ్ళిపోయి, మళ్ళీ వచ్చే సృష్టిలో వస్తాయి.

**సః ఏవ అయం భూతగ్రామః** – ఇవే జీవాల సముదాయము. అవ్యక్తంలోకి వెళ్ళి, మళ్ళీ అవే జీవులు కొత్త సృష్టిలో వ్యక్తంలోకి వస్తాయి.

**భూత్వా భూత్వా** – మళ్ళీ మళ్ళీ వస్తాయి. మళ్ళీ, మళ్ళీ అని రెండుసార్లు చెప్పటం వల్ల అది ఒక నిరంతర వృత్తం అని చెపుతున్నాడు కృష్ణపరమాత్మ. ప్రళయంలో మళ్ళీ ఇవే ప్రాణులు అవ్యక్తంలోకి వెళ్ళిపోతాయి. అంటే దీన్నిబట్టి తెలుస్తున్నది ఏమిటి? కొత్త జీవి ఏదీ సృష్టించబడటం లేదు. ఉన్న జీవులే వృత్తంలో తిరుగుతున్నాయి.

కొత్తగా జీవులు పుట్టటం లేదంటే, మనుష్యుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతూనే ఉంది కదా, దీనికేమిటి జవాబు? మనం జనాభా సంఖ్య పెరుగుతోంది అన్నప్పుడు, మనం మానవజాతి సంఖ్యను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నాము కాని శాస్త్రం ప్రకారం జీవులు అంటే అన్ని జీవరాశులూ, జీవరాశులలో పధ్నాలుగు లోకాల్లోనూ ఉన్న దేవతలు, అసురులు వస్తారు; చీమలూ, దోమలూ కూడా వస్తాయి. కాబట్టి జీవరాశుల సంఖ్య మారదు; మానవజాతి సంఖ్య మారవచ్చు.

దీనికి జవాబు చిన్మయానందస్వామి హాస్యంగా చెపుతారు. అంతకుముందు దట్టమైన అడవులు చాలా ఉండేవి. వాటిలో అనేక పులులు, సింహాలు, కొండచిలువలు హాయిగా నివసించేవి. కాని మనిషి ఆ అడవులను కొట్టివేయటంతో ఈ పులులు, సింహాలు, కొండచిలువలు మానవజన్మను ఎత్తాల్సివచ్చింది. అందువల్ల కొత్త జీవి పుట్టే ప్రసక్తి లేదు.

కొత్త జీవి పుడితే ఇంకొక సమస్య వస్తుంది. కొత్త జీవిని కొత్తగా సృష్టించాలంటే, ఆ జీవికి ఎటువంటి శరీరాన్ని ఇవ్వాలి? భగవంతునికి ఇదొక పెద్ద సమస్య అవుతుంది. భగవంతుడు మనం గతజన్మల్లో చేసుకున్న కర్మను బట్టి మనకు తర్వాత జన్మను ఇస్తాడు. మన కర్మఫలాలను బట్టి మనకు మనుష్యశరీరాన్ని ఇవ్వాలో, పశుశరీరాన్ని ఇవ్వాలో నిర్ణయిస్తాడు మన కర్మఫలదాత అయిన ఈశ్వరుడు. కొత్త జీవుణ్ణి సృష్టించాలంటే, అతనికి పాతకర్మలు లేనప్పుడు, దేని ఆధారంగా సృష్టిస్తాడు?

ఆయనకు తోచినట్టు సృష్టిస్తాడు అంటే భగవంతుడు పక్షపాతం చూపించినట్టు అవుతుంది. అందువల్ల మన ఈ శరీరం భగవంతుడు తనకు తోచినట్టుగా ఎక్కడో దూరంగా కూర్చుని, ఇక్కడకు పడేస్తే వచ్చినది కాదు. ఈ శరీరం మనం చేసుకున్న పూర్వజన్మ కర్మఫలాల వల్ల వస్తుంది.

మనం చేసుకున్న కర్మఫలాలవల్ల ఈ శరీరం వస్తే, మొదటి సృష్టి విషయం మాటేమిటి? మొదటి జన్మకి, పాతకర్మలు ఉండవు కదా అంటే శాస్త్రం ప్రకారం అసలు మొదటి సృష్టి అంటూ లేదు. సృష్టి ఒక వృత్తాకారంలో జరుగుతుంది. అది ఒక సరళరేఖలో జరిగితే మొదటి స్థానం ఉంటుంది. వృత్తంలో ఎక్కడ మొదలుపెట్టామో చెప్పలేము. అందువల్ల జీవులు అనాది.

**అనాద్యవిద్యావాసనయా ప్రవర్తమానే, అస్మిన్ మహతి సంసారచక్రే విచిత్రాభిః కర్మగతిభిః విచిత్రాసు యోనిషు పునః పునరనేకధా జనిత్వా కేనాపి పుణ్యకర్మవిశేషేణ ఇదానేన్తన మానుష్యే ద్విజజన్మ విశేషం ప్రాప్తవతః మమ ...**

జీవులు అనాది; కొత్త జీవులు పుట్టలేదు. అవే జీవులు వ్యక్తంలోకి, అవ్యక్తంలోకి మారుతూ ఉంటాయి. అందువల్ల సః ఏవ అన్నాడు కృష్ణపరమాత్మ. అవే భూత్వా భూత్వా ప్రలీయతే – మళ్ళీ మళ్ళీ ప్రళయంలోకి వెళ్ళిపోతాయి. ఎప్పుడు?

**రాత్ర్యాగమేఽ వశః** – రాత్రి ప్రారంభకాలంలో లీనమవుతాయి. ఎలా? అవశః – నిస్సహాయంగా.

**పార్థ ప్రభవతి అహరాగమే** – ఓ అర్జునా, మళ్ళీ పగలు పుడతాయి.

ఏదైనా ఎగ్జిబిషన్‌లో మనంతట మనం ఉత్సాహంగా మెర్రిగో రౌండు ఎక్కుతాము, అందులో కేరింతలు కొడతాము. కొంతసేపయ్యాక, దాన్ని తిప్పే అతను అక్కడ లేడు, ఎక్కడికో వెళ్ళిపోయాడు, మనం అలా తిరుగుతూనే ఉండాలి అని తెలిస్తే మన పరిస్థితి ఏమిటి? మెర్రీగో రౌండు కాస్తా సారీగో రౌండు అవుతుంది. అలాగే మనం చేసుకున్న పుణ్యపాపకర్మల ఫలితంగా మనం పునరపి జననం, పునరపి మరణం అనే ఈ సంసారచక్రంలో పడి తిరుగుతూ ఉండాల్సిందే. పరిమిత ఫలితాలకోసం ఆశించినంతకాలం ఈ వృత్తంలో పడి తిరగక తప్పదు.

శ్లో. 20 **పరస్తస్మాత్తు భావోఽ న్యోఽ వ్యక్తోఽ వ్యక్తాత్ సనాతనః।**
**యః స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి ॥**

పరః, తస్మాత్, తు, భావః, అన్యః, అవ్యక్తః, అవ్యక్తాత్, సనాతనః,
యః, సః, సర్వేషు, భూతేషు, నశ్యత్సు, న, వినశ్యతి ॥

| | | | |
|---|---|---|---|
| తు | = అయితే | అవ్యక్తః | = అవ్యక్తమైన |
| తస్మాత్ | = ఆ | భావః | = భావము గలదో |
| అవ్యక్తాత్ | = అవ్యక్తముకంటె | సః | = ఆ పరమదివ్యపురుషుడు |
| పరః | = అత్యంత పరమైనది | సర్వేషు | = సమస్తమైన |
| అన్యః | = విలక్షణమైన ఇంకొకటి | భూతేషు | = భూతములు |
| యః | = ఏ | నశ్యత్సు | = నశించిపోవుచున్నను |
| సనాతనః | = సనాతనమైన | న, వినశ్యతి | = నశించిపోదు |

**యః తు సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి, సః, తస్మాత్**
**అవ్యక్తాత్ అన్యః, అవ్యక్తః సనాతనః పరః భావః (అస్తి) ॥**

తా: అయితే ఆ అవ్యక్తము కంటె అత్యంత పరమైనది, విలక్షణమైన ఇంకొకటి ఏ సనాతనమైన, అవ్యక్తమైన భావము గలదో ఆ పరమదివ్యపురుషుడు సమస్తమైన భూతములు నశించిపోవుచున్నను నశించిపోదు.

ఇంతవరకూ పరిమిత ఫలితాల గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ. పదార్థంలో కాలతత్త్వం ఉంటుందని చూశాము. అవ్యక్తంనుంచి వ్యక్తానికీ, వ్యక్తంనుంచి అవ్యక్తానికీ పదార్థం మారుతూ ఉంటుందని చూశాము. వీటిని ఇంకో పదజాలంతో చూస్తే అవ్యక్తాన్ని కారణప్రపంచం అనీ, వ్యక్తాన్ని కార్యప్రపంచం అనీ అంటారు. కార్యప్రపంచాన్ని మాయ అని కూడా అంటారు. మాయ ఒక కాలంలో వచ్చి, ఇంకొక కాలంలో వెళ్ళిపోతుంది.

ఇప్పుడు కృష్ణపరమాత్మ ఈ కారణప్రపంచం, కార్యప్రపంచాలకు భిన్నంగా ఉన్న మూడవ అంశాన్ని ప్రవేశపెట్ట బోతున్నాడు. దాన్ని – కార్యకారణ విలక్షణచైతన్యం అంటారు. ఈ చైతన్యం అవ్యక్తాన్నీ చూస్తుంది; వ్యక్తాన్నీ చూస్తుంది. పదార్థం అవ్యక్తంనుంచి వ్యక్తానికీ, వ్యక్తంనుంచి అవ్యక్తానికీ మారుతుంది కాని, చైతన్యం ఈ రెండింటికీ భిన్నంగా ఉండి, వీటిని చూస్తుంది. ఎందుకంటే చూసే వ్యక్తి చూడబడే వస్తువుకు భిన్నంగా ఉంటాడు.

ఇది అర్థం కావాలంటే, మన అవస్థాత్రయం గురించి చూడాలి. సాక్షిచైతన్యాన్ని అవస్థాత్రయసాక్షి అంటాము.

**జాగ్రదావస్థ – బాహ్యప్రపంచం, దేశం, కాలాలను అనుభవిస్తాము**
**స్వప్నావస్థ – స్వప్నప్రపంచం, స్వప్న దేశ కాలాలను అనుభవిస్తాము**
**సుషుప్తి అవస్థ – ప్రపంచం, దేశం, కాలం, అన్నీ లయమయిపోతాయి**

ఈ మూడు అవస్థలనూ సాక్షిగా చూస్తున్నది ఒకటుంది. అదే సాక్షిచైతన్యం. ఆ సాక్షిచైతన్యాన్ని నేనే. జాగ్రదావస్థలో మనస్సు వ్యవహారాలు నడుపుతున్నదని తెలుస్తున్నది. మనస్సు స్వప్నావస్థలో కలలు కంటున్నదని తెలుస్తున్నది. సుషుప్తిలో మనస్సు నిద్రపోయిందనీ తెలుస్తున్నది. నేను బాగా నిద్రపోయానని నాకు తెలుస్తున్నది.

**నేను అవస్థాత్రయ సాక్షిచైతన్యాన్ని.**

దేశకాలపరిమితులు శరీరానికి, మనస్సుకు ఉన్నాయి కాని సాక్షిచైతన్యమైన నాకు దేశకాలపరిమితులు లేవు. నేను దేశకాలాతీతుణ్ణి. ఈ సాక్షిచైతన్యమే భగవంతుడు.

**సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ.**

ఈ బ్రహ్మను ఏడవ అధ్యాయంలో పరాప్రకృతిగా అభివర్ణించాడు కృష్ణపరమాత్మ. మరయితే మనం భగవంతునికి ఆపాదించే అనేక గుణాల మాటేమిటి? స్థూలబుద్ధి ఉన్న మనస్సు మొదట్లోనే నిర్వికారచైతన్యాన్ని తెలుసుకోలేదు కాబట్టి, శాస్త్రం ఒక సగుణాకారాన్ని ఇచ్చింది.

**నిర్విశేషం పరం బ్రహ్మ సాక్షాత్ కర్తుమ్ అనీశ్వరః**
**ఏ మంథతే అనుకంపయంతే సవిశేష నిరూపణైః**

మానవబుద్ధి దేశ, కాలాలకు అతీతంగా ఉన్నదానిని అర్థం చేసుకోలేదు కాబట్టి బుద్ధి సూక్ష్మంగా అయ్యేంత వరకూ, భగవంతునికి నామరూపాలు ఇవ్వాలి. అందువల్ల కృష్ణునిగా, రామునిగా కొలిచినా కూడా చివరికి భగవంతుడు ఎవరూ అంటే **శుద్ధచైతన్యస్వరూపం** అని చెప్పగలగాలి. ఆ శుద్ధచైతన్యస్వరూపంతో ఐక్యం అర్థం చేసుకోవాలి. అదే మన ఆధ్యాత్మిక విజయం. అందువల్ల ఈ శ్లోకం చాలా ముఖ్యమైన శ్లోకం.

**పరః తస్మాత్ అవ్యక్తాత్ అన్యః అవ్యక్తః** – అవ్యక్తం కంటే విలక్షణమైనది ఇంకొకటి ఉంది. మనం ఇప్పటి దాకా మూడు అంశాలను చూశాము. అవ్యక్తవస్తువు, వ్యక్తవస్తువు, ఈ రెండింటికీ విలక్షణమైన చైతన్యం లేదా బ్రహ్మ లేదా పరమాత్మ. అందువల్ల అన్యః అవ్యక్తః అంటే అవ్యక్తానికి భిన్నంగా ఉన్న చైతన్యతత్త్వం. దాని స్వరూపం ఏమిటి?

**సనాతనః** – కాలాతీతమైనది. ఏ వస్తువును తీసుకున్నా దానికి కాలపరిమితి ఉంది. ఒక్క చైతన్యం మాత్రమే కాలాతీతమైనది. అన్ని వస్తువులనూ కాలం కబళించివేస్తే, చైతన్యం మాత్రం కాలంయొక్క రాకపోకలను సాక్షీభూతంగా చూస్తుంది. సుషుప్తిలో కూడా అనాత్మ గాఢనిద్రలోకి వెళ్ళటం సాక్షిచైతన్యం చూస్తుంది కాని అది నిద్రపోదు. సాక్షి కూడా నిద్రపోతే, నేను గాఢంగా నిద్రపోయాను అని చెప్పగలిగేది ఎవరు? అందువల్ల సనాతనః అంటే కాలాతీతం. ఎక్కడుంది అటువంటి చైతన్యం?

**యః స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి** – అన్ని జీవులూ నశించినా కూడా చైతన్యం నశించదు. నశించటం అంటే అవ్యక్తంలోకి వెళ్ళటం. చైతన్యం ఎక్కడుంది అంటే చైతన్యం ఆకాశంలో (స్పేస్)లో లేదు. నిజానికి ఆకాశమే చైతన్యంలో ఉంది.

ఉపనిషత్తులో దీన్ని మూడు దశల్లో చూస్తాము. దీనికి ఆకాశం ఉదాహరణ చూస్తాము. మూడు దశలు ఇవి –

1. **ఈ గదిలో ఆకాశం ఉంది**
2. **ఆకాశం ఈ గదిలోనే కాదు, గది బయట కూడా ఉంది**
3. **నిజానికి ఆకాశంలోనే అన్ని గదులూ ఉన్నాయి**

ఆకాశం అంటే స్పేస్ అని చూశాము. ముందు ఆకాశాన్ని అర్థం చేసుకోవటానికి ఈ గదిలో ఆకాశం ఉంది అంటాము. తర్వాత ఈ గదిలో స్థలం చాలకపోతే, బయట కూడా ఖాళీ ప్రదేశం ఉంది, అక్కడ కూర్చోండి అంటాము. తర్వాత ఎవరో చెపుతారు, అసలు ఇదంతా ఒకప్పుడు ఖాళీ ప్రదేశం, ఇప్పుడు ఈ ఖాళీ ప్రదేశంలో ఇన్ని ఆకాశసౌధాలు వచ్చాయని. ఇదే సూత్రాన్ని ఇప్పుడు చైతన్యానికి అన్వయించి చూద్దాం.

1. **నాలో చైతన్యం ఉంది**
2. **నాలోనే కాదు బయట కూడా చైతన్యం ఉంది**
3. **నిజానికి చైతన్యంలోనే అన్ని జీవరాశులూ ఉన్నాయి**

ఈ జీవరాశులతో పాటు కాలం, దేశం కూడా వస్తాయి. అందువల్ల చైతన్యంలోనే ఆకాశం ఉంది. అన్నీ ఆకాశంలో ఉన్నాయి అంటే ఇప్పుడు ఆకాశం కూడా చైతన్యంలోనే ఉంది అంటే ఏమిటి అర్థం? అంటే చైతన్యానికి దేశపరిమితి లేదు. అది సర్వవ్యాపకం. అందువల్ల దేవుడు ఎక్కడున్నాడు అంటే జవాబు చెప్పలేము.

దేవుడెలా పనిచేస్తాడు అన్నా కూడా జవాబు చెప్పలేము. ఎలా పనిచేస్తాడు అంటే కార్యకారణ సంబంధం తీసుకురావాలి. కార్యకారణాలకు కాలం, దేశం వస్తాయి. కాని చైతన్యం – కార్యకారణవిలక్షణం. అందువల్ల భగవంతుని విషయంలో ఎప్పుడు, ఎక్కడ, ఎలా, ఎందుకులాంటి విషయాలు అడగలేము. ఎందుకంటే వీటన్నిటికీ దేశకాలవివరణ కావాలి. భగవంతుడు దేశకాలాలకు అతీతుడు.

ఈ విషయాన్ని ఇంతకన్నా వివరంగా ఇక్కడ కృష్ణపరమాత్మ చెప్పడు. అది ఉపనిషత్తుల్లో ముఖ్యాంశం. కాని ఇది ఉపనిషత్తుల సారం మాత్రమే. అందుకని విషయం మరీ లోతుగా ఉండదు.

**అన్యత్ర ధర్మాత్ అన్యత్ర అధర్మాత్**
**అన్యత్ర అస్మాత్ కృత అకృతాత్** – కఠ 1.2.14

భగవంతుడు ధర్మ, అధర్మాలకు అతీతుడు; కర్మ–అకర్మలకు అతీతుడు. అటువంటి భగవంతుని దగ్గరకు వెళ్ళాలి. మళ్ళీ **వెళ్ళాలి** అన్నా సమస్యే. ఎందుకంటే అది క్రియాపదం, మళ్ళీ దేశకాలాలు అందులో వస్తాయి. భగవంతుని దగ్గరకు ప్రయాణం చేసి వెళ్ళాలనే అర్థం వస్తుంది. నిజానికి వేదాంతంలో ఏ క్రియాపదం వాడినా తప్పే అవుతుంది. క్రియాపదం కాలాన్ని సూచిస్తుంది. భగవంతుడు దేశ, కాలాలకు అతీతుడు. అది అర్థం చేసుకోవాలి.

శ్లో. 21 **అవ్యక్తోఽక్షర ఇత్యుక్తః తమాహుః పరమాం గతిమ్ ।**
**యం ప్రాప్య న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥**
అవ్యక్తః, అక్షరః, ఇతి, ఉక్తః, తమ్, ఆహుః, పరమామ్, గతిమ్,
యమ్, ప్రాప్య, న, నివర్తంతే, తత్, ధామ, పరమమ్, మమ ॥

| | | | |
|---|---|---|---|
| అవ్యక్తః | = ఈ అవ్యక్తమే | ఆహుః | = వ్యవహరింతురు |
| అక్షరః, ఇతి | = అక్షరమని | యమ్ | = ఏ పరమగతిని |
| ఉక్తః | = చెప్పబడును | ప్రాప్య | = పొంది |
| తమ్ | = 'అక్షరము' అని వ్యవహరింపబడు ఆ అవ్యక్త భావమునే | న, నివర్తంతే | = తిరిగిరారో |
| | | తత్ | = అది |
| | | మమ | = నాయొక్క |
| పరమామ్, గతిమ్ | = పరమగతి అనియు | పరమమ్, ధామ | = పరంధామము |

**(యః) అవ్యక్తః (భావః) అక్షరః ఇతి ఉక్తః, తమ్ పరమామ్ గతిమ్ ఆహుః,**
**(జ్ఞానినః) యమ్ ప్రాప్య న నివర్తన్తే, తత్ మమ పరమమ్ ధామ (అస్తి) ॥**

తా: ఈ అవ్యక్తమే అక్షరమని చెప్పబడును. 'అక్షరము' అని వ్యవహరింపబడు ఆ అవ్యక్త భావమునే పరమగతి అనియు వ్యవహరింతురు. ఏ పరమగతిని పొంది తిరిగిరారో అది నాయొక్క పరంధామము.

కృష్ణపరమాత్మ చైతన్యం గురించి ఇంకా కొన్ని వివరాలు చెపుతున్నాడు. చైతన్యం అంటే అవ్యయం, వ్యయాలకు భిన్నంగా ఉన్నదని చూశాము. అందుకని ఈ చైతన్యాన్ని అవ్యక్తం-2 అని కూడా గుర్తుంచుకోవాలి.

**అవ్యక్తః అక్షర ఇతి ఉక్తః** – ఈ అవ్యక్తం-2ను అక్షరం అంటారు. ఇంతకు ముందు కూడా చూశాము పరాప్రకృతిని ముండకోపనిషత్తులో అక్షరబ్రహ్మ అంటారని.

**అథ పరా యయా తత్ అక్షరం అధిగమ్యతే** – ముండకం

అక్షరం పదాన్ని అక్షరాలా తీసుకుంటే నాశనము లేనిది. నాశనము లేనిదంటే కాలంలో శాశ్వతంగా ఉంటుందని కాదు అర్థం. నాశనం లేనిది అంటే కాలాతీతమైనది అని అర్థం. ఇటువంటి చైతన్య స్వరూపమేమిటి?

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**
**అచక్షుః శ్రోత్రం తదపాణి పాదమ్ ।**
**నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం**
**తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యన్తిధీరాః ॥** – ముండకం 1.1.6

అంటే ఈ అక్షరబ్రహ్మను ఇంద్రియాలతో పట్టుకోలేము; దానికి కూడా ఇంద్రియాలు లేవు.

**తం పరమాం గతిమ్ ఆహుః** – అటువంటి బ్రహ్మను పొందటమే పరమగతి అంటారు. అప్పుడే దేశకాలాతీతంగా

ఎదుగుతారు. ఏ లోకానికి వెళ్ళినా అంటే వైకుంఠానికి వెళ్ళినా, కైలాసానికి వెళ్ళినా, బ్రహ్మలోకానికి వెళ్ళినా వాటికి దేశకాలపరిమితులు ఉన్నాయి. అందువల్ల ఏదైనా లోకానికి వెళ్ళటం మోక్షం కాదు. అయితే మోక్షం అంటే ఏమిటి? బ్రహ్మ దగ్గరకు **వెళ్ళటం**. వెళ్ళటం అంటే అక్షరాలా వెళ్ళటం కాదు. బ్రహ్మను పొందటం. బ్రహ్మను పొందితే ఏమవుతుంది?

**యం ప్రాప్య న నివర్తంతే** – ఆ పరంధామాన్ని **చేరినవారు** తిరిగిరారు. మళ్ళీ చేరినవారు అంటే అక్షరాలా చేరినవారు కాదు, చేరటంలో ప్రయాణం ఉండకూడదు. ప్రయాణం ఉందంటేనే కాలం, దేశం పరిధిలోకి వచ్చినట్టు అయిపోతుంది. బ్రహ్మను చేరాలి, కాని ప్రయాణం చెయ్యకూడదు. ఎలా? అది ఒక్క మార్గంలోనే సాధ్యం. బ్రహ్మ నాకు ఎక్కడో భిన్నంగా లేదు, బ్రహ్మ అంటే సాక్షిచైతన్యం, ఆ సాక్షిచైతన్యాన్ని నేనే అని జ్ఞానపరంగా బుద్ధిలో తెలుసుకోవాలి.

**జ్ఞానేనైవ బ్రహ్మప్రాప్తిః**

అంటే జ్ఞానంవల్ల నేను బ్రహ్మను చేరుతానా అని అడగకూడదు. జ్ఞానంవల్ల బ్రహ్మను చేరను, జ్ఞానంవల్ల బ్రహ్మ నాకు ఎక్కడో దూరంగా ఉన్నాడనే అపోహ తొలుగుతుంది. ఇవన్నీ వేదాంత సూత్రాల్లో ప్రాథమిక అంశాలు.

**తత్ మమ పరమం ధామ** – అది, అంటే చైతన్యతత్త్వమే నా ఉన్నతస్థాయి. ధామం అంటే అక్షరాలా తీసుకుంటే స్థానం. మళ్ళీ అది కాలం, దేశంలోకి వస్తుంది. అందువల్ల ఇక్కడ స్థానం అంటే స్వరూపం. రామ, కృష్ణ రూపాలు నా అపరాప్రకృతి రూపాలు, అవి దేశకాలపరిధిలోకి వస్తాయి; కాని చైతన్యం నా అపరాప్రకృతి అంటున్నాడు కృష్ణపరమాత్మ. చైతన్యం దేశకాలాలకు అతీతం. అందువల్ల అపరాప్రకృతితో మొదలుపెట్టాలి కాని, ఎప్పుడో ఒకప్పుడు పరాప్రకృతికి వచ్చితీరాలి.

శ్లో. 22 **పురుషః స పరః పార్థ భక్త్యా లభ్యస్త్వనన్యయా ।**
**యస్యాంతఃస్థాని భూతాని యేన సర్వమిదం తతమ్ ॥**
పురుషః, సః, పరః, పార్థ, భక్త్యా, లభ్యః, తు, అనన్యయా,
యస్య, అంతఃస్థాని, భూతాని, యేన, సర్వమ్, ఇదమ్, తతమ్ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ అర్జునా! | తతమ్ | = పరిపూర్ణమైయున్నదో |
| భూతాని | = సమస్త భూతములు | సః | = ఆ |
| యస్య, | = ఏ సచ్చిదానందపరమాత్మ యందు | పరః | = సర్వశ్రేష్ఠుడైన |
| అంతఃస్థాని | = అంతర్గతములై యున్నవో | పురుషః, తు | = పురుషోత్తముడు అయితే |
| యేన | = ఏ సచ్చిదానందపరమాత్మచేత | అనన్యయా, భక్త్యా | = అనన్యమైన భక్తితో మాత్రమే |
| ఇదమ్ | = ఈ | లభ్యః | = లభ్యుడు అగును |
| సర్వమ్ | = సమస్తమైన జగత్తు | | |

**హే పార్థ! భూతాని యస్య అన్తః-స్థాని (సన్తి), యేన ఇదమ్**
**సర్వమ్ తతమ్, సః తు పరః పురుషః అనన్యయా భక్త్యా లభ్యః (అస్తి) ॥**

తా: ఓ అర్జునా! సమస్త భూతములు ఏ సచ్చిదానందపరమాత్మయందు అంతర్గతములై యున్నవో ఏ సచ్చిదానందపరమాత్మచేత ఈ సమస్తమైన జగత్తు పరిపూర్ణమైయున్నదో ఆ సర్వశ్రేష్ఠుడైన పురుషోత్తముడు అయితే అనన్యమైన భక్తితో మాత్రమే లభ్యుడు అగును.

ఇందులో కూడా దేశకాలాలకు అతీతమైన పరాప్రకృతి గురించే చూస్తాము.

**పార్థ సః పరః పురుషః** – ఓ పార్థా, ఈ చైతన్యాన్ని పరమపురుషుడు అంటారు. చైతన్యం అంటే అవ్యక్తం-2 అని చూశాము. పురుష అంటే రెండు అర్థాలు చూశాము. సర్వవ్యాపకమైన చైతన్యం ఒక అర్థం.

**యస్య అంతఃస్థాని భూతాని** – సమస్తజీవులు ఆ బ్రహ్మలోనే అంతర్గతాలై ఉన్నాయి. మూడు దశల్లో నేర్చుకోవాలని చూశాము. బ్రహ్మ, చైతన్యం, ఆత్మ అన్నీ పర్యాయపదాలు.

1. **చైతన్యం నాలో ఉంది**
2. **నాలోనే కాదు, బయట కూడా ఉంది**
3. **నిజానికి చైతన్యం లోనే అన్నీ ఉన్నాయి**

ఇక్కడ ఈ వాక్యంలో ఈ మూడవదశ చూస్తున్నాము. చైతన్యంలోనే అన్ని జీవులూ ఉన్నాయి.

**విశ్వాధారం గగన సదృశం ...**

చైతన్యం విశ్వానికి ఆధారం, ఆకాశం లాంటిది. చైతన్యం గురించి మాట్లాడేటప్పుడు అక్కడితో ఆగాలి. మేఘవర్ణం పదానికి వెళ్ళకూడదు. అది అపరాప్రకృతి వర్ణన అయిపోతుంది. మన ప్రార్థనల గొప్పతనం అదే! ఏ సహస్రనామం తీసుకున్నా సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మల వర్ణన లేదా అపరాప్రకృతి, పరాప్రకృతుల వర్ణన కలగలిపి ఉంటాయి.

**యేన సర్వమిదం తతమ్** – ఈ చైతన్యం వల్లనే ఈ జగత్తంతా వ్యాప్తమై ఉంది. జగత్తులో దేని ఉనికి గురించి మాట్లాడాలన్నా కూడా చైతన్యం కావాలి. చైతన్యం అంటే జ్ఞానం అర్థం వస్తుంది. ఆత్మనిర్వచనం – సత్, చిత్, ఆనందం. సత్ అంటే ఉనికి, చిత్ అంటే ఎరుక. సత్, చిత్‌లు రెండూ ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి. ఒక వస్తువుయొక్క ఉనికి గురించి మనం మాట్లాడాలంటే, దాని గురించిన ఎరుక ఉండాలి. అలాగే ఒక వస్తువు గురించిన ఎరుక ఉండాలంటే, దానికి ఉనికి ఉండితీరాలి. అందువల్ల యేన అంటే ఈ చైతన్యం. ఈ చైతన్యమే జగత్తు అంతా ఉంది. దాన్నే బ్రహ్మ అంటారు.

కాని ఈ పరాప్రకృతికి రావాలంటే చాలా సూక్ష్మమైన బుద్ధి ఉండాలి. భాగవతం దశమస్కందం ఆకర్షించినంతగా ఈ పరాప్రకృతివర్ణన ఆకర్షించదు. భాగవతం దశమస్కందంలో భగవంతుని రాసలీలలు, రాక్షససంహారాలు చూస్తాము. దానితో పోలిస్తే, ఇది తలపైన ఎన్నో అడుగుల ఎత్తు నుంచి వెళ్ళిపోయినట్టు అనిపిస్తుంది. ఒకవేళ

ఎవరైనా అలా అనుకునేటట్టయితే, నిరాశ పడవద్దు. ఇది కూడా మీకు బాగా అర్థమవుతుంది. కాకపోతే దాని మీద తపన ఉండాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అనన్యయా భక్త్యా లభ్యః** – అనన్యభక్తి చూపిస్తే లభ్యమవుతాడు అంటున్నాడు. పరాప్రకృతి తప్ప తక్కినదంతా కాలపు కోరల్లో చిక్కుకుని నాశనమవుతాయని అర్థం చేసుకుని, పరాప్రకృతి వైపు మొగ్గు చూపిస్తే మీరు నిష్కామభక్తులు లేదా ముముక్షువులు అవుతారు. ఈ తీవ్రమైన తపనతో సగుణభక్తిని కొనసాగించండి, వీలున్నంత తొందరలో మీరు నిర్గుణభక్తికి ఎదిగే అర్హత పొందుతారు.

అనన్యయా భక్త్యా లభ్యః అంటే నిష్కామభక్తివల్ల ఆ నిర్గుణబ్రహ్మను పొందుతాడు. నిర్గుణబ్రహ్మను పొందుతాడు అంటే పరంపరయా మోక్షం అని కలుపుకోవాలి. చాలాసార్లు చూశాము, ఉపాసకుడు జీవన్ముక్తిని పొందడు. జీవన్ముక్తిని సాక్షాత్ మోక్షం అంటాము. ఉపాసకుడు బ్రహ్మలోకానికి వెళ్ళి, బ్రహ్మ దగ్గర జ్ఞానం పొంది, అక్కడ మోక్షం పొందుతాడు. దాన్ని క్రమముక్తి అంటారు. దాన్ని పరంపరయా మోక్షం అంటారు.

ఇప్పటి వరకూ అంటే 15–22 శ్లోకాల వరకూ కృష్ణపరమాత్మ రెండు రకాల మానవ లక్ష్యాలను పోల్చి చెప్పాడు. ఒకటి కర్మవల్ల పొందే ఫలం; రెండవది నిష్కామ ఉపాసనవల్ల పొందే ఫలం. కర్మ అంటే అనేక లౌకిక, వైదికకర్మలు; అనేక స్మార్త, శ్రౌతకర్మలు. కృష్ణపరమాత్మ కర్మఫలం అశాశ్వతమనీ, నిష్కామ ఉపాసన ఫలం శాశ్వతమనీ చూపించాడు.

ఇక్కడ ఒక విషయం మర్చిపోకూడదు మనం. ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మ జ్ఞానమార్గం జోలికి పోవటం లేదు. జ్ఞానాన్ని, వేరే ఏ మార్గంతోనూ పోల్చటం లేదు. ఇక్కడ చర్చనీయాంశం కర్మ గొప్పదా, ఉపాసన గొప్పదా? ఒకవేళ మీరు కర్మ గాని, ఉపాసన గాని ఎన్నుకోవాల్సివస్తే ఉపాసనను ఎన్నుకోమన్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు? ఉపాసనఫలం శాశ్వతఫలాన్ని ఇస్తుంది. నిష్కామ ఉపాసన క్రమముక్తిని ఇస్తుందని చూశాము. కాని కర్మ చేసిన వ్యక్తి లోకాలకు వెళ్ళి, పుణ్యం తీరగానే వెనక్కి తిరిగివస్తాడు. అందువల్ల కర్మకన్నా, ఉపాసన గొప్పది.

కర్మ, ఉపాసనలను పోల్చటంద్వారా, మనిషికి ఉన్న నాలుగు లక్ష్యాలను రెండుగా కుదించాడు కృష్ణపరమాత్మ. నాలుగు లక్ష్యాలు – ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. మనిషికి ఉన్న అనేక లక్ష్యాలనే నాలుగు పురుషార్థాలుగా నిర్ణయించింది శాస్త్రం. వాటిని ఇంకా రెండుకు తగ్గించాడు కృష్ణపరమాత్మ. అవి శాశ్వత ఫలితాలను ఇచ్చే లక్ష్యం, అశాశ్వత ఫలితాలను ఇచ్చే లక్ష్యం. ఈ రెండూకాక మూడవ లక్ష్యం ఊహించలేము. ఎందుకు? ఏ లక్ష్యమైనా ఈ రెండింటిలో ఏదో ఒక ఫలాన్ని ఇస్తుంది. అయితే శాశ్వతఫలాన్ని ఇస్తుంది, లేదా అశాశ్వత ఫలాన్ని ఇస్తుంది.

ధర్మ, అర్థ, కామ, మోక్షాలలో ధర్మ, అర్థ, కామాలు అశాశ్వతమైన ఫలాన్ని ఇస్తాయి. ధర్మం అంటే పుణ్యం; పుణ్యం అశాశ్వతమైన కర్మవల్ల కలుగుతుంది కాబట్టి అది కూడా అశాశ్వతమే. అర్థ అంటే ధనం. అది కూడా అశాశ్వతమైన కర్మవల్ల వచ్చింది కాబట్టి, అది కూడా అశాశ్వతం. కామం అంటే ఆనందాన్ని ఇచ్చేవి. స్వర్గలోకాలు ఆనందాన్ని ఇచ్చేవే అయినా అవి కూడా అశాశ్వతమైనవే. అదికాక కర్మవల్ల స్వర్గలోకాలకు వెళ్ళిన వ్యక్తి కూడా అక్కడ శాశ్వతంగా ఉండిపోలేదు.

**క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి** – 9.21

అక్కడ అంటే స్వర్గలోకాల్లో ఉండే కాలం చాలా ఎక్కువకాలం ఉండవచ్చు కాని, అది శాశ్వతం మాత్రం కాదు. భగవంతుడు అది కూడా పరాప్రకృతి మాత్రమే శాశ్వతం. తక్కినవన్నీ అశాశ్వతం. దానికి ఇక్కడ కృష్ణపరమాత్మ భగవంతుడు, జగత్తు పదాలను వాడాడు. భగవంతుడు ఒక్కడే శాశ్వతం. ఆయనను పట్టుకున్న వ్యక్తి క్రమముక్తి పొందుతాడు. **యం ప్రాప్య న నివర్తంతే** అని చెప్పాడు.

### 4. రెండు రకాల మార్గాలు, రెండు రకాల సాధకులు – శ్లోకాలు 23–27

రెండు రకాల లక్ష్యాలను గురించి చెప్పాక, ఇప్పుడు కృష్ణపరమాత్మ రెండు రకాల మార్గాల గురించి, రెండు రకాల సాధకుల గురించి చెప్పబోతున్నాడు.

**యది సాధ్యద్వయం వర్తతే తర్హి మార్గద్వయమ్ అపి స్యాత్**

ఎక్కడ రెండు లక్ష్యాలు ఉంటే, అక్కడ వాటికి చేరుకునే మార్గాలు కూడా రెండు ఉంటాయి. ఎక్కడ రెండు మార్గాలు ఉంటే, రెండు మార్గాల్లో వెళ్ళే రెండు రకాల సాధకులు ఉంటారు. ఇంతకు ముందు రెండు రకాల సాధ్యాలు అంటే లక్ష్యాలు చూశాము. ఇప్పుడు రెండు రకాల మార్గాలను, రెండు రకాల సాధకులను చూస్తాము.

శ్లో. 23 **యత్ర కాలే త్వనావృత్తిమ్ ఆవృత్తిం చైవ యోగినః ।**
**ప్రయాతా యాంతి తం కాలం వక్ష్యామి భరతర్షభ ॥**
యత్ర, కాలే, తు, అనావృత్తిమ్, ఆవృత్తిమ్, చ, ఏవ, యోగినః,
ప్రయాతాః, యాంతి, తమ్, కాలమ్, వక్ష్యామి, భరతర్షభ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| భరతర్షభ! | = | ఓ అర్జునా! | చ | = | ఇంకా |
| యత్ర, కాలే | = | ఏ మార్గమునందు | ఆవృత్తిమ్, ఏవ | = | తిరిగివచ్చు గతినే |
| ప్రయాతాః | = | శరీరత్యాగము చేసి, వెళ్ళిపోవునట్టి | యాంతి | = | పొందుదురో |
| యోగినః | = | యోగులు | తమ్, కాలమ్ | = | ఆ కాలమును అంటే రెండు మార్గములను గూర్చి |
| తు | = | అయితే | | | |
| అనావృత్తిమ్ | = | తిరిగిరాని గతిని (చేరుదురో) | వక్ష్యామి | = | చెప్పెదను |

**హే భరతర్షభ! యత్ర కాలే తు ప్రయాతాః యోగినః అనావృత్తిమ్**
**ఆవృత్తిమ్ చ ఏవ యాన్తి, తమ్ కాలమ్ వక్ష్యామి ॥**

తా: ఓ అర్జునా! ఏ మార్గమునందు శరీరత్యాగము చేసి, వెళ్ళిపోవునట్టి యోగులు అయితే తిరిగిరాని గతిని (చేరుదురో) ఇంకా తిరిగివచ్చు గతినే పొందుదురో ఆ కాలమును అంటే రెండు మార్గములను గూర్చి చెప్పెదను.

ముందు రెండు రకాల మార్గాలను చూడబోతున్నాము.

**యత్ర కాలే యోగినః ప్రయాతాః యాంతి** – ప్రయాతా అంటే రెండు మార్గాలలో వెళ్ళే; యోగినః అంటే ప్రయాణీకులు. ఇక్కడ కాలే అంటే కాలం కాదు, కాలే అంటే మార్గం. రెండు మార్గాల్లో వెళ్ళే ప్రయాణీకులు రెండు రకాల గమ్యాలు చేరుకుంటారు. ఏమిటవి?

**అనావృత్తిమ్ ఆవృత్తిమ్ చ ఏవ** – అనావృత్తిమ్ అంటే తిరిగిరాని గతి; ఆవృత్తిమ్ అంటే తిరిగివచ్చు గతి. తిరిగిరాని గతి అంటే మోక్షప్రాప్తి గతి. అంటే క్రమముక్తిని ఇచ్చే లోకానికి వెళతారు. దీన్ని నిత్యప్రాప్తి అంటారు. ఆవృత్తిమ్ అంటే తిరుగు ప్రయాణం చేస్తారు. అమెరికాకు టూరిస్టుగా వెళ్ళాలంటే తిరుగు ప్రయాణం ఎప్పుడో చెప్పకపోతే మనకు వీసా కూడా ఇవ్వరు. అలా స్వర్గలోకాలకు తిరుగుప్రయాణం టికెట్టుతో వెళ్ళేవారు కొందరు. కాకపోతే వారి తిరుగుప్రయాణం వారి చేతిలో లేదు, ఎప్పుడో వారికి తెలియదు. దీన్ని లోకప్రాప్తి అంటారు.

**తం కాలమ్ (అహం) వక్ష్యామి** – ఇలా నిత్యప్రాప్తి, అనిత్యప్రాప్తి ఇచ్చే రెండు రకాల మార్గాల గురించి నేను చెప్తాను. ఇక్కడ కూడా కాలం అంటే మార్గం.

ఆ రెండు మార్గాలను శుక్లమార్గం, కృష్ణమార్గం అంటారు. శుక్లమార్గం క్రమముక్తిని ఇస్తుంది కాబట్టి ప్రకాశవంతమైన మార్గం; కృష్ణమార్గం పుణ్యలోకాలకు తీసుకువెళ్ళినా, మళ్ళీ వెనక్కి పంపిస్తుంది కాబట్టి అది చీకటి మార్గం అయింది. కృష్ణమార్గాన్నే పితృయానం అని కూడా అంటారు. వీటిని వివరించబోతున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 24 **అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్ ।**
**తత్ర ప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ॥**
అగ్నిః, జ్యోతిః, అహః, శుక్లః, షణ్మాసాః, ఉత్తరాయణమ్,
తత్ర ప్రయాతాః, గచ్ఛంతి, బ్రహ్మ, బ్రహ్మవిదః, జనాః ॥

| | | | |
|---|---|---|---|
| జ్యోతిః | = జ్యోతిర్మయమగు మార్గమునకు | షణ్మాసాః | = ఆరుమాసములు గల |
| అగ్నిః | = అగ్ని అభిమానదేవత | ఉత్తరాయణమ్ | = ఉత్తరాయణము (దేవత) |
| బ్రహ్మవిదః | = సగుణబ్రహ్మ | తత్ర | = ఆ మార్గముద్వారా |
| జనాః | = ఉపాసకులు | బ్రహ్మ | = బ్రహ్మపదప్రాప్తిని |
| ప్రయాతాః | = మృతి చెందినవారై | గచ్ఛంతి | = పొందుచున్నారు |
| అహః | = పగలు (దేవత) | | |
| శుక్లః | = 'శుక్లపక్ష'ము (దేవత) | | |

**అగ్నిః, జ్యోతిః, అహః, శుక్లః (పక్షః), షణ్మాసాః ఉత్తర-ఆయనమ్,**

**తత్ర (కాలే) ప్రయాతాః బ్రహ్మవిదః జనాః బ్రహ్మ గచ్ఛన్తి ॥**

తా: సగుణబ్రహ్మ ఉపాసకులు జ్యోతిర్మయమార్గముద్వారా బ్రహ్మపదప్రాప్తిని పొందుచున్నారు. ఈ జ్యోతిర్మయ మార్గమునకు అధిదేవత అగ్ని. మృతి చెందినవారైన యోగులను క్రమముగా దిన(పగలు) శుక్లపక్ష ఉత్తరాయణ-అభిమానదేవతలు కొనిపోయి, పరమపదమును చేర్చుదురు.

ఇందులో కృష్ణపరమాత్మ శుక్లమార్గాన్ని వివరించబోతున్నాడు. దీన్ని శుక్లగతి అనీ, దేవయానం అనీ అంటారు.

**తత్ర** – తత్ర అంటే దేవయానమార్గంలో; **ప్రయాతా** – వెళ్ళేవారు;

**బ్రహ్మ గచ్ఛంతి** – బ్రహ్మను పొందుతారు. బ్రహ్మను పొందుతారు అంటే క్రమముక్తి పొందుతారని అర్థం చేసుకోవాలి. దీన్ని పరంపరయా మోక్షం అంటారని చూశాము. ఇక్కడ వేదాంతం నేర్చుకుని, **అహం బ్రహ్మ అస్మి** అనే జ్ఞానం పొందితే జీవన్ముక్తి పొందుతారు. అంటే బ్రతికి ఉండగానే మోక్షం పొందుతారు. ఇక్కడ వేదాంతానికి రాకుండా, నిష్కామ ఉపాసన చేసి బ్రహ్మలోకం చేరుకుంటే, అక్కడ బ్రహ్మదేవుడు వేదాంత జ్ఞానబోధ చేస్తాడు. దయానందస్వామీజీ హాస్యంగా చెపుతారని చూశాము – 'అరె, అక్కడ హృషీకేశ్‌లో దయానందస్వామి ఆత్మ, అనాత్మ, బ్రహ్మ మొదలైన విషయాలు చెపుతుంటే వినకుండా తప్పించుకుని తిరిగాను, ఇక్కడ కూడా తప్పలేదా అనుకుంటాడుట.' అలా శుక్లగతిద్వారా వెళ్ళిన సాధకులు బ్రహ్మను పొందుతారు.

శుక్లగతి ఎలా ఉంటుంది? పది ముఖ్య ఉపనిషత్తుల్లోనూ శుక్లగతి, కృష్ణగతిల గురించిన వివరణ వస్తుంది. బ్రహ్మసూత్రాల్లో అయితే వీటి గురించి ఇంకా వివరంగా చర్చ వస్తుంది. ఈ మార్గాల్లో వెళ్ళే సాధకులను దగ్గరుండి కొందరు దేవతలు తీసుకువెళతారు. ఎందుకంటే ఆ సాధకులకు వారు ఎక్కడికి చేరుకుంటారో తెలియదు. ఈ దేవతలు కూడా రిలే రేసులాగా తీసుకు వెళతారు. అంటే ఒక దేవత కొంతదూరం తీసుకువెళ్ళి, ఇంకొక దేవతకు అప్పచెపుతుంది. ఆ దేవత ఇంకొక దేవతకు అప్పచెపుతుంది. అలా అంతిమ గమ్యం చేరేదాకా, మార్గంలో కొందరు దేవతలుంటారు. ఆ అంతిమ గమ్యం చేరేలోపు వచ్చే దశల సంఖ్య మారుతుంది ఉపనిషత్తులలో. ఎందుకంటే ఉపనిషత్తు లక్ష్యం జ్ఞానం ఇవ్వటం కాని, ఈ గతుల గురించి చెప్పటం కాదు. ఇక్కడ కృష్ణపరమాత్మ ఐదు దేవతల గురించి ప్రస్తావిస్తున్నాడు. వారు –

**అగ్నిః జ్యోతిః అహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్** – అగ్నిః అంటే అగ్నిదేవత; జ్యోతిః అంటే జ్యోతిర్దేవత; అహః – పగటి దేవత; శుక్లః – శుక్లపక్ష దేవత; షణ్మాసా ఉత్తరాయణమ్ – ఉత్తరాయణ దేవత. ఇక్కడ అన్ని పదాలకూ ఇలా దేవత పదం కలుపుకోవాలి. అహః అంటే మామూలుగా పగలు. పగలు వెళతారని కాదు, పగటి దేవత తీసుకు వెళుతుంది. అలాగే మనకు రెండు అయనాలు ఉన్నాయి. అవి ఉత్తరాయణం, దక్షిణాయనం; ఒక్కొక్కటి ఆరునెలలు ఉంటుంది. షణ్మాసా ఉత్తరాయణమ్ అంటే ఆరునెలలు ఉన్న ఉత్తరాయణ దేవత.

దేవత అంటే ప్రకృతి సూత్రాలకు అధిష్ఠానదేవత, ఉదాహరణకు మనకు భూమ్యాకర్షణ శక్తి ఒక సూత్రం, దానికి వెనుక ఉన్న జ్ఞానానికి ఒక అధిష్ఠానదేవత ఉంటుంది. ఈ అధిష్ఠానదేవతలందరికీ అధిష్ఠానదేవత హిరణ్యగర్భ. హిరణ్యగర్భ నిర్వచనం – సమష్టి సూక్ష్మప్రపంచంయొక్క అధిష్ఠానదేవత.

ఇప్పుడు ఈ మార్గంలో వెళ్ళటానికి అర్హులెవరు? ఎవరు పడితే వారు వెళ్ళటానికి వీలులేదని చూశాము.

**బ్రహ్మవిదో జనాః –** బ్రహ్మవిదో జనాః అంటే సగుణబ్రహ్మ ఉపాసకులు. బ్రహ్మజ్ఞానులు కాదు. మూడు రకాల సాధకులు ఉన్నారు. వారు కర్మ చేసినవారు, ఉపాసన చేసినవారు, జ్ఞానం పొందినవారు. వారి మార్గాలు కూడా మళ్ళీ సాధనకు తగ్గట్టుగానే ఉంటాయి.

కర్మ చేసినవారు శుక్లగతిలో వెళ్ళలేరు. వారు కృష్ణగతిలో వెళ్ళి, పుణ్యం క్షీణించగానే వెనక్కి వస్తారు. వీరికి క్రమముక్తీ రాదు, జీవన్ముక్తీ రాదు. జ్ఞానం పొందినవారు జీవన్ముక్తులు అవుతారు. వారు మరణించాక విదేహముక్తి పొందుతారు. కాబట్టి వారికి ప్రయాణమే లేదు.

ఉపాసన చేసినవారికి జీవన్ముక్తీ రాదు, విదేహముక్తీ రాదు కాని వీరు శుక్లగతిద్వారా బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ చతుర్ముఖ బ్రహ్మద్వారా ఆత్మజ్ఞానం పొంది క్రమముక్తిని పొందుతారు.

ఈ శ్లోకంలో మార్గం శుక్లగతి, వెళ్ళేవారు నిష్కామ సగుణబ్రహ్మ ఉపాసకులు.

శ్లో. 25 **ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్ ।**
**తత్ర చాంద్రమసం జ్యోతిః యోగీ ప్రాప్య నివర్తతే ॥**
ధూమః, రాత్రిః, తథా, కృష్ణః, షణ్మాసాః, దక్షిణాయనమ్,
తత్ర, చాంద్రమసమ్, జ్యోతిః, యోగీ, ప్రాప్య, నివర్తతే ॥

| | | | |
|---|---|---|---|
| ధూమః | = ధూమాభిమాన దేవత | యోగీ | = కేవలకర్మలను ఆచరించు యోగి (పైన పేర్కొనబడిన అభిమాన దేవతలద్వారా కొనిపోబడిన వాడై) |
| రాత్రిః | = రాత్రి అభిమాన దేవత | | |
| తథా | = అలాగే | | |
| కృష్ణః | = కృష్ణపక్ష అభిమాన దేవత | | |
| దక్షిణాయనమ్ | = దక్షిణాయనముయొక్క | చాంద్రమసమ్, జ్యోతిః | = చంద్రలోకమును |
| షణ్మాసాః | = ఆరు మాసముల అభిమాన దేవత ఈ దేవతలద్వారా | ప్రాప్య | = పొంది (స్వర్గలోకాది ఫలములను అనుభవించి) |
| తత్ర | = ఆ మార్గమున (ధూమ మార్గమున) | నివర్తతే | = తిరిగి భూలోకమునకు చేరును |

**ధూమః, రాత్రిః, తథా కృష్ణః (పక్షః), షణ్మాసాః దక్షిణ–ఆయనమ్,**
**తత్ర (కాలే ప్రయాతాః) యోగీ చాన్ద్రమసమ్ జ్యోతిః ప్రాప్య నివర్తతే ॥**

తా: ధూమాభిమానదేవత రాత్రిఅభిమానదేవత అలాగే కృష్ణపక్ష అభిమానదేవత దక్షిణాయనముయొక్క ఆరుమాసముల అభిమానదేవత ఈ దేవతలద్వారా ఆ మార్గమున (ధూమ మార్గమున) కేవలకర్మలను ఆచరించు యోగి (పైన పేర్కొనబడిన అభిమాన దేవతల ద్వారా కొనిపోబడిన వాడై) చంద్రలోకమును పొంది (స్వర్గలోకాది ఫలములను అనుభవించి) తిరిగి భూలోకమునకు చేరును.

ఇప్పుడు రెండవ మార్గం చూస్తాము.

**తత్ర** – రెండవ మార్గంలో; (ప్రయతా) – ప్రయతా కలువుకోవాలి. రెండవ మార్గంలో వెళ్ళేవాళ్ళు. ఆ మార్గం పేరు కృష్ణపరమాత్మ ఇక్కడ చెప్పలేదు. రాబోయే శ్లోకంలో చెపుతాడు. కాని మనం కలుపుకోవచ్చు. కృష్ణమార్గంలో వెళ్ళేవాళ్ళు అని. అది అంత వెలుతురుగా ఉండదు.

**యోగీ ప్రాప్య** – యోగీ అంటే ఇక్కడ కేవలకర్మ చేసినవారు. కేవలకర్మ అంటే కర్మ మాత్రమే చేసి, ఉపాసన చెయ్యనివారు. వీరు వీరి వంతు కర్తవ్యం చక్కగానే నిర్వర్తించారు. పూజలు చెయ్యాల్సిన రీతిలో చేశారు; సంఘసేవ చాలానే చేశారు కాని ఆ పుణ్యం ఉపాసనఫలానికి సాటిరాదు. ఎందుకు?

మానసిక సాధన, శారీరక సాధనకన్నా చాలా కష్టం. శారీరకంగా పూజలు చెయ్యటం తేలికే గాని, మనస్సును కుదురుగా భగవంతునిమీద నిలబెట్టి, ఉపాసన చెయ్యటం కష్టం. అందువల్ల కర్మఫలంకన్నా ఉపాసన ఫలం సహజంగానే ఎక్కువ ఉంటుంది.

**చాంద్రమసం జ్యోతిః** – ఈ కర్మ చేసినవారు చంద్రలోకానికి వెళతారు. చంద్రలోకం అంటే స్వర్గలోకం. భూలోకం పైన ఆరులోకాలున్నాయని చూశాము. అవి వరుసగా భువర్లోకం, మహర్లోకం, సువర్లోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకం. సత్యలోకం అంటే బ్రహ్మలోకం. తక్కిన ఐదులోకాలను స్వర్గలోకాలు అంటారు. కేవలకర్మ చేసినవారు బ్రహ్మలోకానికి వెళ్ళలేరు. వారు ఈ స్వర్గలోకాలకు వెళతారు. ఈ మార్గానికి కూడా తీసుకువెళ్ళే దేవతలు ఉన్నారు. ఇవన్నీ నిజమా అని సందేహం పెట్టుకోకూడదు. వేదం చెప్పిందంటే అది ఒక ప్రమాణం. కన్ను ఎలా ఒక ప్రమాణమో వేదం లేదా శాస్త్రం ఒక ప్రమాణం. శాస్త్రంలో చెప్పినదానిమీద నమ్మకం పెట్టుకోవాలి.

**ధూమః రాత్రిః కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్** – ఆ దేవతలు ధూమదేవత, రాత్రిదేవత, కృష్ణపక్షదేవత, దక్షిణాయన దేవత. ఇందాకటి శ్లోకంలో లాగానే ప్రతిపదానికీ దేవత పదం కలుపుకోవాలి. ధూమః అంటే పొగ, కాని ఇక్కడ ధూమదేవత. అలాగే కృష్ణ అంటే కృష్ణపరమాత్మ కాదు, కృష్ణపక్ష దేవత. ఇంతకు ముందు చూసినట్టే ఇక్కడ చాలా తక్కువ చెప్పాడు కృష్ణపరమాత్మ. ఛాందోగ్యోపనిషత్తులోనూ, బృహదారణ్యకోపనిషత్తులోనూ ఇంకా కొందరు దేవతలు వస్తారు. ఈ రెండింటిలోనూ దేవతల పేర్లు సమానంగా ఉండవు. అందువల్ల బ్రహ్మసూత్రాల్లో దీని మీద పెద్ద చర్చ జరిపి రెండింటినీ కలిపి ఇంకొక పెద్ద పట్టిక తయారుచేస్తారు.

వీరు వెళ్ళేది స్వర్గలోకానికి అయితే దాన్ని కృష్ణమార్గం అని ఎందుకన్నారు? అది కూడా ప్రకాశవంతమైన మార్గం అవాలి కదా? దానికి కృష్ణపరమాత్మ జవాబు చెపుతున్నాడు.

**ప్రాప్య నివర్తతే** – (శుభవార్త) వారు ముందు స్వర్గానికి వెళతారు కాని, (దుర్వార్త) వారి పుణ్యం కరిగిపోయిన తక్షణం వారు కిందకి తిరిగివస్తారు. కాని శుక్లపక్షంలో వెళ్ళినవారు క్రమముక్తి పొందుతారు. అందువల్ల శుక్లగతితో పోలిస్తే కృష్ణగతి ఖచ్చితంగా తక్కువే. అందువల్ల అది చీకటి మార్గం. దాన్ని సూర్యునిలో ఉన్న నల్లచుక్కలతో పోల్చవచ్చు. నిజానికి సూర్యునిలో నల్లచుక్క లేదు, కాని తక్కిన భాగాలతో పోలిస్తే, అది నల్లగా కనిపిస్తుంది. అలాగే శుక్లగతితో పోలిస్తే కృష్ణగతి నల్లగా కనిపిస్తుంది.

ఈ శ్లోకంలో మార్గం కృష్ణగతి, వెళ్ళేవారు కేవలకర్మ చేసినవారు.

శ్లో. 26 **శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే ।**
**ఏకయా యాత్యనావృత్తిమ్ అన్యయావర్తతే పునః ॥**
శుక్లకృష్ణే, గతీ, హి, ఏతే, జగతః, శాశ్వతే, మతే,
ఏకయా, యాతి, అనావృత్తిమ్, అన్యయా, ఆవర్తతే, పునః ॥

హి = ఎందుకంటే
జగతః = జగత్తులో
ఏతే = ఈ రెండు విధములైన
శుక్లకృష్ణే, గతీ = శుక్ల కృష్ణమార్గములు, లేక దేవయాన, పితృయాన మార్గములు
శాశ్వతే = సనాతనములైనవిగా
మతే = భావింపబడుచున్నవి

ఏకయా = ఒకదాని (దేవయానమార్గము)ద్వారా వెళ్ళువాడు
అనావృత్తిమ్ = తిరిగిరాని స్థితిని (పరమగతిని)
యాతి = పొందును
అన్యయా = మరియొకదాని (పితృయానమార్గము) ద్వారా వెళ్ళువాడు అయితే
పునః, ఆవర్తతే = తిరిగి వచ్చును (జననమరణ చక్రములో పడును)

**జగతః ఏతే హి శుక్ల-కృష్ణే గతీ శాశ్వతే మతే ।**
**ఏకయా అనావృత్తిమ్ యాతి అన్యయా పునః ఆవర్తతే ॥**

తా: ఎందుకంటే జగత్తులో ఈ రెండు విధములైన శుక్ల కృష్ణ మార్గములు, లేక దేవయాన, పితృయాన మార్గములు సనాతనములైనవిగా భావింపబడుచున్నవి. ఒకదాని (దేవయానమార్గము)ద్వారా వెళ్ళువాడు తిరిగిరాని స్థితిని (పరమగతిని) పొందును. మరియొకదాని (పితృయానమార్గము)ద్వారా వెళ్ళువాడు అయితే తిరిగి వచ్చును (జననమరణచక్రములో పడును).

కృష్ణగతి, శుక్లగతి అని మనం వ్యవహరిస్తున్నాము కాని ఆ మార్గాల పేర్లు కృష్ణపరమాత్మ ఈ శ్లోకంలో చెపుతున్నాడు.

**శుక్లకృష్ణే గతీ హ్యేతే** – ఈ రెండుమార్గాలనూ శుక్ల, కృష్ణ అంటారు. మనం గతి పదం ఒక్కొక్క దానికీ కలుపుకోవాలి. అంటే శుక్లగతి, కృష్ణగతి. వీటినే శుక్లమార్గం, కృష్ణమార్గం అనీ; దేవయానం, పితృయానం అనీ అంటారు. ఈ మార్గాలు ఎప్పుడు సృష్టించబడ్డాయి?

**జగతః శాశ్వతే మతే** – జగత్తు సృష్టించబడినప్పుడే ఈ రెండు మార్గాలు కూడా సృష్టించబడ్డాయి. జగత్తును సృష్టించాక, తీరికగా ఎప్పుడో ఈ మార్గాలను సృష్టించలేదు. సృష్టి జరిగింది, సృష్టిలో మనుష్యులు వచ్చారు,

సృష్టితో పాటు వేదాలు వచ్చాయి, వేదాలలో కర్మ, ఉపాసనల బోధ వచ్చింది; అందువల్ల సృష్టి వచ్చినప్పటినుంచీ ఈ రెండు రకాల సాధకులూ ఉన్నారు; వారు వెళ్ళే ఈ రెండు మార్గాలూ ఉన్నాయి. ప్రళయంలోనే ఇవి కూడా లయమవుతాయి; మళ్ళీ మరో సృష్టి జరిగినప్పుడు మళ్ళీ వస్తాయి. అందువల్ల జగత్తు ఉన్నన్నాళ్ళూ ఇవీ ఉంటాయి కాబట్టి సనాతనమైన మార్గాలు అన్నాడు కృష్ణపరమాత్మ.

**ఏకయా అనావృత్తిమ్ యాతి** – ఒక మార్గంద్వారా వెళ్ళినవారు క్రమముక్తిని పొంది తిరిగిరారు. ఒక మార్గం అంటే ఏదైనా మార్గం తీసుకోకూడదు. అది శుక్లగతి మాత్రమే. అమెరికాకు వెళ్ళాలంటే ఒక మార్గంలో లండన్‌ను ట్రాన్సిట్ పాయింట్ అంటారు. అలా క్రమముక్తికి బ్రహ్మలోకం ట్రాన్సిట్ పాయింట్ అవుతుంది. జీవన్ముక్తికి మధ్యలో ఆగే పనిలేదు. అనావృత్తిమ్ అంటే క్రమముక్తి. అంటే ఈశ్వరప్రాప్తి పొంది తిరిగిరారు.

**అన్యయా ఆవర్తతే పునః** – ఇంకొక మార్గంలో వెళ్ళినవారు తిరిగివస్తారు.

అంతకుముందు రెండు శ్లోకాల్లోనూ చూసిన రెండు రకాల ప్రయాణాలు, ఆ సాధకులను తీసుకువెళ్ళే దేవతల విషయాలలో మనకు కొన్ని సందేహాలు కలిగే అవకాశం ఉంది. ఉపనిషత్తులో కాని, వాటిలోంచి చెప్పబడిన గీతలో కాని ఇలా సందేహాలు కలిగే అవకాశం ఉన్న అంశాలను బ్రహ్మసూత్రాల్లో చర్చించి, ఆ సందేహాలకు జవాబులను ఇస్తారు.

ఏమిటా సందేహం? 24వ శ్లోకంలో పగలు, శుక్లపక్షం, ఉత్తరాయణ దేవతలు సాధకుణ్ణి పరమపదానికి చేరుస్తారు అని వచ్చింది. ఇక్కడ సందేహం ఏమిటంటే సాధకునికి శుక్లగతా, కృష్ణగతా అనేది అతను మరణించిన సమయం నిర్దేశిస్తుందా? అంటే ఈ శ్లోకాన్ని లోతుగా చదవకపోతే, సాధకుడు పగలు, శుక్లపక్షం, ఉత్తరాయణకాలంలో మరణిస్తే శుక్లగతి పొందుతాడని అర్థం చేసుకునే ప్రమాదం ఉంది. అలాగే 25వ శ్లోకాన్ని లోతుగా చదవకపోతే, సాధకుడు రాత్రి, కృష్ణపక్షం, దక్షిణాయనకాలంలో మరణిస్తే కృష్ణగతిని పొందుతాడని అర్థం చేసుకునే ప్రమాదం ఉంది.

బ్రహ్మసూత్రాల్లో ఈ అంశాలను లోతుగా విశ్లేషించాక, ఒక సాధకుని ప్రయాణాన్ని అతను మరణించిన కాలం నిర్ణయించదనీ; అతను గడిపిన జీవనవిధానం నిర్ణయిస్తుందనీ నిర్దేశింపబడింది. ఈ విషయంలో చాలా వాదోపవాదులు జరిగాయి. అందులో ఒక వాదన ఇది.

| | | | |
|---|---|---|---|
| 24వ శ్లోకం | – ఉత్తరాయణం, శుక్లపక్షం, పగలు | – | శుక్లగతి |
| 25వ శ్లోకం | – దక్షిణాయనం, కృష్ణపక్షం, రాత్రి | – | కృష్ణగతి |

ఒకవేళ ఒక సాధకుడు ఉత్తరాయణంలో, కృష్ణపక్షంలో మరణిస్తే అతని పరిస్థితి ఏమిటి? ఉత్తరాయణం ప్రకారం శుక్లగతిలో వెళతాడా, కృష్ణపక్షం ప్రకారం కృష్ణగతిలో వెళతాడా? ఉత్తరాయణంలో కృష్ణపక్షం ఉందా అని అడగకండి. అది ప్రాథమిక విషయం.

మాథమాటిక్స్‌లో పర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్ అంటారు. ఐదారు అంశాలుంటే వాటిని రకరకాలుగా జత చెయ్యవచ్చు. అలాగే ఇప్పుడు ఇంకొక జత చూద్దాము. ఒకవేళ ఒక వ్యక్తి శుక్లపక్షంలో మరణించినా, రాత్రివేళ

మరణిస్తే అతని పరిస్థితి ఏమిటి? మళ్ళీ అదే సమస్య! శుక్లపక్షంలో మరణిస్తే శుక్లగతిలో వెళ్ళాలి, రాత్రి మరణిస్తే కృష్ణగతిలో వెళ్ళాలి.

అందువల్ల ఒక సాధకుని మరణకాలం అతని గతిని నిర్ణయిస్తుంది అనుకోకూడదు. అదేకాదు, ఒకవేళ అలా అతని మరణకాలం అతని గతిని నిర్ణయించేటట్టుగా ఉంటే, చాలా ప్రమాదాలు జరుగుతాయి. ఎందరో నేరస్థులు ఉత్తరాయణంలో మరణిస్తారు. వాళ్ళు శుక్లగతిద్వారా వెళతారా? ఒకవేళ అలాంటి అవకాశమే ఉంటే, కొంతమంది పనిగట్టుకుని బోలెడు నేరాలు చేసేసి, ఉత్తరాయణ కాలంలో ఆత్మహత్య చేసేసుకుంటారు. హాయిగా క్రమముక్తి పొందే అవకాశం ఉంటుంది. అది కాక ఎందరో పుణ్యాత్ములు దక్షిణాయణంలో మరణిస్తారు. వారు కృష్ణగతిలో వెళ్ళాల్సి ఉంటుంది. అంటే వారికి అన్యాయం జరిగినట్టు అవుతుంది.

అందువల్ల మరణకాలం వీరి మార్గాలను నిర్ణయించదు అని బ్రహ్మసూత్రాల విశ్లేషణలో నిర్దేశింపబడింది. నిజానికి అంతదాకా వెళ్ళనవసరం లేదు. కృష్ణపరమాత్మే ఆ విషయాన్ని స్పష్టంగా చెప్పాడు. 26వ శ్లోకంలో – **శుక్లకృష్ణే గతీ హ్యేతే** – వీటిని శుక్లగతి, కృష్ణగతి అంటారు అన్నాడు. అంటే ఇవి మరణసమయాన్ని సూచించవు అని అర్థం.

శ్లో. 27 **నైతే సృతీ పార్థ జానన్ యోగీ ముహ్యతి కశ్చన ।**
**తస్మాత్ సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున ॥**
న, ఏతే, సృతీ, పార్థ, జానన్, యోగీ, ముహ్యతి, కశ్చన,
తస్మాత్, సర్వేషు, కాలేషు, యోగయుక్తః భవ, అర్జున ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = అర్జునా! | తస్మాత్ | = అందువలన |
| ఏతే | = ఈ రెండు | అర్జున! | = ఓ అర్జునా! |
| సృతీ | = మార్గములను | సర్వేషు, కాలేషు | = సర్వకాలములందును |
| జానన్ | = తెలిసికొనిన | యోగయుక్తః | = (నీవు) ఉపాసనా రూపయోగయుక్తుడవు |
| కశ్చన, యోగీ | = ఏ యోగియు | భవ | = కమ్ము (నిరంతరము నన్నే పొందుటకు |
| న, ముహ్యతి | = మోహితుడు కాడు | | ప్రయత్నింపుము) |

**హే పార్థ! ఏతే సృతీ జానన్ కశ్చన యోగీ న ముహ్యతి;**
**తస్మాత్ హే అర్జున! (త్వం) సర్వేషు కాలేషు యోగ-యుక్తః భవ ॥**

తా: అర్జునా! ఈ రెండు మార్గములను తెలిసికొనిన ఏ యోగియు మోహితుడు కాడు. అందువలన ఓ అర్జునా! సర్వకాలములందును నీవు ఉపాసనా రూపయోగయుక్తుడవు కమ్ము (నిరంతరము నన్నే పొందుటకు ప్రయత్నింపుము).

ఇంతవరకూ కృష్ణపరమాత్మ రెండు లక్ష్యాలు, రెండు మార్గాలు, రెండు రకాల సాధనల గురించి వివరంగా మాట్లాడాడు.

**నైతే సృతీ జానన్** – సృతీ అంటే గతి, గతి అంటే మార్గం. అంటే ఈ రెండు మార్గాల గురించీ స్పష్టంగా తెలిశాక అంటే ఒక మార్గం క్రమముక్తిని ఇస్తుందనీ, ఇంకొక మార్గం వెనక్కి తీసుకువస్తుందనీ అర్థమయ్యాక,

**యోగీ కశ్చన ముహ్యతి** – తెలివైనవ్యక్తి ఎవరూ మోహంలో పడడు. యోగి అంటే వివేకి. వివేకి అయిన వ్యక్తి కర్మమార్గం గొప్పదా, ఉపాసన మార్గం గొప్పదా అనే అయోమయంలో పడడు. అర్జునుడు వివేకా, కాదా? కృష్ణపరమాత్మ అర్జునునితో చెపుతున్నాడు. అర్జునా నువ్వు వివేకివి, అందువల్ల ఉపాసనా మార్గాన్నే ఎన్నుకోవాలి.

**అర్జున! తస్మాత్ సర్వేషు కాలేషు** – అందువల్ల అర్జునా! ఇప్పటినుంచీ ఎప్పుడూ నువ్వు ఉపాసనను కలుపుకో.

**యోగయుక్తః భవ** – ఉపాసనమార్గాన్ని ఎన్నుకో. నువ్వు కర్మ చెయ్యాలి, నీ ధర్మాలు నిర్వర్తించాలి, పంచమహాయజ్ఞాలు చెయ్యాలి నిజమే కాని ఆ కర్మలకు సగుణ ఈశ్వర ఉపాసనను జోడించు.

ఇక్కడ ఒక విషయాన్ని జాగ్రత్తగా గమనించాలి. ఇక్కడ చెప్పిన రెండు మార్గాలు – కర్మ, ఉపాసనలు. జ్ఞానం ప్రసక్తి ఈ అధ్యాయంలో ఎక్కడా లేదు. కర్మ, ఉపాసనల్లో ఏది గొప్పది అంటే జ్ఞానం అనకూడదు. ఎందుకంటే ఇక్కడ జ్ఞానం పోటీ చెయ్యటం లేదు. జ్ఞానం ఖచ్చితంగా ఈ రెండింటికన్నా గొప్పదే కాని ఇక్కడ చర్చనీయాంశం కర్మ గొప్పదా, ఉపాసన గొప్పదా? ఎనిమిదవ అధ్యాయం ఆ విధంగా ప్రత్యేకమైన అధ్యాయం. జ్ఞానం గురించి ఈ షట్కంలో ఏడవ అధ్యాయంలో వచ్చింది, తక్కిన అధ్యాయాల్లో కూడా వస్తుంది. కాబట్టి కర్మ, ఉపాసనల్లో ఉపాసన గొప్పది. అందువల్ల ఉపాసనను ఎన్నుకో అర్జునా అని కృష్ణపరమాత్మ చెప్పాడు.

ఇక్కడితో రెండు మార్గాల గురించి, రెండు రకాల సాధకుల గురించీ ముగిసింది.

శ్లో. 28 **వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్ ।**
**అత్యేతి తత్సర్వమిదం విదిత్వా యోగీ పరం స్థానముపైతి చాద్యమ్ ॥**
వేదేషు, యజ్ఞేషు, తపస్సు, చ, ఏవ, దానేషు, యత్, పుణ్యఫలమ్, ప్రదిష్టమ్,
అత్యేతి, తత్, సర్వమ్, ఇదమ్, విదిత్వా, యోగీ, పరమ్, స్థానమ్, ఉపైతి, చ, ఆద్యమ్ ॥

| | | | |
|---|---|---|---|
| యోగీ | = సగుణబ్రహ్మ ఉపాసకుడు | ప్రదిష్టమ్ | = చెప్పబడినదో |
| ఇదమ్ | = ఈ తత్త్వరహస్యమును | తత్, సర్వమ్ | = ఆ సమస్తఫలమును |
| విదిత్వా | = తెలిసికొని | ఏవ | = నిస్సందేహముగా |
| వేదేషు | = వేదపఠనములందును | అత్యేతి | = అధిగమించును |
| చ | = ఇంకా | చ | = ఇంకా |
| యజ్ఞేషు | = యజ్ఞములందును | ఆద్యమ్ | = సనాతనమైన |
| తపస్సు | = తపస్సులందును | పరమ్, స్థానమ్ | = పరమపదమును |
| దానేషు | = దానములందును | ఉపైతి | = పొందును |
| యత్ | = ఏ | | |
| పుణ్యఫలమ్ | = పుణ్యఫలము | | |

**యోగీ ఇదమ్ విదిత్వా, వేదేషు యజ్ఞేషు తపఃసు దానేషు చ ఏవ**
**యత్ పుణ్య-ఫలమ్ ప్రదిష్టమ్, తత్ సర్వమ్ అత్యేతి, ఆద్యమ్ పరమ్ చ స్థానమ్ ఉపైతి ॥**

తా: సగుణబ్రహ్మ ఉపాసకుడు ఈ తత్త్వరహస్యమును తెలిసికొని వేదపఠనములందును ఇంకా యజ్ఞములందును, తపస్సులందును, దానములందును ఏ పుణ్యఫలము చెప్పబడినదో ఆ సమస్తఫలమును నిస్సందేహముగా అధిగమించును ఇంకా సనాతనమైన పరమపదమును పొందును.

**5. ఉపాసనాస్తుతి – శ్లోకం 28**

ఈ శ్లోకంలో క్రమముక్తిని స్తుతిస్తున్నాడు కృష్ణపరమాత్మ. క్రమముక్తి అంటే భగవంతునిలో ఐక్యం లేదా మోక్షం అని చూశాము. క్రమముక్తి అన్నా, జీవన్ముక్తి అన్నా అంతిమగమ్యం ఒకటే. విదేశాలకు వెళ్ళాలంటే డైరెక్టుగా వెళ్ళే మార్గం ఉంటుంది, లేదా మధ్యలో మారి వెళ్ళే మార్గం ఉంటుంది. ఎలా వెళ్ళినా గమ్యం ఒకటే. ఆ విధంగా క్రమముక్తి అయినా, జీవన్ముక్తి అయినా రెండూ ఇచ్చేది మోక్షమే. అందువల్ల కృష్ణపరమాత్మ క్రమముక్తిని కీర్తిస్తున్నాడు.

**యోగీ ఇదం సర్వం విదిత్వా** – ఈ అధ్యాయంలో నేను చేసిన బోధను అంతా సరిగ్గా అర్థం చేసుకున్న యోగి. యోగి అంటే సగుణబ్రహ్మ ఉపాసకుడు, ఉపాసన చేసి,

**పరంస్థానమ్ ఉపైతి** – క్రమముక్తిని పొందుతాడు. భగవంతునిలో ఐక్యం అవుతాడు. ఇక్కడ భగవంతుణ్ణి ఎలా వర్ణించాడు?

**(పరమ్) ఆద్యం (స్థానమ్)** – శ్రేష్ఠమైన ఆదిలేని గమ్యం. ఆద్యం అంటే సర్వకారణం; పరం అంటే శ్రేష్ఠమైన, స్థానం అంటే గమ్యం అంటే నిత్య ఈశ్వరుడు. ఉపైతి అంటే పొందుతాడు. ఈ నిత్య ఈశ్వరుని గొప్పతనం ఏమిటి? కర్మఫలం కన్నా ఉపాసన ఫలం గొప్పదని చెపుతున్నాడు కృష్ణపరమాత్మ. అది చూపించటానికి కొన్ని కర్మలను ఇక్కడ పేర్కొంటున్నాడు.

**వేదేషు** – వేదపారాయణం ఒక కర్మ; **యజ్ఞేషు** – యజ్ఞాలు చెయ్యటం; **తపస్సు** – తపస్సు చెయ్యటం; **దానేషు** – దానధర్మాలు చెయ్యటం

**యత్పుణ్యఫలం ప్రదిష్టమ్** – వీటివల్ల పుణ్యఫలం వస్తుంది. వేదం కర్మలకు పుణ్యఫలాలు వస్తాయని హామీ ఇస్తుంది. కానీ

**తత్ సర్వమ్ అత్యేతి** – వీటన్నిటినీ మించినది ఉపాసనా ఫలం. అంటే కర్మఫలాల కన్నా గొప్ప ఫలం ఉపాసన ఫలం. ఎందుకంటే కర్మఫలం స్వర్గలోక ప్రాప్తిని ఇచ్చి, తిరిగి వచ్చేలా చేస్తే, ఉపాసన ఫలం నిత్య ఈశ్వర ప్రాప్తిని ఇస్తుంది.

అందువల్ల ఓ అర్జునా, ఈ అవకాశాన్ని కాలదన్నుకోకు. సగుణ ఈశ్వర ఉపాసన ఎన్నుకో; నిరంతరం

భగవన్నామస్మరణం చెయ్యి, తద్వారా మరణకాలంలో కూడా భగవంతుణ్ణే తలుచుకునే అవకాశం ఉంటుంది. అప్పుడు నువ్వు క్రమముక్తి పొందుతావు. ఇదీ కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో చేసిన బోధ సారాంశం. ఈ విధంగా అర్జునుని ఏడవ ప్రశ్న అయిన ప్రయాణకాల ఈశ్వరస్మరణం గురించి కూడా జవాబు చెప్పాడు.

దీనితో **అక్షరబ్రహ్మయోగము** అనే ఈ అధ్యాయం ముగిసింది. దీన్ని **ప్రయాణకాల స్మరణయోగము** అని కూడా అని ఉండవచ్చు, కాని ప్రయాణకాలం అంటే మనుష్యులు భయపడతారు సాధారణంగా. ఈ అధ్యాయంలో అక్షరం పదంతో కృష్ణపరమాత్మ బోధ మొదలవుతుంది కాబట్టి దీనికి అక్షరబ్రహ్మయోగము అని పేరు వచ్చింది అని ముందే చూశాము.

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే**
**శ్రీకృష్ణార్జునసంవాదే అక్షరబ్రహ్మయోగో నామ అష్టమోఽధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీమద్భగవద్గీతయందు, ఉపనిషత్తులయందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమునందు, శ్రీకృష్ణార్జున సంవాదమునందు అక్షరబ్రహ్మయోగము అనే అష్టమోధ్యాయము.

# అధ్యాయము 8 - అక్షరబ్రహ్మయోగము సారాంశము

భగవద్గీతను మూడు షట్కాల కింద తీసుకుంటే, 7-12 వరకూ మధ్యమషట్కంలో వస్తాయని చూశాము. మొదటి షట్కంలో కర్మయోగం; రెండవ షట్కంలో ఉపాసన యోగం; మూడవ షట్కంలో జ్ఞానయోగం వివరించ బడ్డాయి. ఆ విధంగా ఈ షట్కంలో ఉపాసనయోగం గురించి వివరంగా చూస్తాము.

**ఉపాసన - సగుణబ్రహ్మ విషయ మానస వ్యాపారః**

ఉపాసన అంటే ప్రాథమికంగా మనస్సుకు సంబంధించినది. కాయికపూజను ఉపాసన అనలేము. కొంతమంది పూజలు కూడా ఉపాసనలోకి వస్తుందని పొరపడతారు, కాని అది సరికాదు. పూజ శారీరక కర్మ కాబట్టి, అది కర్మయోగంలోకి వస్తుంది. అందువల్ల అన్ని రకాల జపాలు, పారాయణాలు కర్మయోగంలోకే వస్తాయి. ఉపాసన అంటే మనస్సుతో చేసే సాధన. అందువల్ల దీనిని మానసవ్యాపారం అన్నారు.

మళ్ళీ మనస్సుతో చేసే వ్యాపారం అంటే మనస్సుతో చేసే ప్రతి పనీ ఉపాసన కాదు. అలా అయితే మనం పడే ఆందోళన కూడా ఉపాసనలోకి వస్తుంది. అసలే మనం అందులో ఆరితేరినవాళ్ళం. అందువల్ల ఉపాసన అంటే సగుణబ్రహ్మ విషయ మానసవ్యాపారం. మనస్సులో ఈశ్వరుణ్ణి తలుచుకోవటం.

అందువల్ల ఇక్కడ ప్రాథమికంగా రెండు అంశాలున్నాయి - మనస్సుతో చెయ్యటం, ఈశ్వరధ్యానం చెయ్యటం. మూడవ అంశం - సగుణబ్రహ్మ ఉపాసనా, నిర్గుణబ్రహ్మ ఉపాసనా? నిర్గుణబ్రహ్మమీద ఉపాసన చెయ్యలేము. అందువల్ల సగుణబ్రహ్మ ఉపాసన.

మళ్ళీ సగుణబ్రహ్మ ఉపాసనలో రెండురకాల ఉపాసనలు ఉన్నాయి. అవి సకామ సగుణబ్రహ్మ ఉపాసన, నిష్కామ సగుణబ్రహ్మ ఉపాసన.

**సకామ ఉపాసన** - ఇందులో ఇహలోక లేక పరలోక ఫలాలకోసం ధ్యానం చేస్తాము. స్వర్గలోకాలకు వెళ్ళటం కూడా ప్రాపంచిక సుఖాల కిందకే వస్తాయి. ఎందుకంటే అక్కడ సుఖాలు భూలోక సుఖాలకంటే ఎక్కువ స్థాయిలో ఉంటాయి. ఇహలోకఫలాల్లో అన్ని ఐశ్వర్యాలతో పాటు సిద్ధులు కూడా వస్తాయి. సిద్ధులు ఆధ్యాత్మికతలోకి రావు. అవి కూడా ఇహలోకఫలాల కిందకే వస్తాయి. అవి సకామ ఉపాసనవల్ల వస్తాయి.

**నిష్కామ ఉపాసన** - నిష్కామ ఉపాసనలో కూడా సగుణబ్రహ్మ విషయ మానసవ్యాపారమే ఉంటుంది కాని, ఇక్కడ ఇహలోక పరలోక ఫల ఇచ్ఛ ఉండదు. ఈ నిష్కామ ఉపాసన ఈ మధ్యమషట్కంలో ప్రధాన అంశం. కృష్ణపరమాత్మ సకామ ఉపాసన విషయం గురించి అసలు మాట్లాడడు. నిష్కామ ఉపాసన గురించే మాట్లాడతాడు. నిష్కామ ఉపాసన ఒక సాధకునియొక్క ఆధ్యాత్మిక ఉన్నతికి తోడ్పడుతుంది. అందువల్ల ప్రాపంచిక సుఖాలు కాకుండా ఆంతర ఎదుగుదల కోరుకునే వ్యక్తి నిష్కామ ఉపాసన చేస్తాడు.

నిష్కామ ఉపాసనను మళ్ళీ రెండు రకాలుగా చెయ్యవచ్చు. అవి – నిర్గుణజ్ఞానానికి రావటం లేదా సగుణ ఉపాసన కొనసాగించటం.

ఎ) **నిర్గుణ జ్ఞానానికి రావటం:** సగుణ ఉపాసన చాలాకాలం చేస్తే, చిత్త ఏకాగ్రత ఏర్పడి, సాధనచతుష్టయ సంపన్నుడయి, జ్ఞానయోగ్యతా ప్రాప్తి పొంది, జ్ఞానమార్గానికి రావటం. అంటే వేదాంతవిచారణ శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా చెయ్యటం. జ్ఞానమార్గం ఉపాసన కిందకి రాదు.

జ్ఞానయోగానికీ, ఉపాసనయోగానికీ మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి? ఉపాసనలో సగుణ ఈశ్వరధ్యానం చేస్తే, జ్ఞానంలో నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందుతారు. మొదటిది స్వంతంగా ధ్యానం చేస్తారు. జ్ఞానయోగంలో ఆచార్యుని దగ్గరకు వెళ్ళి జ్ఞానం పొందుతారు.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – 4.34

కృష్ణపరమాత్మ చెప్పినట్టుగా జ్ఞానయోగం అంటే వేదాంతశ్రవణం చెయ్యటం. ఒక ఉత్తమ గురువు దగ్గర కొన్ని సంవత్సరాలు అధ్యయనం చేసి జ్ఞానం పొందటం శ్రవణం. మననంలో నిశ్చయజ్ఞానం పొందటం; నిదిధ్యాసనంలో జ్ఞాననిష్ఠలో నిలబడటం జరుగుతాయి. ఇవన్నీ ఇక్కడే ఈ జన్మలోనే చేయటం.

అలా ఒక మార్గం – ముందు నిష్కామ ఉపాసన చేసి, సాధనచతుష్టయసంపత్తి పొంది, ఆచార్యుని దగ్గరకు వెళ్ళి శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా నిర్గుణ బ్రహ్మజ్ఞానం పొంది, ఆ జ్ఞాననిష్ఠలో నిలబడి, ఇక్కడే ఇప్పుడే మోక్షం పొందటం. దీన్ని సద్యోముక్తి లేదా జీవన్ముక్తి అంటారు. అలా జీవన్ముక్తి పొంది, ఆ ఫలాన్ని ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకూ అనుభవించిన జ్ఞాని మరణించాక విదేహముక్తి పొందుతాడు. దాన్ని విదేహముక్తి అంటారు. అతని జీవాత్మ సమష్టిలో కలిసిపోతుంది. అతనికి ప్రయాణం లేదు. శుక్లగతి, కృష్ణగతులు అతనికి వర్తించవు.

ఈ షట్కంలో కృష్ణపరమాత్మ ముఖ్యంగా చెప్పదలుచుకున్నది ఈ విధమైన నిష్కామ ఉపాసన గురించి. అంటే నిష్కామ ఉపాసననుంచి జ్ఞానయోగానికి వచ్చి జీవన్ముక్తి పొందటం. అదే అంశాన్ని 7, 9, 10, 11, 12 అధ్యాయాల్లో చర్చిస్తాడు. ఒక్క ఈ అధ్యాయంలో మాత్రమే నిష్కామ ఉపాసనయొక్క రెండవ మార్గాన్ని చర్చించాడు. ఆ విధంగా ఈ అధ్యాయం ప్రత్యేక స్థానాన్ని సంతరించుకుంది.

బి) **సగుణ ఉపాసన కొనసాగించటం:** ఈ సాధకుడు అటు సకామ ఉపాసకునిలాగా ఇహలోక, పరలోకసుఖాలను కోరడు; అలాగని జ్ఞానమార్గానికీ రాడు. అతనికి మోక్షం కావాలి కాని వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసనలను ఎన్నుకోడు. దానికి కారణం ఏదైనా కావచ్చు. నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందే అర్హత తనకు లేదు అనుకోవచ్చు లేదా శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు అతనికి దొరికి ఉండకపోవచ్చు.

అందువల్ల అతని మనస్సు సదా ఈశ్వరచింతనలో ఉంటుంది. అది ఏ సగుణ ఈశ్వర రూపమన్నా కావచ్చు. రాముడవచ్చు, కృష్ణుడవచ్చు, దేవి అవచ్చు. ఏ దేవుడైనా నిరంతరం దైవనామస్మరణలోనే ఉంటాడు కాబట్టి,

మరణకాలంలో కూడా దైవాన్నే తలుచుకుంటాడు. అది ప్రకృతి సూత్రం. మనకు జీవితంలో ఏది చాలా అమూల్యమైనదైతే దాన్నే మరణకాలంలో తలుచుకుంటాము.

అతను నిష్కామ ఉపాసకుడు కాబట్టి, ఈశ్వరుణ్ణే నిరంతరం తలుచుకుంటాడు కాబట్టి, మరణంలో కూడా ఈశ్వరుణ్ణే తలుచుకుంటాడు. ఈశ్వరుడు అంటే నిర్గుణ ఈశ్వరుడు కాదు. అతను జ్ఞానం పొందలేదనే విషయం మర్చిపోకూడదు. అతను అజ్ఞాని ఉపాసకుడు.

ఇక్కడ నియమాలు మర్చిపోకూడదు. అతను అజ్ఞాని, నిష్కామ ఉపాసకుడు, దైవచింతనతో మరణించాడు. అటువంటి వాని పరిస్థితి ఏమిటి? ఇదీ ఈ ఎనిమిదవ అధ్యాయంయొక్క ముఖ్యాంశం.

కృష్ణపరమాత్మ, అతను జీవన్ముక్తి పొందడు కాని క్రమముక్తి పొందుతాడని చెప్పాడు. అతను ప్రత్యేకమైన మార్గంద్వారా, శ్రేష్ఠమైన లోకానికి వెళతాడు. అంటే శుక్లగతిద్వారా బ్రహ్మలోకానికి వెళతాడు. అక్కడ అతను మార్గం మారతాడు. అంటే సగుణ ఉపాసననుంచి నిర్గుణ బ్రహ్మజ్ఞానం పొందుతాడు.

ఇక్కడ, ఈ భూలోకంలో తప్పించుకున్న జ్ఞానయోగాన్ని అక్కడ బ్రహ్మలోకంలో పొందుతాడు. కాకపోతే అక్కడ పరిస్థితులు అనువుగా ఉంటాయి. శిష్యుడు కూడా సిద్ధంగా ఉంటాడు, సూక్ష్మబుద్ధి కలిగి ఉంటాడు, చెప్పేది సాక్షాత్తూ బ్రహ్మదేవుడు. అందువల్ల నేర్చుకోవటం తడవు, జ్ఞానం వచ్చేస్తుంది. అప్పుడు క్రమముక్తి పొందుతాడు. అందువల్ల పునర్జన్మ ఉండదు. అందువల్ల భూలోకానికి తిరిగిరాడు.

ఈ అధ్యాయం క్రమముక్తి గురించి బోధిస్తుంది. కాని కృష్ణపరమాత్మ మనం జీవన్ముక్తిని మాత్రమే ఎన్నుకోవాలని కోరుకుంటున్నాడు. అందువల్ల ఐదు అధ్యాయాలలో జీవన్ముక్తి గురించి, ఈ ఒక్క అధ్యాయంలో మాత్రమే క్రమముక్తి గురించి చెప్పాడు. అది కూడా ఎందుకు? దాని గురించి కూడా తెలుసుకోవాలి కాబట్టి చెప్పాడు. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయాన్ని అర్థం చేసుకోవాలి.

ఎనిమిదవ అధ్యాయాన్ని ప్రధానంగా ఐదు భాగాలుగా విభజించవచ్చు. అవి –

| | |
|---|---|
| **1. ఏడు ప్రశ్నలు, ఆరు జవాబులు** | **– శ్లోకాలు 1–4** |
| **2. ప్రయాణకాలంలో ఈశ్వరస్మరణం** | **– శ్లోకాలు 5–14** |
| **3. రెండు రకాల లక్ష్యాలు** | **– శ్లోకాలు 15–22** |
| **4. రెండు రకాల మార్గాలు, రెండు రకాల సాధకులు** | **– శ్లోకాలు 23–27** |
| **5. ఉపాసనాస్తుతి** | **– శ్లోకం 28** |

### 1. ఏడు ప్రశ్నలు, ఆరు జవాబులు – శ్లోకాలు 1–4

కృష్ణపరమాత్మ ఏడవ అధ్యాయంలో ప్రవేశపెట్టిన కొన్ని కొత్త పదాలను ఆధారం చేసుకుని అర్జునుడు ఈ అధ్యాయం ప్రారంభంలో ఏడు ప్రశ్నలు వేశాడు. ఆ ప్రశ్నలూ, జవాబులూ చూద్దాము.

1. **తత్ బ్రహ్మ కిమ్ –** ఆ బ్రహ్మ ఎవరు?
   జవాబు – పరమమ్ అక్షరం బ్రహ్మ – శ్రేష్ఠమైన అక్షరబ్రహ్మ.

2. **కిమ్ అధ్యాత్మమ్ –** అధ్యాత్మము అంటే ఏమిటి?
   జవాబు – స్వభావః అధ్యాత్మమ్ ఉచ్యతే – శరీరంలో ఉన్న చైతన్యం.

బ్రహ్మ, అధ్యాత్మము రెండూ ఒకటే – సర్వవ్యాపకమైన చైతన్యం. ఒకే వ్యక్తిని కొడుకు పరంగా చూస్తే తండ్రి అంటాము; చెల్లెలు పరంగా చూస్తే అన్న అంటాము. అలాగే ఒకే చైతన్యాన్ని సమష్టిపరంగా చూస్తే బ్రహ్మ అంటాము; వ్యష్టిపరంగా చూస్తే అధ్యాత్మము అంటాము. ఇంకోవిధంగా చెప్పాలంటే సమష్టిపరంగా పరమాత్మ, వ్యష్టిపరంగా జీవాత్మ.

3. **కిం కర్మ –** కర్మ అంటే ఏమిటి?
   జవాబు – భూతభావోద్భవకరో విసర్గః – భవిష్యత్తు సృష్టియొక్క కారణం కర్మ.

జీవులు చేసుకున్న పుణ్యపాపకర్మలవల్ల తర్వాత సృష్టి వస్తుంది. పుణ్యపాపాలను సుఖదుఃఖాలవల్లనే క్షయం చేసుకోగలరు. సుఖదుఃఖాలు క్షయమవటానికి శరీరం కావాలి, వ్యవహారం నడపటానికి జగత్తు కావాలి. అనేక జీవరాశులు ఉన్నాయి కాబట్టి వాటికి అనేక పుణ్యపాపాలు ఉంటాయి. భగవంతుడు వాటి కర్మఫలాలను క్షయం చేయటానికి పధ్నాలుగు లోకాలను సృష్టించాడు. వ్యవహారం నడపటానికి అనేక మందిని ఒకచోట ఏర్పరచాల్సి వస్తుంది భగవంతుడు. ఒక దోమ మిమ్మల్ని కుట్టిందంటే, అది కూడా కర్మసిద్ధాంతాన్ని అనుసరించే జరిగింది. ఆ చర్యవల్ల దోమ పుణ్యం క్షయమయితే, మీ పాపం క్షయమవుతుంది. ఒకరి పుణ్యం, ఒకరి పాపం క్షయమయ్యేలాగా ఒకచోట జీవులను చేర్చటం వెనుక ఎంత ప్రణాళిక ఉందో చూడండి. దీన్ని 'ఇంటలిజెంట్లీ పుట్ టుగెదర్' అంటారు దయానందస్వామీజీ.

4. **అధిభూతం కిం ప్రోక్తమ్ –** అధిభూతము అంటే ఏమిటి?
   జవాబు – అధిభూతం క్షరో భావః –సృష్టిలో నాశనమయ్యే ప్రతిదీ అధిభూతము.

క్షరమయ్యేది అంటే నాశనమయ్యేది. భూతము అంటే పంచభూతాలు. పంచభూతాలతో తయారు చెయ్యబడ్డ జగత్తు, వ్యష్టి స్థూలశరీరం కూడా నాశనమవుతాయి.

5. **అధిదైవం కిముచ్యతే –** అధిదైవం అంటే ఏమిటి?
   జవాబు – పురుషః. అంటే హిరణ్యగర్భ.

హిరణ్యగర్భ అంటే సమష్టి సూక్ష్మశరీరసహితచైతన్యం. వ్యష్టిపరంగా మన బుద్ధి పనిచేస్తే, హిరణ్యగర్భ సమష్టి బుద్ధి.

6ఎ) **అధియజ్ఞః కః –** అధియజ్ఞము అంటే ఏమిటి?
   జవాబు – అధియజ్ఞః అహమ్ ఏవ – ఈశ్వరుడు.

ఈశ్వరుడు అంటే సమష్టి కారణశరీరసహితచైతన్యం. ఇంకో విధంగా చెపితే

**నిర్గుణబ్రహ్మ + మాయ = ఈశ్వరుడు.**

మాయ అన్నా, కారణప్రపంచం అన్నా, అవ్యక్తప్రపంచం అన్నా ఒకటే. నిర్గుణబ్రహ్మ అంటే చైతన్యతత్త్వం. అందువల్ల

అధియజ్ఞం = ఈశ్వరుడు = చైతన్యతత్త్వం + అవ్యక్తప్రపంచం

6బి) **కథమ్ అస్మిన్ దేహే (వర్తతే)** – ఈ అధియజ్ఞం ఈ శరీరంలో ఎలా ఉంటుంది?

జవాబు – **ప్రాజ్ఞ రూపేణ ఈశ్వరః అస్మిన్ దేహే వర్తతే** – ఈ శరీరంలో ప్రాజ్ఞరూపంలో ఉన్నాడు.

సమష్టి కారణప్రపంచంలో ప్రతిబింబచైతన్యం ఈశ్వరుడు అయితే వ్యష్టి కారణశరీరంలో ప్రతిబింబచైతన్యం ప్రాజ్ఞ; యజ్ఞం అంటే కర్మ, అధియజ్ఞం అంటే కర్మఫలదాత. ఈశ్వరుడు కర్మఫలదాత. ఆ కర్మఫలదాత మన శరీరంలో ప్రాజ్ఞరూపంలో ఒక కంప్యూటర్ పట్టుకుని కూర్చున్నాడు. మనం చేసే ప్రతిచర్యనీ, మాట్లాడే ప్రతిమాటనీ ఆ కంప్యూటర్‌లోకి ఎక్కించేస్తాడు. మానవ కంప్యూటర్‌కు వైరస్ వస్తుంది కాని ఈశ్వరుని కంప్యూటర్‌కు అలాంటి దోషాలు అంటవు.

అధియజ్ఞం – కర్మఫలదాత ఈశ్వరుడు, ఈ శరీరంలో ప్రాజ్ఞరూపంలో ఉన్నాడు.

ఇక్కడితో ఆరు ప్రశ్నలకు జవాబులు అయిపోయాయి.

## 2. ప్రయాణకాలంలో ఈశ్వర స్మరణం – శ్లోకాలు 5-14

ఈ శ్లోకాల్లో ఏడవ ప్రశ్నకు జవాబు ఇస్తాడు కృష్ణపరమాత్మ.

7 ప్రశ్న – **ప్రయాణ కాలే చ కథం జ్ఞేయో-సి నియతాత్మభిః**

దీన్ని రెండు ప్రశ్నలుగా విభజించవచ్చు.

7ఎ) మరణకాలంలో దేవుణ్ణి తలుచుకోవటంలో ఏదైనా ప్రత్యేకత ఉందా?

7బి) మరణకాలంలో భగవంతుణ్ణి ఎలా తలుచుకోలము?

ఈ రెండింటినీ కలిపి ప్రయాణకాల ఈశ్వర స్మరణం అనవచ్చు. దీనికి కృష్ణపరమాత్మ వివరంగా జవాబు చెప్పాడు. అందువల్ల ఈ అధ్యాయాన్ని **ప్రయాణకాల స్మరణయోగము** అని కూడా అని ఉండవచ్చు, కాని ప్రయాణం మాట ఎత్తితే భయపడతారు కొందరు.

దీనికి జవాబుగా కృష్ణపరమాత్మ ఒక ప్రకృతి సూత్రాన్ని చెప్పాడు. మీకు జీవితంలో ఏది చాలా ఇష్టమైతే, దాన్నే మరణకాలంలో తలుచుకుంటారు. దీన్ని మరణపరంగా చెపితే, మరణసమయంలో దేన్ని ఎక్కువగా తలుచుకుంటే, అది మీ వ్యక్తిత్వం. అంటే మీ వ్యక్తిత్వాన్ని మీరు చేసిన ఆఖరి ఆలోచనవల్ల చెప్పవచ్చు. ఎందుకలా అంటున్నాము?

మీ జీవితాన్ని నిర్దేశించేది మీ ఫ్రీవిల్, మీ వాసనలు. మొదట్లో ఫ్రీవిల్ బలంగా ఉంటుంది, వాసన బలహీనంగా ఉంటుంది. సిగరెట్ త్రాగటం, మందు త్రాగటంలాంటి చెడు అలవాట్లు తీసుకుంటే ఈ విషయం అర్థమవుతుంది. మొట్టమొదటి సిగరెట్ తాగేముందు మీ ఫ్రీవిల్ బలంగా ఉంటుంది. అప్పుడు మీరు దానికి బలంగా నో చెప్పగలరు. అలాగే మొట్టమొదటిసారి మందు త్రాగేటప్పుడు మీరు 'నో' చెప్పే బలం ఉంటుంది. కాని అప్పుడు 'నో' చెప్పకపోతే, తర్వాత మీ ఫ్రీవిల్ బలహీనమైపోతుంది. మీ చెడు అలవాటు ప్రబలమైపోతుంది. ఒక్కసారి త్రాగితే చాలు, వాసన ఏర్పడుతుంది; అంటే ఒక సంస్కారం మీ చిత్తంలో చోటు చేసుకుంటుంది.

కొన్ని నెలలు, సంవత్సరాలు గడిచేసరికి, ఈ విషయాలలో మీ ఫ్రీవిల్ పని చెయ్యదు. మీకు అసలు ఫ్రీవిల్ పని చెయ్యదు అనటం లేదు; ఈ చెడు అలవాట్ల విషయంలో మీ ఫ్రీవిల్ పనిచెయ్యదు అంటున్నాము. అందువల్ల ఈ చెడు అలవాట్లను పారద్రోలాలనుకుంటే భగవంతుణ్ణి శరణు వేడాలి. మీ ఫ్రీవిల్ మీ మాట వినటం మానేసింది, ఆ అలవాటును పారద్రోలాలంటే చాలా గుండెధైర్యం కావాలి. అందువల్ల భగవంతుని సహాయం కోరుకుంటున్నారు.

ఆ విధంగా మీ ఆఖరి ఆలోచన మీ అలవాట్లమీద ఆధారపడివుంటుంది. మీ అలవాట్లు మీ జీవనవిధానంమీద ఆధారపడివుంటుంది. అందువల్ల మీ జీవనవిధానం మీ ఆఖరి ఆలోచనను నిర్దేశిస్తుంది. మీ ఆఖరి ఆలోచన మీకు వచ్చే జన్మను నిర్ణయిస్తుంది.

**యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్ ।**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥** – 8.6

దీనితో ఏడవ ప్రశ్నలో మొదటి భాగానికి జవాబు వచ్చింది.

7ఎ) మరణకాలంలో దేవుణ్ణి తలుచుకోవటంలో ఏదైనా ప్రత్యేకత ఉందా?

జవాబు – ఆఖరి నిముషంలో తలుచుకున్న ఆలోచన మనకు వచ్చే జన్మను నిర్ణయిస్తుంది.

7బి) మరణకాలంలో భగవంతుణ్ణి ఎలా తలుచుకోలము?

దీనికి జవాబు ఊహించుకోవచ్చు. మరణసమయంలో మన వాసనలు బలంగా అవుతాయి, విల్ బలహీనం అవుతుంది కాబట్టి, ఇప్పటి నుంచీ మంచి వాసనలు పెంపొందించుకోవాలి.

**శుభాశుభాభ్యామ్ మార్గాభ్యామ్ వహంతి వాసన సరిత్**
**పౌరుశేషేణ ప్రయత్నేన యోజనీయ శుభామతి**

చిన్న వయస్సులో మనస్సు శుభాన్ని లేదా అశుభాన్ని అనుభవిస్తుంది. అప్పుడు మనస్సును అదుపులో పెట్టుకునే శక్తి మీకు ఉంటుంది. అందువల్ల అప్పటినుంచి మంచి మాటలు మాట్లాడాలి, మంచి ఆలోచనలు చెయ్యాలి. అలా మంచివే ఆలోచిస్తుంటే, మీ సుప్తచేతన మనస్సు మంగళకరమైన వాసనలతో లేదా మంగళకరమైన సంస్కారాలతో నిండిపోతుంది. అప్పుడు కోమాలో ఉన్నా కూడా, ఆ మనస్సులో శుభవాసనలే ఉంటాయి.

అలాంటప్పుడు సహజంగానే అటువంటి ఉపాసకుని ప్రయాణం శుభగతిలో సాగుతుంది. అంటే ఈశ్వరప్రాప్తి లభిస్తుంది. అందువల్ల ఎప్పుడూ ఈశ్వరుణ్ణే తలచుకోవాలి.

**తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ ।**
**మయ్యర్పితమనోబుద్ధిః మమేవైష్యస్యసంశయమ్ ॥** – 8.7

చదివే పుస్తకాలు మంచి పుస్తకాలు చదవండి; చూసే సినిమాలు మంచి సినిమాలు చూడండి; మీతో స్నేహం చేసేవారిని మంచివారిని ఎన్నుకోండి. ఇవన్నీ మీలో శుభవాసనలను పెంపొందిస్తాయి.

**సత్సంగత్వే నిస్సంగత్వం. దుస్సంగః సర్వథా త్యాజ్యః** – నారద భక్తిసూత్రాలు.
దుస్సంగం చెయ్యవద్దు. మంచి స్నేహితులను ఎన్నుకోండి. చెడ్డవారిని ద్వేషించనవసరం లేదు; కాని వారికి దూరంగా ఉండండి. కొండచిలువను ద్వేషించనవసరం లేదు, కాని దాని దగ్గరకు వెళ్ళకుండా ఉంటే చాలు.

**సర్వేషు కాలేషు –** నన్నే తలుచుకో అన్నాడు కృష్ణపరమాత్మ. మొదట్లో కొంచెం కష్టపడాలి కాని తర్వాత భగవన్నామస్మరణ అలవాటుగా మారుతుంది. అప్పుడు మీరు లౌకిక వ్యవహారంలో మునిగితేలుతున్నా కూడా, మీ సుప్తచేతన మనస్సు నిరంతరం భగవంతునిమీదనే ఉంటుంది. అలా భగవంతుణ్ణి తలుచుకోవటానికి ఏదైనా రూపాన్ని ఎంచుకోవచ్చు అన్నాడు కృష్ణపరమాత్మ. కృష్ణపరమాత్మ ఓంకారాన్ని ఆలంబనగా చేసుకోవచ్చు అని సూచించాడు.

అలా ఓంకారాన్నో, తన ఇష్టదైవాన్నో నిరంతరం నిష్కామ ఉపాసన చేసిన ఉపాసకుడు మరణకాలంలో కూడా ఇష్టదైవాన్నే తలుచుకుంటాడు. భీష్మాచార్యులు అంపశయ్యమీద ఉన్నప్పుడు అందరినీ పంపించేసి, కృష్ణపరమాత్మ మాత్రమే తన ముందు ఉండాలన్నాడు. ఎంత నిగ్రహమో చూడండి! అలాంటి నిగ్రహం నిష్కామ ఉపాసకుడు పెంపొందించుకోగలడు. ఫలానా వారిని చూడాలి, ఇక్కడ ఆ ఆస్తి ఉంది, అక్కడ ఆ ఆస్తి ఉంది, ఫలానా వ్యక్తి ఇంత డబ్బు తిరిగి ఇవ్వాలిలాంటి వ్యవహారాల జోలికి వెళ్ళడు. కేవలం భగవన్నామస్మరణ చేస్తాడు. ఇక్కడితో ఏడవ ప్రశ్నలో రెండవ భాగానికి జవాబు వచ్చింది.

7బి) మరణకాలంలో భగవంతుణ్ణి ఎలా తలుచుకోగలము?

జవాబు – నిష్కామ ఉపాసన నిరంతరం చేస్తూ ఉంటే శుభవాసనలు ఏర్పడి, మరణకాలంలో కూడా ఇష్టదైవాన్ని తలుచుకోగలము.

దీనితో ప్రయాణకాల ఈశ్వరస్మరణం గురించిన వివరణ ముగిసింది.

### 3. రెండు రకాల లక్ష్యాలు – శ్లోకాలు 15–22

ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ రెండు రకాల లక్ష్యాల గురించి చెప్పాడు. అవి భగవంతుడు, ప్రపంచం. వాటిని ఆధ్యాత్మ లక్ష్యం–ప్రాపంచిక లక్ష్యం అనవచ్చు లేదా శాశ్వత లక్ష్యం–అశాశ్వత లక్ష్యం అనవచ్చు.

భగవంతుడు శాశ్వతత్వానికి, భద్రతకు, శాంతికి, ఆనందాలకు ప్రతీక. ఏ మనిషి అయినా కోరుకునేది ఈ నాలుగే.

**ఓమ్ అచ్యుతాయ నమః** – ఆచమనంలో నామం

ఏ కర్మ చేయాలన్నా కూడా ఆచమనం చెయ్యాలి. ఆచమనం చెయ్యాలంటే అందులో చెప్పే మొట్టమొదటి నామం ఓం అచ్యుతాయ నమః. ఎంత అద్భుతమైన నామం! అచ్యుతాయ అంటే న విద్యతే చ్యుతిః యస్య అని అర్థం. అంటే శాశ్వతత్వానికి చిహ్నం. దేవుడే శాశ్వతత్వానికి చిహ్నం.

ఇది తెలియక శాశ్వతత్వం, శాంతి, భద్రత, ఆనందాలకోసం బాహ్యవస్తువుల వెనుక పరుగులు తీస్తాము. వాటిని అనుభవించండి, ఆస్వాదించండి కాని వాటితో మమేకం చెందకండి అన్నది కృష్ణపరమాత్మ బోధ సారాంశము. ఎందుకంటే అవేవీ శాశ్వతం కాదు. వాటన్నిటికీ దేశపరిమితి, కాలపరిమితి ఉంటాయి. కొంత కాలమయ్యాక అవన్నా మననుంచి దూరమవుతాయి లేదా మనమన్నా వాటికి దూరమవుతాము.

ఒక వ్యక్తి ఒక సన్న్యాసితో గర్వంగా చెప్పాడుట, 'చూశావా, నేను ఎంత గొప్ప ఇల్లు కట్టానో? ఇది ఎన్నటికీ నాశనం కాదు.' ఆ సన్న్యాసి చిరునవ్వు నవ్వి, 'ఇల్లు నాశనం కాదేమో కాని, నువ్వు నాశనమవుతావు,' అన్నాడు. అంటే అతను ఎప్పుడో అప్పుడు మరణిస్తాడు.

**ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున ।**
**మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥** – 8.16

14లోకాలు, ఉన్నతమైన పదవులు కూడా అశాశ్వతాలే. అవి కూడా కాలపు కోరల్లో చిక్కుకు పోవాల్సిందే. అందువల్ల ప్రాపంచిక విషయాలను అనుభవించటంలో తప్పేం లేదు కాని వాటిమీద ఆధారపడకూడదు. మీరు చేసే కర్మలకు మూడుఫలాలు వస్తాయి. అర్థ, కామ, ధర్మాలు తీరుతాయి. కాని ఆ మూడుఫలాలకు మూడుదోషాలు ఉంటాయి. అవి దుఃఖమిశ్రితత్వం, అతృప్తికరత్వం, బంధకత్వం. ఎంత గొప్ప ఫలం పొందినా దానిలో ఆనందంతో పాటు దుఃఖం; అసంతృప్తి, బంధం పెనవేసుకుని ఉంటాయి. అందువల్ల శాశ్వతమైన శాంతి, భద్రతలు, ఆనందాలను పొందలేరు.

కార్డుబోర్డు ఛెయిర్ ఉదాహరణ ఎప్పుడూ మర్చిపోకూడదు. కార్డుబోర్డు ఛెయిర్ చూడటానికి అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది, కాని దానిమీద కూర్చోటానికి పనికిరాదు. అలా ప్రపంచం అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది, కాని దానిమీద ఆధారపడటానికి పనికిరాదు. అందువల్ల జగత్తును మీ సరదాలకు వాడుకోండి; కాని శాంతి, భద్రత, ఆనందాలకోసం భగవంతునిమీద ఆధారపడండి.

అంటే 15–22 శ్లోకాల అర్థం మనిషికి రెండు లక్ష్యాలు ఉన్నాయి. అవి శ్రేయస్సు, ప్రేయస్సు. ప్రేయస్సు అంటే ధర్మ, అర్థ, కామాలు. శ్రేయస్సు అంటే మోక్షం, అంటే భగవంతుడు. ప్రేయస్సు మనకు ప్రియమైనది కాని శ్రేయస్సు మనకు శ్రేయస్కరమైనది. ఈ నాలుగింటిని కృష్ణపరమాత్మ రెండుగా కుదించాడు. జగత్తు–భగవంతుడు అన్నాడు. జగత్తును వదిలేసి, భగవంతునిమీద ఆధారపడమన్నాడు.

**4. రెండు రకాల మార్గాలు, రెండు రకాల సాధకులు – శ్లోకాలు 23–27**

ఎక్కడ రెండు లక్ష్యాలు ఉంటే, అక్కడ వాటిని చేరుకునే మార్గాలు కూడా రెండు ఉంటాయి. అలాగే ఎక్కడ రెండు మార్గాలు ఉంటే, రెండు మార్గాల్లో వెళ్ళే రెండు రకాల సాధకులు కూడా ఉంటారు. రెండు మార్గాలు – శుక్లమార్గం, కృష్ణమార్గం లేదా శుక్లగతి, కృష్ణగతి.

**కృష్ణగతి:** కృష్ణగతిలో వెళ్ళే సాధకుడు బ్రహ్మలోకం ముందు లోకం వరకూ వెళ్ళి, వెనక్కు తిరిగి వస్తాడు. అక్కడ బాగా ఆనందిస్తాడు కాని తిరుగుప్రయాణం ఉంటుంది అతనికి.

**తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం**
**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి** – 9.21

స్వర్గలోకం అంటే బ్రహ్మలోకం తప్ప తక్కిన ఐదు ఉన్నత లోకాలకు వెళతాడు. పుణ్యం నశించగానే తిరిగి వెనక్కి వస్తాడు. వెనక్కి తిరిగి వచ్చినా ఫర్వాలేదు, స్వర్గలోకసుఖాలను అనుభవిస్తాడు కదా అంటే మనమేమీ చెయ్యలేము. సరే నీ యిష్టం, ఆల్ ది బెస్ట్ అంటాము.

**శుక్లగతి:** శుక్లగతిలో వెళ్ళే సాధకుడు క్రమముక్తిని పొందుతాడు. అంటే శుక్లగతిలో వెళ్ళే సాధకుడు బ్రహ్మలోకం వెళ్ళి, సాక్షాత్తూ బ్రహ్మ దగ్గర బ్రహ్మజ్ఞానం పొంది, అక్కడ క్రమముక్తి పొందుతాడు.

| | | |
|---|---|---|
| 24వ శ్లోకం | – ఉత్తరాయణం, శుక్లపక్షం, పగలు | –శుక్లగతి |
| 25వ శ్లోకం | – దక్షిణాయనం, కృష్ణపక్షం, రాత్రి | –కృష్ణగతి |

**రెండు రకాల సాధకులు**

**శుక్లగతి సాధకుడు:** శుక్లగతిద్వారా వెళ్ళే సాధకుడు నిష్కామ ఉపాసకుడు. కర్మతో ఉపాసనను జోడించినవాడు. అతను బ్రహ్మలోకం వెళ్ళి క్రమముక్తి పొందుతాడు.

**కృష్ణగతి సాధకుడు:** కృష్ణగతిద్వారా వెళ్ళే సాధకుడు కేవలకర్మ చేసినవాడు. అతను మంచికర్మలు, పంచమహాయజ్ఞాలు చేసి ఉంటాడు. కాబట్టి కొంత పుణ్యం సంపాదించుకుని ఊర్ధ్వలోకాలకు వెళతాడు. కాని ఆ పుణ్యం క్షీణించగానే తిరిగి వెనక్కి వస్తాడు. పైగా ఉపాసన జోడించలేదు కాబట్టి బ్రహ్మలోకానికి వెళ్ళలేదు; క్రమముక్తి పొందలేదు.

ఇక్కడ ఒక విషయం మర్చిపోకూడదు. ఇక్కడ మనం కర్మ, ఉపాసనల గురించే చర్చిస్తున్నాము. ఇందులో జ్ఞానానికి చోటులేదు. అందువల్ల కర్మ గొప్పదా, ఉపాసన గొప్పదా అంటే జ్ఞానం గొప్పది అనకూడదు. జ్ఞానం గొప్పదే, సందేహం లేదు కాని జ్ఞానం పోటీలో పాల్గొనటం లేదు. ఇక్కడ మనం మాట్లాడేది అజ్ఞాని కర్మఠుడు, అజ్ఞాని ఉపాసకుల గురించి. ఇద్దరూ జ్ఞానానికి రాలేదు. అందువల్ల ఇద్దరికీ జీవన్ముక్తి, విదేహముక్తుల ప్రసక్తి లేదు.

**5. ఉపాసనా స్తుతి – శ్లోకం 28**

జ్ఞానం ప్రసక్తి లేకుండా కర్మ, ఉపాసనల మధ్యలో ఏదో ఒకటే ఎన్నుకోవాలంటే కర్మకన్నా ఉపాసన గొప్పది. ఎందుకంటే ఉపాసనవల్ల క్రమముక్తి పొందుతాడు. అందువల్ల అర్జునా! ఉపాసనామార్గం ఎన్నుకో అన్నాడు కృష్ణపరమాత్మ.

**తస్మాత్ సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున** – 8.27
**యోగీ పరం స్థానముపైతి చాద్యమ్** – 8.28

యోగి అంటే నిష్కామ ఉపాసకుడు. నిష్కామ ఉపాసకుడు పరబ్రహ్మను పొందుతాడు.

ఒకసారి జ్ఞాని, ఉపాసకుడు, కర్మటుడు పరిస్థితి టూకీగా చూద్దాము.

**జ్ఞాని** – నిర్గుణబ్రహ్మజ్ఞానం పొంది, జీవన్ముక్తి, విదేహముక్తి పొందుతాడు. అతనికి ప్రయాణం లేదు.
**ఉపాసకుడు** – సగుణబ్రహ్మ ఉపాసన చేసి, శుక్లగతిద్వారా బ్రహ్మలోకం వెళ్ళి, క్రమముక్తి పొందుతాడు.
**కర్మఠుడు** – కేవలకర్మ చేసి, ఊర్ధ్వలోకాలకు వెళ్ళి మళ్ళీ వెనక్కి తిరిగివస్తాడు. అతను ఏ విధమైన మోక్షాన్నీ పొందడు.

ఆ విధంగా ఉపాసకుణ్ణి, క్రమముక్తిని మెచ్చుకుంటూ కృష్ణపరమాత్మ ఈ అధ్యాయాన్ని ముగించాడు. కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో తన బోధను అక్షరం పదంతో మొదలుపెట్టాడు కాబట్టి ఈ అధ్యాయాన్ని అక్షరబ్రహ్మయోగము అంటారు.

## స్వామీజీ ఆణిముత్యాలు

మరణకాలంలో భగవంతుణ్ణే తలుచుకుంటూ మరణించిన వ్యక్తి భగవంతుణ్ణే పొందుతాడు, బాగానే ఉంది కాని, ఒకవేళ భగవంతుణ్ణి తలుచుకోకుండా మరణిస్తేనో? అటువంటి సందేహం గనుక మనకి వస్తే, దానికి ఒక ప్రకృతి సూత్రాన్ని వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటది?

ఒకవ్యక్తియొక్క మరుజన్మ అతను ఈ జన్మలో మరణించే సమయంలో తలుచుకున్నదానిమీద ఆధారపడి ఉంటుంది.

నిజానికి ఒక గొప్ప సామెత ఉంది. 'మనిషి ఎలా ఆలోచిస్తే, అలా అవుతాడు.' అది గొప్ప ప్రకృతి సూత్రం. అది మరణానంతరమే కాక, ఈ జన్మలో కూడా వర్తిస్తుంది.

**యో యత్ శ్రద్ధా స ఏవ సః। సః యథా కామో భవతి తద్ క్రతుర్భవతి, యత్ క్రతుర్భవతి తత్ కర్మ కురుతే, యత్ కర్మ కురుతే తద్ అభిసంపద్యతే** – బృహదారణ్యకం